'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 155

శుక్రవారం 25-8-2017




SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

నగ మాకు
వ్యాపారం మాత్రమే కాదు!

నగలకు వెల ఉండొచ్చు. కానీ, వినియోగదారులైన మీ అనుబంధం వెలకట్టలేనిది. అయితే ఈ రెండింటిలోనూ న్యాయబద్ధంగా ఉండటంలో గర్విస్తోంది మీ లలితా జ్యువెల్లరి. 'ఎస్టిమేట్ స్లిప్'.. ఇది మా తక్కువ ధరకు ఆధారం, ప్రతిరూపం మాత్రమే కాదు. మీపై ఉన్న ప్రేమను వ్యక్తపరిచే చిహ్నం. న్యాయమైన ధరలో నాణ్యతైన నగలు ఎక్కడ లభిస్తాయోనని మీరు సులువుగా తెలుసుకునేందుకు మేం చేసే ప్రయత్నం. బంగారం, వజ్రం, వెండి, చిట్.. ఏం కొనాలన్నా సరే, దీన్ని ఉపయోగించి నాలుగైదు షోరూంలలో ధరలను విచారించి ఎక్కడ ధరలు తక్కువగా ఉంటాయో అక్కడే నగలు కొని లబ్ధి పొందండి.

నగల విక్రయం మాకు వ్యాపారం మాత్రమే కాదు. మిమ్మల్ని సంతోషింపజేసేందుకు, తృప్తిపరిచేందుకు మాకు దక్కిన వరం!



LALITHAA JEWELLERY
SALES ESTIMATE

Date: 22-Aug-2017 Est.No. : 2512
Gold Rate: 2772.00 Silver Rate: 41.90

Product Name / Tag No.
Grs.Wt. V.A. Amount

SARADU (LOCAL) -G- [1-U17168464](Pcs-1)
24.152 2008.48 68957.82
EmpId : 2855

Grs.Wt : 24.152 Amount 68957.82
Total Amount 68957.82
SGST Amt (1.5%) 1034.36
CGST Amt (1.5%) 1034.36
FINAL AMOUNT 71026.54

Chit : ....
Cash : ....
Card : ....
OG/SR : ....
Advance: ....
RB/Due: ....
Total : ....

Time : 6:10 PM
*** VALID FOR FOUR HOURS ONLY***

Name : ....
Address: ....
....
....
Contact No. : ....
[ ] Old Customer [ ] New Customer

Export Quality 91.6 HallMark Jewellery

మార్కెట్‌లోనే తక్కువ తరుగు, తయారీ ధరకే బంగారు నగలు!

వజ్రాభరణాలు

క్యారెట్‌కు
రూ.48000 నుంచి!
అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్‌తో!
V.A. గ్రాముకు రూ.975 మాత్రమే.
100% Quality. E-F Colour Grade & VVS Clarity.

అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.
(Certified by Internationally Recognized Gemmology Bodies.)

మరెక్కడా సాధ్యంకాని అరుదైన ఆదా!

స్వర్ణ కమలం

11 నెలల 'నగల కొనుగోలు పథకం'.
సులభ వాయిదాలు:
రూ.1000, రూ.2000, రూ.2500

చిట్

తొలినెల వాయిదా మీ కోసం లలితా జ్యువెల్లరి చెల్లిస్తుంది.

తరుగు లేదు. 0% తరుగు

నగదు రూపంగానూ, బంగారం రూపంగానూ ఆదా చేసుకునే సౌలభ్యం.

Lalithaa™
BIS 916 హాల్‌మార్క్

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై లిమిటెడ్

లక్షలాది డిజైన్లు !

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్.
ఫోన్: 0891-6600001.

తిరుపతి : 481/482. రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్ రోడ్డు.
(V.V. మహల్ రోడ్డు). ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.

హైదరాబాద్ • తిరుపతి • విశాఖపట్నం • చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు

శుక్రవారం 25-8-2017

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 155

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి వినాయక చవితి శుభాకాంక్షలు

వై.ఎస్. భారతి
చైర్‌పర్సన్

గోప్యత ప్రాథమిక హక్కే

పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛలో అది అంతర్భాగం ● సుప్రీం కోర్టు ధర్మాసనం ఏకగ్రీవ తీర్పు

గత తీర్పులు రద్దు

ఆధార్‌కు ప్రత్యేక భద్రతా వ్యవస్థ

- వివరాలు 10,11లో

గోప్యత అంటే..

- వ్యక్తిగత అన్యోన్యత, ఇల్లు
- కుటుంబ జీవితం
- వివాహం, సంతానం
- లింగనేపథ్యం తదితరాలు



"వ్యక్తిగత గౌరవం, ప్రజల మధ్య సమానత్వం, స్వేచ్ఛగా జీవించాలని కోరుకోవటం భారత రాజ్యాంగ మూల స్తంభాల లాంటివి. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలను రాజ్యాంగం సృష్టించలేదు. ప్రతి వ్యక్తిలో అంతర్గతంగా, అవిభాజ్యంగా ఉండే అంశాలను రాజ్యాంగం గుర్తించింది. గోప్యత రాజ్యాంగం పరిరక్షించే హక్కు. ఆర్టికల్ 21 ప్రకారం జీవించటం, వ్యక్తిగత స్వేచ్ఛనుంచే గోప్యత పుట్టుకొచ్చింది. ప్రాథమిక హక్కులైన స్వేచ్ఛ, గౌరవంలోనూ గోప్యత అంతర్గత భాగమే.

- ధర్మాసనం

సెలవు

వినాయకచవితి సందర్భంగా నేడు (శుక్రవారం) సాక్షి కార్యాలయానికి సెలవు. కావున శనివారం సంచిక వెలువడదు. పునర్దర్శనం ఆదివారం.



నేడే మార్కెట్లోకి రూ.200 నోటు

విడుదల చేయనున్న ఆర్‌బీఐ

- బిజినెస్‌లో

రౌడీ రాజ్యం

నంద్యాల్లో మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డిపై హత్యాయత్నం





నంద్యాలలోని సూరజ్ హోటల్ వద్ద పట్టపగలు వేటకొడవలి పట్టుకుని వీరంగం సృష్టిస్తున్న టీడీపీ నేత అభిరుచి మధును బుజ్జగిస్తున్న పోలీసులు. (ఇన్‌సెట్‌లో) ఫైరింగ్‌లో కిందపడ్డ బుల్లెట్లు

- నడిరోడ్డుపై వేట కొడవలితో టీడీపీ నేత అభిరుచి మధు వీరంగం
- రెండు రౌండ్లు కాల్పులు జరిపిన మధు గన్‌మ్యాన్
- కనీసం అదుపులోకి తీసుకోని పోలీసులు
- కార్లో కూర్చోబెట్టి రాచ మర్యాదలతో పంపిన వైనం
- అంతా పక్కా ప్రణాళిక ప్రకారమే అని ఆరోపణలు
- తొలుత బాధితులపైనే కేసు నమోదు
- ఆ తర్వాతే అధికార పార్టీ నేతలపై కేసులు..
- రౌడీషీట్ ఎత్తివేసి మధుకు గన్‌మ్యాన్‌ను కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే దాడులు!

8లో

రేపు వెలగపూడిలో ఉపరాష్ట్రపతికి పౌరసన్మానం

సాక్షి, విజయవాడ: భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తొలిసారిగా రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా ఈ నెల 26న వెలగపూడిలో ఆయనకు పౌరసన్మానం చేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం విజయవాడలో ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, దేవినేని, కామినేని సమీక్షించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 9.20 గంటలకు వెంకయ్యనాయుడు గన్నవరం ఎయిర్ పోర్టుకు వస్తారని, అక్కడి నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సుమారు 23 కి.మీ. మేర రోడ్డుకు ఇరువైపులా జాతీయ జెండాలు పట్టుకుని విద్యార్థులు, ప్రజలు, అభిమానులు ఆయనకు స్వాగతం పలుకుతారని తెలిపారు. కేంద్రమంత్రిగా వెంకయ్యనాయుడు రాష్ట్రానికి 2.25 లక్షల ఇళ్లు మంజూరు చేస్తూ చివరి సంతకం చేశారని, ఆ ఇళ్ల శంకుస్థాపన ఆయన చేతుల మీదుగానే చేయిస్తున్నట్లు మంత్రులు వెల్లడించారు.

ప్రభుత్వ ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ

- కట్టడాలున్న స్థలాలకే వర్తింపు
- బీపీఎల్ కుటుంబాలకు వంద గజాల వరకూ ఉచితం
- 500 గజాల వరకూ క్రమబద్ధీకరణ



సాక్షి, అమరావతి: అభ్యంతరాలు లేని ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లోని కట్టడాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గరిష్టంగా 500 గజాల వరకూ క్రమబద్ధీకరించనున్నట్లు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 500 గజాలకు మించిన ఆక్రమణలను తొలగించడం గానీ, వేలం వేయడం గానీ చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. జీవో మేరకు ఆక్రమణల క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలిలా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలతోపాటు అన్ని ప్రాంతాలకు ఇవి వర్తిస్తాయి. దారిద్ర్యరేఖకు దిగువనున్న (బీపీఎల్) కుటుంబాలకు సంబంధించిన ఆక్రమణలను వంద గజాల వరకూ ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. దారిద్ర్య రేఖకు ఎగువనున్న (ఏపీఎల్) కుటుబాలవారైతే వంద గజాలకైనా నిర్దిష్ట మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. వంద గజాలకు మించిన స్థలాల క్రమబద్ధీకరణకు ఏపీఎల్, బీపీఎల్ కుటుంబాలు 2013 రిజిస్ట్రేషన్ విలువలో నిర్దిష్ట రేటు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. 2014 జనవరి ఒకటో తేదీ నాటికి ఉన్న ఆక్రమిత స్థలాల్లోని కట్టడాలకే ఈ పథకం వర్తిస్తుంది. ఖాళీ స్థలాలకు ఇది వర్తించదు. కట్టడాలుంటేనే క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆక్రమణల క్రమబద్ధీకరణ కోసం గురువారం నుంచి 120 రోజుల్లో 'మీసేవ' కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్దిష్ట నమూనాలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి నమూనా దరఖాస్తును కూడా రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) రూపొందించి జీవోలో జత చేశారు. ఇలా దరఖాస్తు చేసుకోనివారి ఆక్రమణలను అధికార యంత్రాంగం తొలగిస్తుంది. గతంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటారు.

అర్హులెవరు?: 2014 జనవరి ఒకటో తేదీ నాటికి ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో కట్టడాలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. బీపీఎల్ కింద ప్రయోజనం పొందాలంటే తెల్ల రేషన్ కార్డు సమర్పించాలి. ఒకవేళ ఇది లేకపోతే బీపీఎల్ కేటగిరిలోకి వచ్చే విధంగా తహసీల్దారు నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. కుటుంబంలో ఒకరికే ఈ పథకం కింద ప్రయోజనం కల్పిస్తారు. ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తు చేయడానికి ఆధార్ కార్డు గానీ ఇతరత్రా ఐడీ కార్డ్ గానీ సమర్పించాలి. దరఖాస్తును అధికార యంత్రాంగం ఆమోదించిన ఆరు నెలల్లోగా నాలుగు విడతల్లో నిర్ధారిత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని చెల్లించిన తర్వాత జిల్లా కలెక్టరుగానీ, కలెక్టరు ధ్రువీకరించిన అధికారిగానీ రిజిస్ట్రేషన్ చేయడానికి అనుమతిస్తారు. ఇందుకయ్యే రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీలను దరఖాస్తుదారే భరించాలి. ఆరునెలల్లో నిర్ధారిత సొమ్ము చెల్లించని పక్షంలో ఆక్రమణల తొలగింపునకు అధికార యంత్రాంగం న్యాయపరమైన చర్యలు తీసుకుంటుంది.

ఆమోద ప్రక్రియ ఇదీ..

ఆక్రమణల నిర్ధారణకు కొన్ని రకాల డాక్యుమెంట్లను ఆధారాలుగా పరిగణిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు, ఆస్తి పన్ను రసీదు, విద్యుత్తు బిల్లు, నీటి పన్ను చెల్లింపు రసీదు, ఇతరత్రా ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటారు.

- మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులన్నీ సంబంధిత తహసీల్దారుకు వెళతాయి. తహసీల్దారు ప్రతి దరఖాస్తును పరిశీలించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి తన సిఫార్సుతో సంబంధిత సబ్ డివిజన్/జిల్లా స్థాయి కమిటీకి పంపుతారు. సబ్ డివిజన్/ జిల్లా స్థాయి కమిటీలు ఆమోదించిన తర్వాత పట్టాల పంపిణీకి తహసీల్దారు తగు చర్యలు తీసుకుంటారు.
- కమిటీ ప్రతిస్థాయిలోనూ 120 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలి. లేని పక్షంలో సంబంధిత దరఖాస్తును ఆమోదించినట్లే అవుతుంది.
- సబ్ డివిజనల్ స్థాయి కమిటీ నిర్ణయంపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోగా జాయింట్ కలెక్టర్ -1కు అప్పీల్ చేసుకోవచ్చు. దీనిపై జాయింట్ కలెక్టర్ -1దే తుది నిర్ణయం. జిల్లా కమిటీ నిర్ణయంపై అభ్యంతరం ఉన్నవారు ఉత్తర్వులు వచ్చిన 30 రోజుల్లోగా సీసీఎల్ఏకి అప్పీల్ చేసుకోవచ్చు. సీసీఎల్ఏదే తుది నిర్ణయం.

వైఎస్ జగన్‌కు స్వల్ప అస్వస్థత



సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో విరామమెరుగకుండా 13 రోజుల పాటు వాడవాడలా పర్యటించిన జగన్ చివరి రెండు రోజుల పాటు వర్షంలో తడవడం తెలిసిందే. గత మూడు రోజులుగా ఆయన జ్వరం, జలుబుతో బాధపడుతున్నారు, వైద్యుల సలహా మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రజలకు జగన్ వినాయక చవితి శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ ప్రజలందరికీ విజయం చేకూర్చాలని జగన్ ఆకాంక్షించారు. అభివృద్ధి పరంగా ఇరు రాష్ట్రాలకు విఘ్నాలు తొలగి ఇక మీదట అన్నీ విజయాలే సిద్ధించాలని ఆయన కోరుకున్నారు.

రేపు కాకినాడలో వైఎస్ జగన్ ప్రచారం

కాకినాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆయన ఈ నెల 26వ తేదీన నగరంలోని 12 డివిజన్లలో కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను వైఎస్సార్‌సీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురామ్, మాజీ మంత్రి పి.పార్థసారథి గురువారం విలేకరులకు తెలిపారు. జగన్ ఎన్నికల ప్రచారం శనివారం కాకినాడ జగన్నాథపురం ప్రాంతంలోని చంద్రిక థియేటర్ నుంచి ప్రారంభమై 12 డివిజన్ల మీదుగా కొనసాగుతుందన్నారు. 25, 26 డివిజన్ల పరిధి నుంచి ప్రారంభమై 24, 23, 22, 21, 20, 19, 16, 18, 17,15 డివిజన్ల మీదుగా గాంధీ సెంటినరీ వద్ద ప్రచారం ముగుస్తుందన్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు జగన్ పర్యటన జరుగుతుందన్నారు. కాకినాడలో పార్టీ అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులను కోరారు.

ఐసీడబ్ల్యూఏలో తెలుగు తేజాలు



సాయిశ్రీలక్ష్మి చల్లారామ్

లబ్బీపేట (విజయవాడ తూర్పు) : ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గురువారం విడుదల చేసిన ఐసీడబ్ల్యూఏ (సీఎంఏ) ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. కృష్ణాజిల్లా కైకలూరుకు చెందిన కొణిజేటి సాయిశ్రీలక్ష్మి ఫైనల్‌లో ఆలిండియా స్థాయిలో రెండో ర్యాంకు సాధించగా, ఇంటర్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన ఉపమాక చల్లారామ్ ఆలిండియా 7వ ర్యాంకు, మెదక్ జిల్లా సిద్ధిపేటకు చెందిన గంగి స్వప్న 20వ ర్యాంకు సాధించారు. విజయవాడ రెవెన్యూ కాలనీకి చెందిన కటకం తేజశ్వీ 24వ ర్యాంకు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పెరుమాళ్ల సౌభాగ్య 28వ ర్యాంకుతో సత్తా చాటారు. వీరందరూ తమ ఇన్‌స్టిట్యూట్‌లోనే శిక్షణ పొందారని సూపర్‌విజ్ ప్రిన్సిపాల్ సబ్బినేని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తమ విద్యార్థులు ఈ ఫలితాల్లో 50లోపు 2, 7, 20, 24, 28, 37, 40 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. కాగా ''ఆలిండియా స్థాయిలో రెండో ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. నా మీద తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నా.'' అని కైకలూరుకు చెందిన సాయిశ్రీలక్ష్మి అన్నారు. ''ఆలిండియా స్థాయిలో ఏడో ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఈ ర్యాంకును తల్లిదండ్రులకు అంకితం ఇస్తున్నా.'' అని ఇంటర్ ఏడో ర్యాంకర్ చల్లారామ్ చెప్పారు.

నత్తనడకన 'పోలవరం' పనులు

- పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) బృందం అసంతృప్తి
- ఒప్పందంలోగా పనులు పూర్తి చేయడం అసాధ్యమే
- ప్రాజెక్టు పనులను పరిశీలించిన బృందం



పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీపీఏ కమిషనర్ కె.వోహ్రా, కమిటీ సభ్యులు

సాక్షి, అమరావతి/పోలవరం: పోలవరం ప్రాజెక్టు పనుల తీరుపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మూడేళ్లవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పీపీఏతో ఒప్పందం చేసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీసింది. ఇప్పటివరకూ చేసిన ఖర్చుకు, క్షేత్రస్థాయిలో జరిగిన పనులకూ పొంతన లేదని స్పష్టం చేసింది. పనులు ఇలాగే సాగితే 2018 నాటికి కాఫర్ డ్యామ్‌ను ఎలా పూర్తి చేసి, గ్రావిటీ ద్వారా నీళ్లందిస్తారని, 2019 నాటికి ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారని నిలదీసింది. పనుల నాణ్యతపైనా అసంతృప్తి వ్యక్తం చేసింది. నవంబర్‌లో మరోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపింది.

గడువులోగా కాఫర్ డ్యామ్ నిర్మించగలరా?

కేంద్ర జలవనరుల శాఖ కమిషనర్ కె.వోహ్రా సారథ్యంలో కేంద్ర జలసంఘం సభ్యులు మసూద్ హుస్సేన్, జాయింట్ కమిషనర్ శ్రీవాత్సవ, డిజైన్స్ రివ్యూ కమిటీ ఛైర్మన్ ఏబీ పాండ్య, సభ్య కార్యదర్శి ఆర్కే గుప్తాలతో కూడిన పీపీఏ బృందం గురువారం పోలవరానికి చేరుకుంది. తొలుత పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్(ప్రధాన పనులు) వద్దకు చేరుకున్న పీపీఏ బృందం.. స్పిల్‌వే, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనులను నిశితంగా పరిశీలించింది. అనంతరం రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమైంది. పోలవరం కాలువలకు గ్రావిటీ ద్వారా నీళ్లందించాలంటే కనీసం 41.15 మీటర్ల ఎత్తుతో కాఫర్ డ్యామ్‌ను నిర్మించాలని.. అదే ఎత్తుతో స్పిల్‌వే నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పింది. కానీ, పనుల తీరును చూస్తే గడువులోగా కాఫర్ డ్యామ్‌ను నిర్మించడం సాధ్యం కాదేమోనని అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా స్పిల్ ఛానల్ కాంక్రీట్ పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామంటూ జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇన్నాళ్లూ ఏం చేశారని నిలదీసింది. స్పిల్‌వే, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనుల నాణ్యతపై పెదవి విరిచిన పీపీఏ.. సీఎస్ఎంఆర్ఎస్ఏ సూచించిన నాణ్యతా ప్రమాణాల మేరకు పనులు చేయాలంది.

ఖర్చుకు, పనులకు పొంతన లేదు

పోలవరం ప్రాజెక్టు పనులపై ఇప్పటిదాకా రూ.12,917.69 కోట్లు ఖర్చు చేశామని జలవనరుల శాఖ అధికారులు వివరించారు. ఇందులో రూ.3,793 కోట్లను కేంద్రం చెల్లించాల్సి ఉందని చెప్పారు. కమిషనర్ కె.వోహ్రా, సీడబ్ల్యూసీ సభ్యులు మసూద్ హుస్సేన్ జోక్యం చేసుకుంటూ.. చేసిన ఖర్చుకూ, పనుల తీరుకు ఏమాత్రం పొంతన కుదరడం లేదని కుండబద్దలు కొట్టారు. కేంద్రం ఇప్పటివరకూ విడుదల చేసిన నిధుల వినియోగానికి సంబంధించిన యూసీలను సమర్పించాలన్నారు. బిల్లులు సమర్పిస్తే, కేంద్రం రూ.1,000 కోట్ల నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని పీపీఏ కమిటీ కమిషనర్ కె.వోహ్రా అన్నారు. నిధులు వస్తాయన్నారు. ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ శాఖకు సంబంధించి వివాదాలు వస్తున్నాయని, కొందరు కోర్టులకు వెళ్తున్నారని, దీన్ని ఎలా పరిష్కరించాలనేది కేంద్రం పరిశీలిస్తోందన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మద్దికెర: అప్పుల బాధకు మరోరైతు బలయ్యాడు. కర్నూలు జిల్లా మద్దికెరలో రైతు బంగి సుధాకర్ (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. సుధాకర్ తన తండ్రి సోమన్నకు చెందిన రెండు ఎకరాలతో పాటు మరో 13 ఎకరాలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. వరుసగా నాలుగేళ్ల కరువుతో పెట్టుబడులు సైతం తిరిగి రాలేదు. దీంతో అప్పులు పెరిగిపోయాయి. ఈ ఏడాది సజ్జ, కంది సాగు చేశాడు. వర్షాలు సరిగా కురవకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద చేసిన అప్పులు దాదాపు రూ. 5 లక్షలకు చేరాయి. తన పేరుపై పొలం లేకపోవడంతో పంట రుణం తీసుకోలేదు. బుధవారం మధ్యాహ్నం పంటలు చూసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి పది అయినా భర్త తిరిగి రాకపోవడంతో భార్య హనుమంతమ్మ.. అత్తామామలతో కలసి పొలం వద్దకు వెళ్లి చూడగా సుధాకర్ మృతదేహం కన్పించింది. పక్కనే పురుగుల మందు డబ్బా ఉంది. పంటలు పండకపోవడంతో అప్పులెలా తీర్చాలోనని ఇటీవల తరచూ ఆవేదన చెందుతుండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సుధాకర్‌కు ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రేపు నాలుగో విడత మెడికల్ వెబ్ కౌన్సెలింగ్

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రంలోని ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కాంపిటెంట్ అథారిటీ(ప్రభుత్వ, ప్రైవేటు ఏ-కేటగిరీ) సీట్ల అడ్మిషన్ల కోసం ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 27వ తేదీ మధ్యాహ్నం 2 వరకు నాలుగో విడత వెబ్(ఆప్షన్లు) కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు.

27 నుంచి పీజీ ఈసెట్ కౌన్సెలింగ్

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ పీజీ ఈసెట్ ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను ఆగస్టు 27, 28వ తేదీల్లో నిర్వహించనున్నట్టు కన్వీనర్ ఆచార్య పి.ఎస్.అవధాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గేట్, జీపాట్, ఏపీ పీజీ ఈసెట్- 2017లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మశీ కోర్సుల్లో ప్రవేశాల కోసం గేట్, జీపాట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈనెల 27, 28వ తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. అలాగే ఏపీ పీజీ ఈసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు www.appgecet. nic.in, www.andhrauniversity .edu.in వెబ్‌సైట్‌లను సంప్రదించవచ్చన్నారు.

ఏయూ పీజీ పరీక్షలు వాయిదా

ఏయూక్యాంపస్ (విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 28వ తేదీ నుంచి జరగాల్సిన పీజీ పరీక్షలను, సెప్టెంబర్ 6వ తేదీ నుంచి జరగాల్సిన యూజీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలను వాయిదా వేసినట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

తగ్గిన ఇంటర్ కాలేజీల అఫిలియేషన్ ఫీజులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికే పెంచిన ఇంటర్మీడియెట్ కళాశాలల అఫిలియేషన్, ఇన్‌స్పెక్షన్ల రుసుములను 50 శాతానికి కుదిస్తూ ఇంటర్ బోర్డు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కాలేజీల అఫిలియేషన్, ఇన్‌స్పెక్షన్ ఫీజులను 300 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. ఈ భారం అంతిమంగా విద్యార్థులపైనే పడుతుందని, కాలేజీల నుంచి దండుకోవడానికే ఇంటర్ బోర్డు అఫిలియేషన్ ఫీజులను భారీగా పెంచిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. అఫిలియేషన్, ఇన్‌స్పెక్షన్ ఫీజులపై ప్రతిష్టంభన ఏర్పడి కాలేజీలకు అనుమతులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కళాశాలల యాజమాన్యాలతో మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతో సమావేశమయ్యారు. పెంచిన అఫిలియేషన్ ఫీజులను 300 శాతం నుంచి 50 శాతానికి కుదిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఈ ఫీజులను చెల్లింపునకు ఆగస్టు 31 వరకు గడువు ఇచ్చింది.

ఆ కోర్సులకు 371డి వర్తించదు

- పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సీట్లపై స్పష్టం చేసిన హైకోర్టు
- మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేత.. సీట్ల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- నీట్ ద్వారా భర్తీ చేయాలని ఆదేశించిన ధర్మాసనం
- ఆర్టికల్ 371డి, రాష్ట్రపతి ఉత్తర్వులపై చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్టీఆర్, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయాల పరిధిలోని 'డీఎం, ఎంసీహెచ్' సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీకి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ కోర్సుల్లో సీట్ల భర్తీపై ఇటీవల విధించిన స్టేను గురువారం ఎత్తివేసింది. ఈ రెండు విశ్వవిద్యాలయాల పరిధిలోని విద్యా సంస్థలన్నీ కూడా జాతీయ స్థాయి కౌన్సెలింగ్ (నీట్) ద్వారా సూపర్ స్పెషాలిటీ సీట్లను భర్తీ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 371డి, రాష్ట్రపతి ఉత్తర్వులు ఈ కోర్సులకు వర్తించవని తేల్చి చెప్పింది. అయితే తెలంగాణ, ఏపీల విద్యార్థులకు ఇప్పుడు 371డి, రాష్ట్రపతి ఉత్తర్వులు గుదిబండగా మారాయని వ్యాఖ్యానించింది. ఇవి ముఖ్య అంశాలని, వీటిపై తుది విచారణ సమయంలో తేలుస్తామని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ వి.రామసుబ్రమణ్యన్, జస్టిస్ తెలప్రోలు రజనిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

కేంద్ర ఉత్తర్వులు సమంజసమే..

ఎన్టీఆర్, కాళోజీ వైద్య వర్సిటీల పరిధిలో సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లను జాతీయ స్థాయి కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ డాక్టర్ బి.సతీశ్‌కుమార్, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వాటిపై ఈ నెల 17న విచారణ జరిపిన ధర్మాసనం.. సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో సీట్ల భర్తీపై స్టే విధించింది. గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ సీట్ల భర్తీపై కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం కాదని తేల్చి చెప్పింది. 'కేసు దాఖలు చేసిన వ్యక్తికి అనుకూలంగా ప్రాథమిక ఆధారాలున్నా మధ్యంతర ఉత్తర్వుల ద్వారా తాను పొందే ప్రయోజనం అధిక సంఖ్యాకులకు నష్టదాయకమైతే, ఆ వ్యక్తి అటువంటి మధ్యంతర ఉత్తర్వులను పొందజాలడు.. ఈ వ్యాజ్యాల్లో ఈ నెల 17న మేం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు కొంత మందికి లబ్ధి చేకూరుస్తాయి. కానీ దేశవ్యాప్తంగా సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన అనేక మందికి కష్టంగా మారాయి. వారంతా తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన వారే. కాబట్టి 'బ్యాలెన్స్ ఆఫ్ కన్వీనియన్స్', వారికి కలుగుతున్న కష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటూ స్టేను ఎత్తివేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.

అడ్మిషన్ పొందిన చోటే పరీక్షలు

ఎస్వీయూ దూరవిద్య విభాగానికి హైకోర్టు ఆదేశాలు

యూనివర్సిటీ క్యాంపస్ (తిరుపతి): శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయు) దూర విద్య విభాగం వైఖరిపై హైకోర్టు తప్పుబట్టింది. విద్యార్థులు అడ్మిషన్ పొందిన చోటే పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ఎస్వీయూ–2014లో పీజీ, యూజీ కోర్సుల్లో చేరినవారికి వచ్చే సోమవారం నుంచి పరీక్షలు మొదలుకానున్నాయి. యూనివర్సిటీ పరిధిలో 102 స్టడీ సెంటర్లు ఉండగా ఆయా కేంద్రాల్లోనే పరీక్షలు నిర్వహించేవారు. ఎస్వీయూ దూరవిద్య కోర్సుల్లో చేరే సమయంలో అదే కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తారనే ఉద్దేశంతో విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా ధర్మవరంలోని శ్రీ గణేష్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్టడీ సెంటర్‌కు అనంతపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రంగా నిర్ణయించారు. అక్కడ చేరిన విద్యార్థులు సోమవారం నుంచి జరిగే పరీక్షలకు అనంతపురం వెళ్లి పరీక్షలు రాయాల్సి ఉంది. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. తాము అడ్మిషన్ పొందిన సమయంలో ధర్మవరంలోనే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పడంతో అడ్మిషన్ పొందామని, ఇప్పుడు అనంతపురం వెళ్లి పరీక్షలు రాయమంటున్నారని, ఇది తమకు కష్టమని హైకోర్టుకు నివేదించారు. కేసును స్వీకరించిన హైకోర్టు ధర్మవరంలోని అధ్యయన కేంద్రంలో చేరిన విద్యార్థులకు అక్కడే పరీక్షలు నిర్వహించాలని, ఈ అంశాన్ని పత్రికల్లో ప్రకటన ఇచ్చి విద్యార్థులకు వెంటనే తెలిసేలా చేయాలని ఎస్వీయూ అధికారులకు ఆదేశాలు జారీచేసింది.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ ప్రభంజనం

గుంటూరు: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా బుధవారం విడుదల చేసిన సీఎంఏ ఇంటర్, సీఎంఏ ఫైనల్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. 2012, 2016 సిలబస్‌తో సీఎంఏ ఇంటర్ పరీక్ష రాసిన విద్యార్థుల్లో 24 మంది ఆలిండియా 50 లోపు ర్యాంకులు సాధించారని చెప్పారు. అలాగే సీఎంఏ ఫైనల్ పరీక్ష రాసిన వారిలో 8 మంది విద్యార్థులు ఆలిండియా 50 లోపు ర్యాంకులు సాధించారని వివరించారు. క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం, నూతన బోధనా పద్ధతులతోనే ఈ ఫలితాలు సాధించామన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

2500 మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ఐదు కంపెనీల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్న బీసీ కార్పొరేషన్



సాక్షి, అమరావతి: బీసీ నిరుద్యోగులకు ఐదు కంపెనీల ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఎండీ హర్షవర్ధన్ తెలిపారు. తొలి విడతగా 2500 మందితో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఇప్పటికే అపోలో మెడ్ స్కిల్స్ లిమిటెడ్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్, ఇండో జర్మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీల ద్వారా నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇప్పించి ఉద్యోగం కల్పిస్తున్నట్లు చెప్పారు. అపోలో మెడ్ స్కిల్స్ ద్వారా 1200 మందికి సంవత్సరం పాటు డిప్లొమా కోర్స్‌ల్లో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. డ్రైవింగ్, ప్లాస్టిక్ వస్తువుల తయారీ, ఆటోమొబైల్ రంగాలపై శిక్షణ ఉంటుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం వెబ్‌సైట్‌ను కాకినాడ జేఎన్టీయూ ద్వారా రూపొందించినట్లు చెప్పారు. శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకునే వారు నేరుగా వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, అందులోనే ఏ కంపెనీల్లో శిక్షణ తీసుకుంటే బాగుంటుందనే వివరాలు కూడా ఉన్నాయన్నారు.

అంతర్జాతీయ స్మగ్లర్ మైదీన్ అరెస్టు

- 1.10 టన్నుల ఎర్రచందనం దుంగలు, 5 కార్లు స్వాధీనం
- నిందితుడికి రూ.77.50 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు
- వైఎస్సార్ జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ వెల్లడి


నిందితుడినిమీడియాకు చూపిస్తున్న జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ

సాక్షి, కడప: దాదాపు 20 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ ఎ.టి.మైదీన్‌ను వైఎస్సార్ జిల్లా పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 1.10 టన్నుల ఎర్రచందనం దుంగలతోపాటు రూ.54 వేల నగదు, రెండు బీఎండబ్ల్యూ కార్లు, రెండు నిస్సాన్ కార్లు, ఒక టాటా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను గురువారం కడపలో జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ మీడియాకు వెల్లడించారు. బుధవారం రాత్రి 10 గంటలకు మైదుకూరు–బద్వేలు ప్రధాన రోడ్డులోని చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మైదీన్‌తో పాటు అతని అనుచరులైన సాదిక్, కమాల్ బాషాలు తమ చేతికి చిక్కినట్లు ఎస్పీ తెలిపారు.

హౌస్ కీపర్ నుంచి మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్‌గా..

పదో తరగతి తప్పిన మైదీన్ 1987లో అండమాన్ దీవులకు వెళ్లి ఫైవ్‌స్టార్ హోటల్‌లో హౌస్ కీపర్‌గా చేరాడు. తర్వాత సముద్ర చిప్పలను విదేశాలకు ఎగుమతి చేయడం మొదలుపెట్టాడు. 1990లో అండమాన్ నుంచి తిరిగి చెన్నైకి చేరుకొని ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థను ప్రారంభించాడు. కొంతమంది స్మగ్లర్లతో ఏర్పడిన పరిచయాలతో.. ఎర్రచందనం దుంగల అక్రమ రవాణాకు తెర తీశాడు. ఇప్పటి వరకు 3 వేల టన్నుల ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేసినట్లు ఎస్పీ బాబూజీ తెలిపారు. హాంకాంగ్, దుబాయ్, సింగపూర్, మలేసియా, చైనాలకు అక్రమంగా తరలించేవాడని వివరించారు.

భారీగా ఆస్తులు: మైదీన్‌కు రెండు బీఎండబ్ల్యూ కార్లు, రెండు నిస్సాన్ కార్లు, ఒక ఇన్నోవాతోపాటు నాగపట్నంలో ప్యాలెస్, రెండు అపార్ట్‌మెంట్లు, ప్యాలెస్ లాడ్జి, ఎన్‌క్లేవ్ ఉన్నాయని ఎస్పీ తెలిపారు. పాండిచ్చేరిలో రూ.4 కోట్ల లాడ్జి, రూ.3 కోట్ల గార్డెన్ హౌస్, రూ.4 కోట్ల కొబ్బరి, మామిడి తోటలు.. చెన్నైలో రూ.10 కోట్ల కన్వెన్షన్ హాల్ ఉన్నట్లు తెలిపారు.

సాక్షి
శుక్రవారం, ఆగస్టు, 25

గోప్యతకు పట్టం

చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సందర్భాలు చాలా అరుదుగా వస్తాయి. వ్యక్తిగత గోప్యత జీవించే హక్కులో భాగమని, అది పౌరుల ప్రాథమిక హక్కని నిర్ధారిస్తూ సర్వోన్నత న్యాయస్థానం గురువారం వెలువరించిన తీర్పు అలాంటి సందర్భమే. తొమ్మిదిమంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం వ్యక్తిగత గోప్యతను కేవలం వ్యక్తి భద్రతకు సంబంధించిన భావనగా పరిమితార్థంలో చూడలేదు. దేన్ని ఎంపిక చేసుకోవాలో, దేనికి ప్రాధాన్యమివ్వాలో నిర్ణయించుకునే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు పౌరులకుంటాయని... అలా లేనట్టయితే అసలు మనిషి మనుగడకే అర్థం లేదని స్పష్టం చేసింది. పౌరులు జరిపే సమస్త లావాదేవీలకూ ప్రభుత్వాలు ఆధార్‌ను తప్పనిసరిచేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతుండగా అసలు వ్యక్తిగత గోప్యత అన్నది ప్రాథమిక హక్కా కాదా అన్న అంశం చర్చలోకి వచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత గోప్యత లేనేలేదని కేంద్ర ప్రభుత్వం వాదించగా... జీవించే హక్కులో అది భాగమని, పౌరులకు గోప్యతనేది లేకుండా జీవించే హక్కుకు అర్థమేముంటుందని పిటిషనర్లు ప్రశ్నించారు. దాంతో ఆధార్ చెల్లుబాటు సంగతి తేల్చడానికి ముందు ఈ వ్యక్తిగత గోప్యత ఎలాంటి హక్కు అన్నది నిర్ధారించాలని ఆ సమయంలోనే సుప్రీంకోర్టు భావించింది. అందుకనుగుణంగా తొమ్మిదిమందితో కూడిన ధర్మాసనం ఏర్పాటైంది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు చేసిన తాజా నిర్ధారణతో ఇప్పుడు ఆధార్ చెల్లుబాటు కేసు ఏమవుతుందన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొన్నది.

కఠిన చట్టాల ద్వారా కార్యనిర్వాహక వ్యవస్థకు సంక్రమించే అధికారాలకూ... పౌరుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకూ మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు రెండింటిమధ్యా సమతూకం ఉన్నదో లేదో నిర్ధారించడం, రాజ్యాంగదత్తమైన ప్రాథమిక హక్కులు కబ్జాకు గురికాకుండా చూడటం న్యాయవ్యవస్థకు సంక్లిష్టమైన సవాలు. అత్యవసర పరిస్థితి కాలంలో ఆంతరంగిక భద్రతా చట్టం(మీసా)కింద అరెస్టయి జైళ్లలో మగ్గుతున్న పౌరుల తరఫున దాఖలైన పిటిషన్లను దేశంలోని తొమ్మిది హైకోర్టులు అంగీకరించి వారి విడుదలకు ఆదేశాలిచ్చినప్పుడు సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రజాస్వామికవాదులను దిగ్భ్రాంతిపరిచింది. పౌరులను నిరవధికంగా నిర్బంధించడానికి అవకాశమిచ్చే అలాంటి నిరంకుశ చట్టం చెల్లుతుందని 4–1 మెజారిటీతో ఇచ్చిన ఆ తీర్పు తర్వాత సుప్రీంకోర్టు మళ్లీ ఎప్పుడూ అలాంటి తొట్రుపాటుకు లోనుకాలేదు. గత నాలుగు దశాబ్దాల చరిత్రలో సర్వోన్నత న్యాయస్థానం ప్రతి సందర్భంలోనూ పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చింది. అలాంటి అనేక తీర్పుల్లో గురువారం నాటి తీర్పు విశిష్టమైనదని చెప్పవచ్చు.

వ్యక్తిగత గోప్యతకు రాజ్యాంగపరమైన రక్షణ లేదని 1950లో ఎంపి శర్మ కేసులో ఆరుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది. తిరిగి 1960లో ఖరక్‌సింగ్ కేసులో సైతం ఎనిమిదిమందితో కూడిన ధర్మాసనం ఆ విధంగానే చెప్పింది. అయితే అనంతరకాలంలో వేర్వేరు సందర్భాల్లో అదే న్యాయస్థానం గోప్యత హక్కును గుర్తించింది. మెజారిటీ సభ్యులిచ్చిన తీర్పుల్ని అంతకన్నా తక్కువమంది న్యాయమూర్తులున్న బెంచ్‌లు ఎలా కాదంటాయన్నది ఆధార్ కేసులో కేంద్రం వాదన. అందువల్లే తొమ్మిదిమంది న్యాయమూర్తుల ధర్మాసనం వ్యక్తిగత గోప్యత అంశంపై విచారించాల్సి వచ్చింది. రాజ్యాంగంలోని ఇతర అధికరణాలతో పోలిస్తే 21వ అధికరణను సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు నిశితంగా పరిశీలించి భాష్యం చెప్పాల్సివచ్చింది. ఆ క్రమంలో ఆ అధికరణ పరిధి విస్తృతమవుతూ వచ్చింది. జీవించే హక్కంటే కేవలం ప్రాణానికి సంబంధించింది మాత్రమే కాదని... గౌరవప్రదంగా జీవించే హక్కు కూడానని మేనకాగాంధీ కేసులో చెప్పింది. అలాగే దోపిడీకి గురికాకుండా ఉండటం, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం, ఆరోగ్యకర వాతావరణంలో పిల్లలు పెరగడం, పనిచేసే స్థలాల్లో లైంగిక వేధింపులకు గురికాకుండా ఉండటం వగైరాలు జీవించే హక్కులో భాగమైంది వేర్వేరు తీర్పుల పర్యవసానంగానే.

వ్యక్తిగత గోప్యతపై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై విస్పష్టంగా తన అభిప్రాయం చెప్పలేకపోయింది. అది ప్రాథమిక హక్కా కాదా... ఏమనుకుంటున్నారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ కేహార్ అడిగిన సూటి ప్రశ్నకు అటార్నీ జనరల్ నేరుగా జవాబివ్వలేదు. గోప్యత ప్రాథమిక హక్కే అనుకున్నా అందులో అనేక రకాలైనవి ఉన్నాయని, ఏ రకమైన గోప్యతను ప్రాథమిక హక్కుగా పరిగణించవచ్చునన్నది తేల్చాల్సి వస్తుందని చెప్పారు. కానీ ఏ రకమైన గోప్యతనైనా హరించే హక్కు ప్రభుత్వాలకుండదని ఈ తీర్పు స్పష్టం చేసినట్టయింది. ఇది ఒక్క ఆధార్‌కు మాత్రమే కాదు... ప్రస్తుతం స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణిస్తున్న ఐపీసీలోని సెక్షన్ 377 వంటివి ఈ తీర్పు వెలుగులో న్యాయస్థానాలు సమీక్షించే అవకాశం ఉంది. సెక్షన్ 377 రాజ్యాంగబద్ధమైనదేనని నాలుగేళ్లక్రితం సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. తాజా తీర్పు ఆధారంగా దాన్ని మరోసారి సవాల్ చేసే అవకాశం లేకపోలేదు. అంతేకాదు... అనుమానితుల పేరిట పౌరుల్లో ఎవరి డీఎన్ఏ నమూనాలనైనా, వేలిముద్రలనైనా సేకరించడానికి ప్రభుత్వాలకు అధికారం కట్టబెట్టే డీఎన్ఏ ప్రొఫైలింగ్ ముసాయిదా బిల్లు చట్టమైతే దాని చెల్లుబాటును కూడా 21వ అధికరణ గీటురాయిగా సమీక్షించే అవకాశం ఉంది. మన సమాజం ఉన్నత స్థితికి చేరుకోవాలన్న సదాశయంతో రూపొందిన రాజ్యాంగంలో అన్నింటినీ ముందే ఊహించి పొందుపర్చడం సాధ్యంకాదు. మొత్తంగా ఆ స్ఫూర్తిని పరిరక్షించడం, దాన్ని సృజనాత్మకంగా అన్వయించి విస్తృతపరచడం న్యాయస్థానాల కర్తవ్యం. ఆ కృషిలో మన న్యాయస్థానాల పాత్ర ప్రగతిశీలమైనదని తాజా తీర్పు మరోసారి ధ్రువపరిచింది.




దాచుకోవాల్సింది ఏమీ లేదు కాబట్టి వ్యక్తిగత గోప్యత హక్కు అవసరం లేదనడమంటే, నేను చెప్పాల్సింది ఏమీ లేదు కాబట్టి వాక్‌స్వాతంత్ర్యం అక్కర్లేదనడం లాంటిదే.

– ఎడ్వర్డ్ స్నోడెన్
అమెరికన్ కంప్యూటర్ నిపుణుడు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపదమాసం, తిథి శు.చవితి రా.9.31 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం హస్త సా.4.37 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం రా.1.01 నుంచి 2.40 వరకు దుర్ముహూర్తం ఉ.8.17 నుంచి 9.08 వరకు, తదుపరి ప.12.27 నుంచి 1.16 వరకు, అమృతఘడియలు ఉ.10.29 నుంచి 12.06 వరకు, వినాయక చవితి.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్ : 4.47
జొహర్ : 12.18
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.35
ఇషా : 7.49

రాబోయే కాలానికీ... రక్ష నీవే!



దిలీప్ రెడ్డి

చట్టాలకూ, రాజ్యాంగానికీ వ్యతిరేకంగా వ్యక్తులు గానీ, రాజ్యం గానీ దాష్టీకాలకు దిగినప్పుడు ఎదిరించి తమను తాము రక్షించు కోవడం ఈ వ్యవస్థలో చాలా తక్కువ మందికే సాధ్యం! దేశంలోని అత్య ధికులకు ప్రభుత్వాలు కల్పించే రక్షణ చర్యలు, చట్టాలు, రాజ్యాంగం, న్యాయ స్థానాల అండ అవసరమయ్యే పరిస్థితులే నేటికీ ఈ దేశంలో నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా పౌరులందరి నిత్య జీవితాల్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా శాసిస్తున్న రాజకీయ వ్యవస్థను క్రమబద్ధీకరించాల్సి ఉందని ప్రతి పౌరుడూ భావిస్తున్న తరుణమిది!

సమకాలీనం

భారత అత్యున్నత న్యాయస్థానం, సుప్రీంకోర్టు 48 గంటల వ్యవధిలో రెండు విప్లవాత్మకమైన తీర్పులను వెల్లడించి రాజ్యాంగాన్ని ఈ దేశపు సగటు మనిషికి మరింత చేరువ చేసింది. స్ఫూర్తిదాయకమైన మన రాజ్యాంగం పట్ల మరింత విశ్వసనీయతను పెంచింది. మూడుమార్లు 'తలాక్' అంటే విడాకులిచ్చేసినట్టేనన్న ఆటవిక నీతి ఇక చెల్లదంది. వ్యక్తిగత గోప్యత పౌరుల ప్రాథమిక హక్కేనని నిర్ద్వంద్వంగా తేల్చింది. రాజ్యాంగం కల్పించిన హక్కుల ఉల్లంఘన ఏ రూపంలో జరిగినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. సంప్రదాయ ఆచరణలు, సంక్షేమ అవసరాల వంకతో ప్రాథమిక హక్కులకు జరిపే ఏ వక్రీకరణలనూ, అనుచిత భాష్యాలనూ అనుమతించేది లేదని తన చరిత్రాత్మక తీర్పులతో ధృవీకరించింది. ఇదే చొరవ... ఎన్నికల సంస్కరణలు, ముఖ్యంగా ప్రజాప్రాతినిధ్య (పీఆర్) చట్టం, ఫిరాయింపుల నిరోధక చట్టం స్ఫూర్తిని అమలుపరచడంలో చూపాలని యావద్భారతావని కోరుకుంటోంది. నిన్నటికి నిన్న నంద్యాలలో జరిగిన ప్రజాస్వామ్య పరిహాస పర్వం కళ్ల చూసిన వారందరికీ... సుప్రీం జోక్యం తప్ప ఈ దేశంలో ఏ శక్తీ ఇలాంటి దారుణాల్ని అరికట్టలేదేమోనన్న సందేహం బలపడుతోంది. సుదీర్ఘకాలం నుంచి సంశయాత్మకంగా ఉన్న పౌరహక్కుల్ని నిస్సందేహంగా ఖరారు చేస్తూ సుప్రీం ధర్మాసనాలు తాజా తీర్పులు వెలువరించిన దరిమిలా.... కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తిని వెక్కిరించేలా జరుగుతున్న పార్టీ ఫిరాయింపులు, ఎన్నికల ప్రహసనాలు–పాలకపక్ష ఆగడాలు, సర్కార్ల ఇష్టారాజ్యాన్ని ఎవరూ అడ్డుకోలేని దుస్థితి ఆందోళన కలిగిస్తున్న తరుణమిది. అందుకే, ప్రజాస్వామ్య వాదులంతా సుప్రీంకోర్టు వైపు చూస్తున్నారు. రాజ్యాంగ విధానాల బాటన, న్యాయస్థానాల కనుసన్నల్లో పౌరులకు రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వాలే వక్రమార్గాలననుసరిస్తే ఇక వారికి దిక్కెవ్వరు? 'కన్నతల్లే దయ్యమైతే తొట్టెల కట్టే తావెక్కడ?' అన్న చందంగా తయారయింది పౌరుల స్థితి! ప్రజలిచ్చిన అధికారాన్ని విచ్చలవిడిగా వాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసే సర్కార్ల వైఖరిని పౌరులు జీర్ణించుకోలేకపోతున్నారు. డెబ్బయ్యేళ్ల స్వతంత్ర భారతావనిలో అత్యంత ఖరీదయినదిగా నంద్యాల ఎన్నికను నిలిపిన తీరు జుగుప్సాకరం. ఈ ఎన్నికల్లో వేర్వేరు రూపాల్లో డబ్బు విశ్వరూపం చూపింది. చివరకు.... 'మాకు వేస్తే ఓటుకు పదివేలు, మాకు వేయకున్నా సరే ప్రత్యర్థికి వేయకుండా మిన్నకుంటే అయిదువేలు' ఇస్తామనే కొత్త విష సంస్కృతికి పాల్పడిన అధికార పక్షం నైచ్యం అందరినీ విస్మయపరుస్తోంది.

నంద్యాల ఓ దురాగతం

ఎన్నికల నియమావళి, నిబంధనల ఉల్లంఘనకు నంద్యాల ఉప ఎన్నిక ఓ నిలువెత్తు ఉదాహరణ. ఎన్నికల సంఘం ఆదేశాలు–నిఘాను బేఖాతరంటూ, అధికార పార్టీ ఉద్దేశపూర్వకంగానే ఇందుకు సంబంధించిన నియమావళినీ, ఆదేశాలనూ పదే పదే ఉల్లంఘించింది. ఏకంగా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఎన్నికల నిబంధనలను పట్టించుకోవాల్సిన అవసరం లేదనీ, ఉల్లంఘిస్తే మహా అయితే నోటీసు మాత్రమే ఇస్తారనీ మంత్రులు, ఎమ్మెల్యేలకు టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశాలిచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నియమావళి, నిబంధన ప్రకారం ఎన్నికల ముంగిట్లో ప్రభుత్వం కొత్త హామీలు ఇవ్వకూడదు. నంద్యాల ఉప ఎన్నికల కోడ్ కొనసాగుతుండగానే, మరో రెండు నెలల్లో నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వనున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని లీకులిచ్చి మరీ తన అనుకూల మీడియాతో విస్తృత ప్రచారం చేయించింది. మహిళల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఏర్పాటు చేస్తామని పొదుపు సంఘాల మహిళలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రే హామీ ఇచ్చారు. డ్వాక్రా సంఘాలకు పసుపు–కుంకుమ పథకం కింద మూడో విడతగా రూ.4వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రంలోని ఏ ఇతర నియోజకవర్గాల్లో మహిళలకు మూడో విడత డబ్బులు జమ చేయలేదు. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఓట్లు వేయకపోతే పెన్షన్లు, రేషన్ కార్డులు తీసివేస్తామని సర్వే టీమ్‌లను పంపించి బెదిరించారు. సర్వేలు చేయవద్దని ఎన్నికల సంఘం ఆదేశించినా అధికార పార్టీ సర్వే బృందాలను పంపి మరీ ఈ బెదిరింపులకు పాల్పడింది. తమకు ఓటు వేస్తేనే రోడ్ల విస్తరణ, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా పథకాలు చేపడతామనీ, ఇదివరకు చేపట్టినవి కొనసాగిస్తామనీ సీఎంతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు పదేపదే ప్రకటించారు. నిబంధన ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు జిల్లాకు చెందని వ్యక్తులు జిల్లాను వీడి వెళ్లాలి. నంద్యాల నియోజకవర్గానికి చెందని ఇతర నేతలు నంద్యాల నియోజకవర్గంలో ఉండకూడదు. ఈ స్ఫూర్తికి గండికొ డుతూ మంత్రులు, ఎంఎల్ఏలు పక్క నియోజకవర్గమైన బనగానపల్లెలోని ఓ ఎమ్మెల్యే ఇంట్లో తిష్ట వేశారు. ఈ వ్యవహారమంతా ఆధారాలతో బయ టపడింది. ఎమ్మెల్యేలు ఏకంగా పోలింగ్ రోజు నంద్యాల నిమోజకవర్గం మొత్తం కలియదిరిగారు. అనపర్తి ఎమ్మెల్యే కానాలలో ప్రత్యక్షం కాగా, బనగానపల్లె ఎమ్మెల్యే యాళ్లూరులో ఏకంగా డీఎస్పీతో మాట్లాడుతూ మీడియా కంటపడ్డారు. కర్నూలు, శ్రీశైలం, కోడుమూరు ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర రెడ్డి, మణిగాంధీలు నంద్యాల పుర వీధుల్లో దర్జాగా తిరుగుతూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. మంత్రి భూమా అఖిల అయితే మీడియా ముఖంగా ప్రకటించి మరీ ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు వెళ్లారు. అక్కడ పలు టీవీలకు ఇంటర్వ్యూలూ ఇచ్చారు. ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ యథేచ్ఛగా సాగింది. బహుశా దేశచరిత్రలోనే ఇంతగా డబ్బు, మద్యం పంపిణీతో ఎన్నికలు జరగలేదంటే అతిశయోక్తి కాదేమో! పాలకపక్షం వందల కోట్ల మేర ఖర్చు చేసిందని ఒక అంచనా. ఓటుకు రూ. 2 వేలు పంచుతూ అధికార పార్టీకి చెందిన రైతునగర్ సర్పంచ్ కొండారెడ్డి కెమెరాకు చిక్కారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ డబ్బులు పంచుతూ అడ్డంగా దొరికిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీకి చెందిన కొన్సిలర్ అభిరుచి మధు మారణాయుధాలను కార్లలో పెట్టుకొని తిరుగుతూ ప్రతిపక్ష పార్టీకి చెందిన నేత, మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డిపై దాడికి తలపడ్డారు. ఏకంగా కత్తి తీసుకొని నడిరోడ్డుపై గీత గీసి దాన్ని దాటి రమ్మని సవాల్ విసరడం, గాల్లో కాల్పుల ఘటన, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం ప్రజాస్వామ్య ప్రక్రియకే సరికొత్త సవాళ్లు.

మూలాలు ఛేదిస్తేనే....!

విలువలకు తిలోదకాలిచ్చి, పాలకపక్షాలు అధికారమే పరమావధిగా వ్యవహరించడం వల్లే ఇలాంటి విపరిణామాలు తారస్థాయికి చేరుతున్నాయి. ఇప్పుడున్న అధికారాన్ని విచ్చలవిడిగా అనుభవించడమే కాకుండా తర్వాతి ఎన్నికల్లోనూ తామే గెలుపొందాలనే దురాశ వారిని అన్ని అనైతిక చర్యలకూ పురిగొల్పుతోంది. అర్థబలం, అధికారం దన్నుగా వీలయితే ప్రలోభాలు లేదంటే బెదిరింపులు... ఏదైతేనేం? వచ్చే ఎన్నికల నాటికి ప్రత్యర్థి పార్టీల ఉనికే లేకుండా చేయాలనే దుర్నీతి రాజ్యమేలుతోంది. నంద్యాల ఉప ఎన్నికకు దారి తీసిన పరిస్థితులకు మూలకారణమదే! ప్రత్యర్థి పార్టీ తరఫున గెలిచిన ప్రజాప్రతినిధుల్ని తమ పార్టీలోకి లాక్కొని, మంత్రిపదవులిస్తూ ప్రజాతీర్పునే వంచిస్తున్న సిగ్గుమాలిన చర్యలు ఇటీవల పెచ్చుమీరాయి. ఫిరాయింపు (నిరోధక) చట్టంలోని లొసుగుల్ని సానుకూలంగా వాడుకుంటూ పాలకపక్షాలు బరితెగిస్తున్న తీరుకు విరుగుడు కనిపించడం లేదు. పైగా, వేదికలెక్కి నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఈ జాడ్యానికి ప్రభావవంతమైన పరిష్కారం లభించడం లేదు. నిబంధనల్ని ఉల్లంఘిస్తూ పార్టీ ఫిరాయించిన వారిని అనర్హులుగా ప్రకటించే ప్రక్రియలో చట్టసభల స్పీకర్లదే కీలకపాత్ర! వారి విషయంలో పార్టీలకతీతంగా వ్యవహరించి, అలా పార్టీ మారిన వారిని చట్టప్రకారం అనర్హులుగా ప్రకటించాలి. కానీ, కాలక్రమంలో స్పీకర్లు పాలకపక్షాల కనుసన్నల్లో నడుచుకోవడం వల్ల, అధికారంలోని వారికి అనుకూలంగానే తప్ప చట్టబద్ధ, రాజ్యాంగబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. పలుమార్లు ఈ వివాదాలు న్యాయస్థానాలకూ చేరాయి. ఎప్పట్లోగా నిర్ణయం తీసుకోవాలో తాము వారిని నిర్దేశించలేమని, వారొక మారు నిర్ణయమంటూ తీసుకుంటే... దాని రాజ్యాంగబద్ధతను తాము సమీక్షించగలమని న్యాయస్థానాలంటున్నాయి. తెలంగాణ ఎమ్మెల్యే సంపత్ (కాంగ్రెస్) పిటిషన్ మేరకు ఫిరాయింపుల కేసొకటి సుప్రీంకోర్టు విచారణలో ఉంది. శుక్రవారం అది విచారణకు రావాల్సి ఉంది. 'దీనిలోని సంక్లిష్టత దృష్ట్యా... ఈ కేసు విచారణను ఎందుకు రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించకూడదు?' అని సుప్రీంకోర్టు గత డిసెంబర్‌లో ప్రశ్నించింది. అయినా ఆ ప్రక్రియ జరిగినట్టు లేదు! సుప్రీంకోర్టు చొరవ తీసుకొని రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి ఈ ఫిరాయింపుల జాడ్యానికి చరమ గీతం పాడాల్సిన అవసరం ఉంది.

అత్యధికులకు అండ న్యాయస్థానాలే!

పలువురు భావిస్తున్నట్టు, కొందరు వక్రీకరిస్తున్నట్టు... వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా పేర్కొన్న సుప్రీం తీర్పు 'ఆధార్'కు వ్యతిరేకమేం కాదు. తగు జాగ్రత్త చర్యలతో 'ఆధార్'ను యథేచ్ఛగా కొనసాగించవచ్చు, పలు అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలకు అనుసంధానం చేయవచ్చు. నిర్దిష్ట అవసరాల కోసం పౌరుల వద్ద నుంచి సేకరించే వ్యక్తిగత సమాచారాన్ని అదే అవసరాలకు వాడటం, ఇతరేతర మార్గాల్లో అది దుర్వినియోగం కాకుండా, ఇతర ప్రైవేటు సంస్థల బారిన పడకుండా తగు భద్రతా చర్యలు తీసుకోవడం ఇకపై ప్రభుత్వాల బాధ్యత అవుతుంది. అందుకోసం, అవసరమైతే ప్రత్యే కంగా సమాచార భద్రతా చట్టం తీసుకురావాల్సి ఉంటుంది. ఆధార్ విష యంలో జరుగుతున్న తప్పిదాల్ని, లోపాల్ని, పౌరుల వ్యక్తిగత సమాచార భద్రత విషయంలో ఇప్పటికే జరిగిన తీవ్ర నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన అడ్డగోలు వాదనకు ఈ తీర్పు చెంపపెట్టు! అందుకే, ఈ తీర్పునకు సర్వత్రా స్వాగతం లభిస్తోంది. హర్షామోదాలు వ్యక్తమౌతున్నాయి. వ్యక్తిగత గోప్యత మన దేశంలో అసలు హక్కే కాదని వాదించిన కేంద్రం ఇప్పుడు గొంతు సవరించుకుంటోంది. ప్రాథమిక హక్కే గానీ పరిమితులుంటాయని తాము పేర్కొన్నట్టు ఇప్పుడు మాట మారుస్తోంది. సుప్రీంకోర్టు ఇది ప్రాథమిక హక్కే అని చెప్పటమైనా, మూమ్మారు 'తలాక్' అని ఉచ్చరించినా, పరోక్షంగా ఫోన్ చేసినా, ఓ చిన్న మెసేజ్ పంపినా చాలు విడాకులిచ్చినట్టే అన్న పద్ధతి చెల్లదని ప్రకటించడమైనా రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడమే! చట్టాలకూ, రాజ్యాంగానికీ వ్యతిరేకంగా వ్యక్తులు గానీ, రాజ్యం గానీ దాష్టీకాలకు దిగినప్పుడు ఎదిరించి తమను తాము రక్షించుకోవడం ఈ వ్యవస్థలో చాలా తక్కువ మందికే సాధ్యం! దేశంలోని అత్యధికులకు ప్రభుత్వాలు కల్పించే రక్షణ చర్యలు, చట్టాలు, రాజ్యాంగం, న్యాయస్థానాల అండ అవసరమయ్యే పరిస్థితులే నేటికీ ఈ దేశంలో నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా పౌరులందరి నిత్య జీవితాల్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా శాసిస్తున్న రాజకీయ వ్యవస్థను క్రమబద్ధీకరించాల్సి ఉందని ప్రతి పౌరుడూ భావిస్తున్న తరుణమిది! ఇప్పుడు నెలకొని ఉన్న ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వాల జవాబుదారీతనమైనా, ఎన్నికల సంస్కరణలైనా, రాజకీయ పరివర్తనైనా...... సుప్రీంకోర్టు చొరవ, క్రియాశీలతే ఈ దేశ పౌరులకు తక్షణ రక్ష!

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

వాడుకమాటల వరద

సరిగ్గా 125 ఏళ్ల క్రితం గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' నాటకాన్ని, అది ఏ నూతన జ్ఞాన కాంతిని అందించిందో గుర్తించకుండా... దానిలో లేని విషయాలను పట్టుకుని విమర్శలు గుప్పించడం ఏమిటి?

అభిప్రాయం




రామతీర్థ

ఒక నాటకం, సాహిత్య ప్రక్రియగా, ప్రదర్శనా వినూత్నతలతో, నూట పాతికేళ్ల బతికి ఉంది అంటే, ఏమిటి ఈ విజయ రహస్యం అని అడగవచ్చు. అయితే దానికి, జవాబు చెప్పడానికి కన్యాశుల్కం నాటకకర్త మన మధ్య లేరు. నాటకమా మాట్లాడదు. మరి సమాధానం ఎలాగ? ఈ ప్రశ్న గురజాడ అప్పారావు నాటకం కన్యాశుల్కం గురించి. కలకత్తా నుంచి 29 జనవరి 1912న రాసిన ఒక పూర్తిగా దొరకని ఉత్తరంలో ఇలా చెప్పారు గురజాడ. ''తెలుగులో నవ్యరీతులకు, నూతన ప్రమాణాలకు ప్రయత్నించిన మొదటి కవిని నేనే. నా కావ్య కళ నవీనం. కావ్య ఇతివృత్తాలు భారతీయం... జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి కథ కవితా రూపంలో దాని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను. నాకా కళల పట్ల, జీవితం పట్ల కొన్ని ఆదర్శాలు ఉన్నాయి. వాటిని సంస్కృతిపరులు మాత్రం అర్థం చేసుకుని హర్షించగలరు. సంస్కృతి శూన్యులు కావ్య కథా సంవిధాన, హాస్య ధోరణులను గమనించి అంతటితో సంతృప్తిపడతారు''.

నవ్య రీతులు, నూతన ప్రమాణాలు, నవీన కావ్య కళ అని పైన గురజాడ ఇచ్చిన ఆధారాలతో మనం ఈ నాటకం, అలాగే, గురజాడ ఇతర రచనల దీర్ఘ జీవన దివ్య రహస్యం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయగలం. గురజాడ, కన్యాశుల్కం నాటకం రాయడానికి ముందర తెలుగు రచన చేయనే లేదు. తెలుగులో ఆయన తొలి రచన ఇది. బహుశా గురజాడ 1919లో నాటకాన్ని పూర్తిగా తిరగరాసి, రెండు అంకాలు పెంచక పోతే, ఈ నాటకాన్ని ఇంతలా పట్టించుకోవలసిన అవసరం ఉండేది కాదు. 19వ శతాబ్దపు అనేక భారతీయ నాటకాల వలె ఇది కూడా ఒక చరిత్ర పేరాగా మారి ఉండేది. కానీ, కళలో జీవితం నిండుగా కనిపించాలన్న పరిపూర్ణత్వ అన్వేషకుడు గురజాడ కావడం మూలాన, ఈ కన్యాశుల్కం నాటకం, ఇవాళ, 19వ శతాబ్దపు సాహిత్యంలో ఏకైక ఆధునిక భారతీయ సజీవ నాటకంగా, తెలుగు వెలుగుగా ఎదిగింది.

ఈ ఆయుష్షు, యశస్సు కలగడానికి గురజాడ చేసిన ప్రత్యేక పరిశ్రమ ఏమిటి? అది ''పాత కొత్తల మేలు కలయిక'' అన్న నాలుగు మాటల ఒక సజీవ వారధి. ''ఔరా ఇంద్రజాలీ, పంతులు గొంతు ఎలా పట్టావ్?'' అంటుంది మధురవాణి శిష్యునితో, వాడు పేకాట ఆడుతున్న మధురవాణిని, ఆమె పేకాట దోస్తులను రామప్పంతులు గొంతుతో హడలగొట్టినప్పుడు. అలా పాత్రలందరి గొంతులు పట్టిన అసలు ఇంద్రజాలి గురజాడ. కన్యాశుల్క నాటకం చేసే చాలా కనికట్టుల్లో ఒకటి వాడుక భాషకు పెద్ద పీట వేయడం.

అలాగే పోలిశెట్టి తన పేకాట ముక్కలు ఎత్తేటప్పుడు ''నరసిమ్మ నీ దివ్వే నామ మంతరము చేత'' అని ముక్కలు ఎత్తుతుంటాడు. ''ఛప్! నోర్ముయి'' అని పేకాట మిత్రులు గసుర్తుంటారు. ఇక్కడ గురజాడ ప్రస్తావిస్తున్నది కేవలం ఒక యేల పదం కాదు. అది కరీంనగర్ ప్రాంతంలోని ధర్మపురి దేవతపై రాసిన నరసింహ శతకంలోని ఒక పద్యం. రాసిన కవి ధర్మపురి శేషప్ప (1670 –1750). పేకాట ఆడే పోలిశెట్టి, ఎందుకీ పద్యం పాడుతున్నాడూ అంటే, తాను ధర్మపురి నించి విజయనగరం వలస వచ్చిన కోమటిశెట్టి అయి ఉండాలి. అందుకే, పేకాట కూడా గెలుపు కాంక్షతో చేసే యుద్ధం లాంటిదే కనుక, తన ఇష్టదైవాన్ని తలుచుకుంటున్నాడన్నమాట. ''నరసిమ్మ'' అనగానే అదేదో సింహాచల దైవ ధ్యానం అనుకుంటాము. కానీ గురజాడ చెప్పకుండా చెక్కిన ఈ చెణుకు, ధర్మపురి శేషప్ప రాసిన నరసింహ శతకంలోని మూడో పద్యంగా ఉన్నది.



'ప్రాబల్యవర్గాల సాహిత్య ఆధిపత్యం వల్లనే కన్యాశుల్కంకు బ్రహ్మరథం పడుతున్నార'ని పాతికేళ్ల క్రితమే కొత్త దారుల ఇలవేల్పులు విమర్శించారు. కానీ విభిన్న వర్గాలకు ప్రాతినిధ్యం అంటూ పాతికేళ్లుగా ఉద్యమాలు చేసి అలిసిపోయిన అస్తిత్వవాదం ఇవ్వాళ అదే ప్రాబల్య వర్గాల ముందు సాగిలబడి అమ్ముడుపోవడానికి సిద్ధమైపోయింది. అసలు గురజాడను స్థానిక పరిమితులలో ఇరికించడమే తప్పు. భారతీయులను ప్రాపంచిక పౌరులుగా తీర్చిదిద్దడం, ఆనాటికి భారతీయ సాహిత్యం ఎరిగి ఉండని ఆధునిక సంస్కారాన్ని పరిచయం చేయడమే కన్యాశుల్కం నాటక లక్ష్యం.

మొదటి పేజీలోనే ఆంగ్ల సాహిత్య ప్రస్తావనలతో మొదలయ్యే కన్యాశుల్కం నాటకంలో కాళిదాసు, శ్రీనాథుడు, శంకరాచార్యులు, షేక్స్పియర్, విడో పద్యమూల (ది మదర్) కవయిత్రి టేలర్, సూరకవి, ధర్మపురి శేషప్ప, జావళీలు, తత్వాలు, హిందూస్తానీ దోహాలు, సుమతీ పద్యాలు, వేమన పంక్తులు, చమకం ప్రస్తావనలు, క్రిస్టియన్ సూక్తులు, గురజాడ కట్టిన పద్యాలు, ఇలా ప్రతి పద్య ప్రస్తావన, విపులంగా చెప్పుకోదగిన ఒక సాంస్కృతిక సందర్భమే. ఇన్ని సంస్కృతుల ప్రాణవాయుబలంతో పరిఢవిల్లుతుండటమే, కన్యాశుల్కం నాటక దీర్ఘ యశస్సు, ఆయుష్షు, ప్రయోజనశీలతకు ఒక ప్రధాన కారణం. పాతకొత్తల మేలు సారం అయిన సంస్కృతి నేలకు ఒరిగితే తప్ప, 'కన్యాశుల్కం' నేలకు ఒరగదు. మంచిని పెంపొందించే కళాశీల దృక్పథం కలిగిన కన్యాశుల్కం కూడా చిరంజీవి, చిరాయువు.

(విజయనగరం, విశాఖపట్నం వేదికలలో ఆగస్టు 26 నుంచి 28 వరకు జరుగనున్న 'కన్యాశుల్కం' 125 ఏళ్ల జాతీయ ఉత్సవాల సందర్భంగా..)

వ్యాసకర్త కవి, విమర్శకుడు I 98492 00385

మూడు తలాక్‌లకు సుప్రీం చెక్

మూడు తలాక్‌ల పద్ధతి చెల్లదంటూ సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ముస్లిం మహిళలకు ఊరట కలిగించేది. కానీ అందుకు అనుగుణంగా పార్లమెంటు ఓ చట్టం చేయడం అవసరం. లేకపోతే బాధిత ముస్లిం మహిళల దుర్గతి మారదు.

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

ముస్లిం పురుషులు మూడు తలాక్‌లతో భార్యకు తక్షణమే విడాకులిచ్చే తంతును సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులూ సూత్రప్రాయంగా వ్యతిరేకించారు. తద్వారా వారు సమానతకు సముచిత గౌరవం ఇచ్చారు. ఏ మతాచారమైనా గానీ, 1,400 ఏళ్ల నుంచి ఉన్నది కనుకనే న్యాయం అయిపోదు. మగవాడు మూడు సార్లు తలాక్ చెప్పి, ఏకపక్షంగా వివాహ బంధాన్ని తెంచుకోవడం ధర్మమూ కాదు. ముస్లిం ఆడవారు కూడా మూడుసార్లు తలాక్ చెప్పి క్రూరుడైన భర్తను వదిలేసే అవకాశం లేకపోవడమే అసలైన అసమానత. మూడుసార్లు తలాక్ అని వదుల్చుకున్న భార్యను, ఆ భర్తే పశ్చాత్తాపపడి మళ్లీ వివాహబంధంలోకి ఆహ్వానించడం సులువేం కాదు. ఆమె మరొకరిని పెళ్లాడాలి. ఆ కొత్త భర్త ఆమెకు మూడు తలాక్‌లు చెప్పి విడాకులివ్వాలి. ఆ తర్వాతనే పశ్చాత్తప్తుడైన ఆ భర్త, తను తొందరపడి వదిలేసిన భార్యను తిరిగి పెళ్లి చేసుకోవాలి. ఇది ఆచారం కాదు, దారుణం.

22 ముస్లిం మెజారిటీ దేశాలలో రద్దయిన ఈ దురాచారాన్ని ఐదుగురు న్యాయమూర్తులూ వ్యతిరేకించడం చాలా గొప్ప పరిణామం. అయితే వారిలో ముగ్గురు లలిత్, నారిమన్, జోసెఫ్ ఈ దురాచారం వెంటనే వదిలిపోవాల్సిందే అన్నారు. కాగా, మరో ఇద్దరు ఖేహర్, నజీర్ ఈ ఆచారాన్ని ఆర్నెల్లు నిలిపివేసి, పార్లమెంటు చట్టం చేయడం ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మూడు తలాక్‌ల పద్ధతికి 1937 షరియా చట్టం ద్వారా చట్టబద్ధత లభించింది కాబట్టి ఆ చట్టాన్ని మార్చుతూ కొత్త చట్టం చేయాల్సి ఉందని వారిద్దరూ అన్నారు. ఈ తక్షణ విడాకుల సౌకర్యం, మగవారికే పరిమితమని, చపల చిత్తంతో మాట తూలి, తర్వాత అది పొరబాటని తేలినా సరిదిద్దుకోలేని కాఠిన్యంతో కూడినదని, రాజ్యాంగ వ్యతిరేకమైనదని ముగ్గురు న్యాయమూర్తులు గుర్తించడం సమంజసం.

మైనారిటీ మతస్తుల విభిన్నతను, గుర్తింపును రక్షించేందుకు ఏర్పాటైన ఆర్టికల్ 25 ప్రాథమిక హక్కే. కానీ అది పబ్లిక్ ఆర్డర్ (ప్రజా జీవితంలోని క్రమబద్ధత)కు లోబడి ఉండాలన్న మాటతో ప్రారంభమైంది. మూడు తలాక్‌లతో భార్యలను వదిలేస్తుంటే పబ్లిక్ ఆర్డర్ ఎక్కడి నుంచి వస్తుంది? సిక్కులు కృపాణం ధరించడం మతాచారమే. కానీ, దానితో ఎవరినైనా పొడిచి చంపితే హత్యకేసు తప్పదు. రాజ్యాంగం రాక ముందు నుంచి ఉన్నా, రాజ్యాంగ వ్యతిరేకమైన షరియత్ చట్ట నియమాలు చెల్లవని ముగ్గురు న్యాయమూర్తులు భేషైన తీర్పు చెప్పారు. ఈ పద్ధతి రాజ్యాంగానికే కాదు, ఖురాన్ స్ఫూర్తికి కూడా విరుద్ధం.

ముస్లిం మతస్తులలో అమల్లో ఉన్న ఈ మూడు తలాక్‌ల పద్ధతి సమానతకు, మహిళల ఆత్మగౌరవానికి, సహజ న్యాయసూత్రాలకు, రాజ్యాంగానికి పూర్తిగా వ్యతిరేకం. అయితే, ఈ తీర్పును అమలు చేయడం కష్టమని మజ్లిస్ నేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్య గమనార్హమైనది. ఈ తీర్పు తర్వాత కూడా ముస్లిం పురుషుడు తన భార్యకు మూడు సార్లు తలాక్ చెప్పి వదిలేస్తే ఏం చేస్తారు? ఆ భర్తతో బలవంతంగా కాపురం చేయిస్తారా? లేక నేరమని జైల్లోకి తోస్తారా? సుప్రీం తీర్పు చెప్పింది చట్టమే. కానీ చట్టంలో ఉండే వివరణ, కచ్చితత్వం, శిక్షల నిర్ధారణ అందులో ఉండవు. కనుక ఒక చట్టం ఉండాలన్న ఖేహర్, నజీర్‌ల సూచన చాలా సమంజసమైనది.



హిందూ మతంలో మొదట్లో విడాకులే లేవు. భర్త ఎంత దుర్మార్గుడైనా భార్య అతనితోనే ఉండాలనే ఉపదేశాలను ఇంకా వింటున్నాం. కొన్ని బలీయమైన కారణాల రీత్యా హిందువులకు విడాకుల అవకాశం కల్పించడం, ఆ తర్వాత కొన్నేళ్లకు పరస్పర అంగీకారంతో విడాకులకు సైతం వీలు కల్పించడం గొప్ప సంస్కరణ. అయినా, హిందూ విడాకుల విధానంలోని సంక్లిష్టతను, కాఠిన్యాన్ని ఇంకా తగ్గించవలసి ఉంది. విడాకుల విషయంలో కోర్టుల అర్థరహిత నిబంధనలు, వాయిదాలు, ప్రక్రియ లోపాలు, విపరీత జాప్యాలు, అప్పీళ్ల కష్టాలు పరిశీలించి పరిష్కరించాల్సి ఉంది. అదేవిధంగా మగాడి బుర్రకు తోచినప్పుడు టప్పున తెంచుకునే బంధంగా ఉన్న ముస్లిం విడాకుల తంతులో కొంత గాంభీర్యాన్ని, కష్టాన్ని ప్రవేశపెట్టవలసి ఉంది. హిందూ ముస్లిం మతాల్లో బహుభార్యత్వాన్ని చట్టపరంగా చాలావరకు తగ్గించారు. అయినా నలుగురిని వివాహం చేసుకునే వీలు ముస్లిం మతంలో కల్పించి, హిందూ తదితర మతాలకు ఏకపత్నీ నియమాన్ని ఏర్పరచడం తీవ్రమైన అసమానతే.

70 ఏళ్ల స్వతంత్ర భారతంలో అసమానతలకు బలవుతున్న ముస్లిం మహిళలకు ఊరట కలిగించే తీర్పు ఇది. కానీ పార్లమెంటు ఒక సమగ్రమైన చట్టాన్ని రూపొందించకపోతే ఆచారాల పేర సాగే అత్యాచారాలు ఆగవు. విడాకులకు గురైన మహిళలకు పరిష్కారాలు దొరకవు. ఈ తీర్పు, రాజ్యాంగం ఆశించిన సమానతను, ఆదేశించిన ఉమ్మడి పౌరస్మృతిని సాధించే దిశగా ముందడుగు. కాని అందుకు అనుగుణంగా పార్లమెంటు ఓ చట్టం చేసి మలి అడుగు వేయాలి. లేకపోతే బాధిత ముస్లిం మహిళల దుర్గతి మారదు. ముస్లిం మహిళలకు సాధికారత చేకూరదు.

వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం, 25-8-2017



చిన్న రిక్వెస్ట్ బాస్!

ప్రతీకాత్మక చిత్రం

మా కోరికలేవీ పెద్దవి కావు బాస్. చిన్న చిన్న విఘ్నాలు తొలగిస్తే చాలు.
ఫ్యామిలీ ఫ్యామిలీ నీకు ఉండ్రాళ్లు పెడుతూ తరిస్తాం.
విపత్తులు, ఉత్పాతాలు, విలయాలు... వాటి పని మీరే చూసుకుంటారు.
చికాకులు, చిర్రుబుర్రులు, చివాట్లు, చిక్కులు...
ఇవి మా ప్రాబ్లమ్స్. ఇవే విఘ్నాలు.
నిన్ను దేవుడూ అని పిలుస్తూ ఎక్కడో దూరంగా ఉంచాలని లేదు.
మనసుకు దగ్గరగా ఉంటావ్... బాగా క్లోజ్‌గా అనిపిస్తావ్.
ఏదైనా చెప్పేసుకోవచ్చు... అన్నంత క్లోజ్‌గా అనిపిస్తావ్ బాస్.
మా విన్నపం మన్నించండి.
కొంచెం కన్సిడర్ చేయండి బాస్.
ఇది ఓ ఫ్యామిలీకి కంబైన్డ్‌గా వచ్చిన కల.
వినాయకుణ్ణి ఏం కోరుకున్నారో సరదాగా చదవండి.

అత్తగారు ఊరి నుంచి ఆవకాయతో దిగుతుంది.

తెల్లారి లేచే సరికి కొడుకు కిచెన్‌లో కేరెట్ తరుగుతుంటాడు.

'అదేమిటే అమ్మాయ్. అబ్బాయి చేత కూరగాయలు తరిగిస్తున్నావ్. రేపటి నుంచి విమ్ సోప్ చేతిలో పెట్టి అంట్ల ముందు కూర్చోబెడతావా ఏంటి? వాడు ఉద్యోగానికి వెళ్లొద్దూ?' అంటుంది అత్తగారూ.

'నేనూ బేవార్సుగా లేను కదా అత్తయ్యా. నేనూ జాబ్‌కు వెళ్లాలి కదా. ఇంట్లో ఆ మాత్రం సాయం చేయకపోతే పనులెలా అవుతాయ్' అంటుంది కోడలు.

అక్కడి నుంచి ఆ ఇంట్లో శాంతికి విఘ్నం.

అలా కాకుండా అత్తగారు కిచెన్‌లో కష్టపడుతున్న కోడలిని చూసి 'ఏరా అబ్బాయ్. అమ్మాయి ఒక్కత్తే ఎంత పనని చేసుకుంటుంది. కూర్చుని పేపర్ చదువుకోకపోతే ఆ కేరెట్ కాస్త కట్ చేసి పెట్టరాదూ' అనంటే ఎంత బాగుంటుంది.

'నువ్వు స్నానానికి వెళ్లమ్మాయ్. ఈలోపు నేను కేరేజీ కట్టేస్తానుగా' అంటే ఎంత బాగుంటుంది.

'సాయంత్రం ఉరుకులు పరుగుల మీద వచ్చేయకండి. కలిసి సినిమాకెళ్లి హోటల్లో ఏదైనా తినేసి రండి. నాదేముంది ఈ పూట శనివారం. నేను ఉపవాసం. వస్తూ నాకేదైనా లైట్‌గా పట్రండి' అంటే ఎంత బాగుంటుంది.

అలా అని ఆశీర్వదించు స్వామీ.

● ❖ ●

పిల్లలు పిడుగులు.

తండ్రి ఆఫీసుకు వీరభక్తుడు.

'ఆదివారం పూటైనా కృష్ణకాంత్ పార్క్‌కు వెళ్లి కోన్ ఐస్‌క్రీమ్ తినిపించు డాడీ' అని వాళ్ల మారాము.

'మా బాస్ కొంటె కృష్ణుడు. పెండింగ్ వర్క్ పూర్తి చేయకపోతే మెమోతో ముద్దిస్తాడు' అని తండ్రి హైరానా.

పిల్లల అలక. తండ్రి ఆగ్రహం. తల్లి పీచుపీచు.

ఇక ఆ ఇంటి మనశ్శాంతికి విఘ్నం.

అలా కాకుండా ఆ బాస్‌ను ఏ అండమానో చెక్కేసేలా చేస్తే ఎంత బాగుంటుంది. డాడీగారు జాంజామ్మని సాయంత్రానికే ఇల్లు చేరుకుని బైక్ మీద ఫ్యామిలీ మొత్తాన్ని తీసుకుని జి.వి.కె మాల్‌లో మాలామాల్ చేయిస్తే ఎంత బాగుంటుంది.

మళ్లీ రెండు వారాల దాకా అడక్కుండా ఉండేలా ఫన్ జోన్‌లో ఆడించి, ఫుడ్ కోర్ట్‌లో తినిపించి, బిగ్ స్క్రీన్ మీద మహేశ్‌బాబు మాస్ మూవీ చూపించి తెస్తే ఎంత బాగుంటుంది.

అలా అని ఆశీర్వదించు స్వామీ.

● ❖ ●

భర్తగారికి ఊరుకూరికే ఆకలేస్తుంటుంది.

భార్యగారికి చీటికి మాటికి నిద్ర కమ్ముకొస్తోంది.

షుగరా అని భర్తకు డౌటు.

థైరాయిడ్డేమో అని భార్య నలుగుబాటు.

శనివారం ఎర్లీమార్నింగ్ ల్యాబ్‌లో బ్లడ్ శాంపిల్స్ ఇచ్చినప్పటి నుంచి రిపోర్ట్సు వచ్చేంత వరకూ అనుక్షణం ఆత్మశాంతికి విఘ్నం. ఆనందానికి విఘ్నం. ఆలోచనకు విఘ్నం.

అలా కాకుండా అది షుగరూ కాదూ పాడూ కాదు మనిషి గుమ్మటంలా ఉన్నావ్ అని రిపోర్టు వస్తే? థైరాయిడ్డు లేదూ ఏమీ లేదు మనిషి దంగల్ లేడీలా ఉందని కౌంట్ తేల్చి చెప్తే?

ఎంత హాయిగా ఉంటుంది.

మరెంత హాయలుగా అనిపిస్తుంది.

వానాకాలంలో జలుబు, ఎండాకాలంలో కాసిన్ని చెమటకాయలు, చలికాలంలో చుండ్రు తప్ప జీవితంలో ఎప్పుడూ ఏ అనారోగ్యం రాకుండా ఉంటే?

అలా అని కరుణించు స్వామీ.

ఈ లైఫ్‌ను హాస్పిటల్ మెట్లక్కనీయకుండా ఆశీర్వదించు స్వామీ.

● ❖ ●

జూబ్లీహిల్స్‌లో కలిగిన వారి కల్యాణానికి వెళ్లాం.

బెంగుళూరు నుంచి వచ్చిన చిట్టిరోజాలతో కట్టిన మండపం. ఒక సెల్ఫీ. ఒక మూలగా మద్రాస్ అయ్యంగార్ వయొలిన్ కన్సర్ట్. ఒక సెల్ఫీ. ఆహూతులలో సన్నాసన్నని తమన్నా. ఒక సెల్ఫీ. బఫే దగ్గర డబుల్ బిరియానీతో ఒక సెల్ఫీ. ఆలూ అల్‌బత్తాతో ఒక సెల్ఫీ.

ఇవన్నీ తీసుకుని ఇంటి కొచ్చి 'ఫ్యామిలీ గ్రూప్'లో వాట్సప్ చేసి వాట్ యార్ అని పోజు కొడదామంటే వైఫై పని చేయకపోతే? దేర్ ఈజ్ నో ఇంటర్‌నెట్ కనెక్షన్ అని మెసేజ్ చూపిస్తుంటే? ఆ యొక్క అతిశయానికి ఆ యొక్క ప్రదర్శనానందానికి ఎంతటి విఘాతం. మరెంతటి విఘ్నం.

అలా కాకుండా ఆల్వేస్ వైఫై పని చేసేలా ఉంటే?

నట్టింట నెట్ కళకళలాడుతుంటే?

అలా అని హండ్రెడ్ ఎంబిపిఎస్‌తో ఆశీర్వదించు స్వామీ.

● ❖ ●

అబ్బాయికి మీసం కర్వ్ తిరిగే ఏజ్ వచ్చింది.

పత్రితో
నీకు పూజలు చేస్తాం.
పచ్చగా ఉండే ఇళ్లను ఇవ్వు.
గొడుగు నీకు అమరుస్తాం.
ప్రకృతి గొడుగు గతి తప్పకుండా చూడు. ఉండ్రాళ్లు సమర్పిస్తాం.
ఆకలిగొన్న కడుపు
ఒక్కటీ లేకుండా చూడు.



అమ్మాయికి ఊరికూరికే నవ్వొచ్చే ప్రాయం వచ్చింది.

అబ్బాయి ఎక్కడ తిరుగుతాడో తెలియదు.

అమ్మాయిని ఎవరు తనవైపు తిరిగేలా చేసుకుంటారో తెలియదు.

'అది కాదూ..' అని తల్లి ఏదో చెప్పబోతుంది.

'నీకేం తెలియదు ఊర్కో' అని విసురు.

'అది కాదురా' అని తండ్రి ఏదో అనబోతాడు.

'నస ఆపు డాడీ' అని రుసురు.

ఏ వయసు ముచ్చట ఆ వయసులో ఉండాల్సి వున్నా అది హద్దు అదుపుల్లో ఆరోగ్యకరమైన అంచుల్లో లేకపోతే మరి ఆ తల్లిదండ్రులకు ఎంతటి ఘాతం. మరెంత విఘాతం.

అలా కాకుండా పిల్లలు తమ మంచి చెడ్డలను తల్లిదండ్రులతో పంచుకుంటే ఎంత బాగుంటుంది. వారిని తమ జర్నీలో తోడుగా ఉంచుకుంటే మరెంత అందంగా ఉంటుంది.

అలా అని ప్రతి సంతానానికీ వారి కన్నవారికీ వెలుగు పంచు స్వామీ.

నలుగురి హృదయాలలో ఆనందాన్ని వెలిగించు స్వామీ.

● ❖ ●

ఒక భర్తగారికి వాటర్ అలెర్జీ. అతను వైన్ షాప్‌లో దొరికేదానినే వాటర్ అనుకుని పుచ్చుకుంటూ ఉంటాడు. ఒక హజ్బెండ్ గారికి ఇల్లంటే రోత. వారు పేకాట క్లబ్బునే తన ఆవాసం చేసుకుంటూ ఉంటారు. ఒక మొగుడు మహాశయునికి కరెన్సీయే ఆక్సిజన్. దాని వేటలో ఇంటికే రారు. ఒక పురుషుడు వేళ్లతో వాట్సప్‌లో ఎవరెవరితోనో మాట్లాడటం తప్ప ఇంట్లో నోరు తెరవడు. ఒక మగ అతనికి నిలువెల్లా అనుమానం. మరో మగపురుగుకి చేయి దురుసు జాస్తి.

ఏ ఇంటికైనా ఇంతకు మించిన విఘ్నం ఉంటుందా?

ఆ ఇంటి ఇల్లాళ్లకు పిల్లలకు అంతకు మించిన విఘాతం ఉంటుందా?

సరదాలు వ్యసనాలుగా మారని, విసుగులు ఉత్పాతాలుగా రూపాంతరం చెందని, అసంతృప్తులు ఆజ్యంగా మారి పైకప్పులను తగలబెట్టని ఇళ్లు కావాలి. దంపతులు మార్నింగ్ పూట కలిసి చిర్నవ్వుతో టీ సేవించే, పిల్లలు నవ్వుకుంటూ స్కూలు విషయాలు చెబుతూ ఒడిలో కూర్చునే, అమ్మానాన్నలూ తరుచూ వచ్చిపోయే లేదంటే పిల్లల దగ్గరే ఉండిపోయే, నెలకోసారైనా ఆత్మీయులు చేయి కడిగే, ఆనందానికి తప్ప దుఃఖానికి చెమర్చని కళ్లు ఉండే, ఇరుగు పొరుగులతో సామరస్యం ఉండే, చక్కని వంట కుదిరే, పండే పక్క కుదిరే, తృప్తిగా నిదుర పట్టే, నిర్మలమైన వేకువ తట్టి లేపే ఇళ్లు ఉంటే ఎంత బాగుంటుంది?

అలాంటి ఇళ్లను కటాక్షించు స్వామీ.

బయట జోళ్ళు, ఇంట్లో వెచ్చాలు, అవసరాలు తీర్చగల డబ్బు ఉండే ఏటీఎం కార్డులు, బాల్కనీలో పూలు పూసే కుండీలు, అవసరానికి సాయం చేసే చేతులు, దేవుని ఆశీర్వాదాలు, చెదరని దరహాసాలు... ఇవి ఉండే ఇళ్లను ప్రసాదించు స్వామీ.

పత్రితో నీకు పూజలు చేస్తాం.

పచ్చగా ఉండే ఇళ్లను ఇవ్వు.

గొడుగు నీకు అమరుస్తాం.

ప్రకృతి గొడుగు గతి తప్పకుండా చూడు.

ఉండ్రాళ్లు సమర్పిస్తాం.

ఆకలిగొన్న కడుపు ఒక్కటీ లేకుండా చూడు.

నిన్ను చల్లగా నిమజ్జనం చేస్తాం.

సకల అసంతృప్తులను అసమానతలను అమానవీయ ఆలోచనలను ఏటిలో కలుపు.

అస్తు దేవా. తథాస్తు గణేశా.

- కె

ఆత్మీయం


నువ్వు నీలా ఉండటమే ఆనందం!

కూలిపని చేసుకునే వారినుంచి కోటీశ్వరుల వరకు ప్రతి ఒక్కరూ కోరుకునేది ఆనందమే. ఏ పని చేసినా ఆనందం కోసమే. ప్రతిక్షణం ఆనందం కోసమే పాకులాడతారు. ఆనందం ఎక్కడ ఉందో అని ప్రతిచోటా వెదుకుతారు. కాని దానిని ఎప్పటికీ కనుక్కోలేకపోతున్నారు. ఎందుకిలా జరుగుతోంది? ఇంత శాస్త్రీయ పురోగతి సాధించి అత్యాధునిక సౌకర్యాలు, విలాసాలు అనుభవించినా ఎందుకు ఇంకా దుఃఖంలోనే ఉన్నాడు. భౌతికంగా ఎంత అభివృద్ధి సాధించినా అంతర్గతంగా మాత్రం బికారిలాగే ఉన్నాడు. ఎందుకిలా జరుగుతోంది? అనే సందేహం మనలో చాలామందిని వేధిస్తోంది.

మొట్టమొదట తెలుసుకోవాల్సిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆనందం అనేది ఎక్కడోవెతికితే దొరికే విషయం కాదు. అది ప్రతి వ్యక్తి లోనూ అంతర్గతంగా ఉంటుంది. అసలు నీ సహజ స్థితే ఆనందం. దాని కోసం ఎక్కడ వెతికినా ఆనందానికి దూరమైనట్టే. ఒక ముసలామె సూది ఇంట్లో పోగొట్టుకొని దానికోసం ఇంటి వెనకాల వెతికిందట. ఆలా ఉంది మన పరిస్థితి. ఇంత కాలం భౌతిక విషయాల్లో ఆనందాన్ని వెతుక్కుంటూ సమయాన్ని వృథా చేసుకున్నాం. నీవే ఒక సచ్చిదానంద స్వరూపం. 'ఆనందం నాలో ఉండటమేంటి? అని సందేహం వచ్చింది. సత్తు అంటే సత్యం అంటే ఈ క్షణం. చిత్తు అంటే మనస్సు అంటే నా మనస్సు ఈ క్షణంతో సంపూర్ణంగా ఉన్నప్పుడు కలిగేదే సచ్చిదానందం. మనం ఏ పని చేసేటప్పుడు ఆ పనిలో పూర్తిగా లీనం అవుతూ చేయాలి. ఐస్‌క్రీమ్ తినేటప్పుడు దానిని హాయిగా తినాలి. ఆనందించాలి. చాకొలేట్ చప్పరించేటప్పుడు ఆ తియ్యదనాన్ని పూర్తిగా అనుభవిస్తూ చప్పరించాలి. పని




విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. ఆడుతు పాడుతూ పని చేస్తే అలుపూ సొలుపూ ఉండదన్న సినీ కవి పాటలాగే ఆనందంగా చేస్తే ఆస్వాదిస్తాం. లేదంటే భారంగా ఉంటుంది. పిల్లలకీ, పెద్దలకీ అదే తేడా! చాకొలేట్ తినేటప్పుడు వాళ్లు మరో పని మీద దృష్టి పెట్టరు. అది నోటినిండా, మూతినిండా అవుతోందని లెక్కపెట్టరు. అన్నం తినేటప్పుడూ, పడుకునేటప్పుడూ కూడా అంతే! అందుకే ఆనందంగా ఉండాలంటే మనం మళ్లీ మరోసారి పిల్లలమైపోదాం.



సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం
25-8-2017



ఉండ్రాళ్లు



కావలసినవి
బియ్యపురవ్వ– కప్పు; నీళ్లు – రెండు కప్పులు; శనగపప్పు – పావు కప్పు(నానబెట్టాలి); జీలకర్ర – టీ స్పూన్; నెయ్యి – మూడు టీ స్పూన్లు; ఉప్పు–కొద్దిగ; పచ్చికొబ్బరి – 3 టేబుల్ స్పూన్లు

తయారి: ముందుగా మందపాటి పాత్రలో నెయ్యి వేసి కాగాక జీలకర్ర, శనగపప్పు వేసి కొద్దిగా వేయించాలి. అందులో నీరు పోసి, ఉప్పు వేసి, మరుగుతుండగా, బియ్యపు రవ్వ వేసి కలపాలి. సన్నని సెగ మీద ఉడికించాలి. చల్లారాక చెయ్యి తడిచేసుకుంటూ ఉండలు కట్టాలి. వీటిని ఆవిరి మీద ఉడికించి, దించి, తీసుకోవాలి.

బెల్లం తాలికలు



కావలసినవి:
బియ్యప్పిండి – గ్లాసు; గోధుమ పిండి – అర గ్లాసు; బెల్లం – 2 గ్లాసులు; ఎండు కొబ్బరి ముక్క లు – కొద్దిగా; నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు; జీడిపప్పు, బాదం పలుకులు – తగినన్ని; ఏలకుల పొడి – చిటికెడు

తయారి: అర గ్లాసు నీళ్లు పోసి, కొద్దిగా బెల్లం వేసి కరిగించాలి. దీంట్లో గోధుమపిండి వేసి చపాతీపిండిలా కలపాలి. కొద్ది కొద్దిగా పిండి తీసుకుంటూ సన్నగా తాల్చాలి. గిన్నెలో ఒకటిన్నర గ్లాసుల నీళ్లపోసి మరుగుతుండగా బెల్లం కరిగించి, తాలికలను ఉడికించాలి. దీంట్లో బియ్యప్పిండి పోస్తూ, ఉండలు లేకుండా కలపాలి. మిశ్రమం బాగా ఉడికాక, ఏలకుల పొడి వేయించిన బాదం జీడిపప్పు పలుకులు, కొబ్బరి ముక్కలు కలపాలి.

శివసుతుని

భూ కై

శివుడు భక్త సులభుడు. రావణుడు భక్త ధురంధరుడు. శివుడికి భక్తుడు కావాలి. రావణుడికి శివుడు కావాలి. ఈ రెండూ విచక్షణ కోల్పోతే మానవులకూ దేవతలకూ ఉపద్రవం వచ్చి పడుతుంది. దానిని నిలువరించే శక్తి కావాలి. ఆ శక్తే విఘ్నేశ్వరుడు. చివరి నిమిషంలో ఆయన చూపిన చమత్కారమే 'భూ కైలాస్' కథ.

● ❖ ●

రావణుడు విశిష్ట శివభక్తుడు. రావణుడి తల్లి కైకసి నిత్య హరనామస్మరణలో తరియించే భక్తాగ్రేసరురాలు. ఆమె ప్రతినిత్యం సముద్రపు ఒడ్డున సైకత లింగం ప్రతిష్ఠించి దానికి పూజలు చేసి ఆ ప్రసాదాన్ని తన పుత్రుడు రావణుడికి ఇస్తుంటుంది. ఆ ప్రసాద బలమే రావణుడి మహాబలం. ముల్లోకాలను గడగడలాడించగల ప్రచండబలం. అప్పటికే రావణుడు భూలోకాన్ని జయించాడు. అంతటితో తృప్తి తీరక అమరపురిపై దండెత్త దలిచాడు. అదే గనక జరిగితే దేవేంద్రుని పీఠం కదిలిపోతుంది. నారాయణుని ఉనికికి సవాలు ఎదురవుతుంది. నారదుడు ఇది గ్రహించి దేవేంద్రుణ్ణి రావణుడిపై ఉసిగొలుపుతాడు. కైకసి ఆరాధించే సైకత లింగపూజను భగ్నం చేసి ఆ ప్రసాద బలం రావణుడికి అందకుండా చేయమంటాడు. దేవేంద్రుడు అలలలో దూరి సైకత లింగాన్ని కబళిస్తాడు. పూజను నీటిపాలు చేస్తాడు. కైకసి దీనిని దుశ్శకునంగా భావిస్తుంది. శివుడికి అపచారం జరిగిందని తల్లడిల్లుతుంది. తల్లి వేదనను గ్రహించిన రావణుడు నిత్యం తయారు చేసుకునే సైకత లింగమేలా... ఆ పరమేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకుని ఏకంగా అతని ఆత్మలింగమే తీసుకొని వస్తానని శపథం చేస్తాడు.

ఏదో చేయబోతే ఏదో అయినట్టు అదే గనక జరిగితే భూలోకమే కైలాసం అవుతుంది. దేవగణాలన్నీ ఆత్మలింగం ఉన్న చోటుకే తరలివచ్చి దేవపురి దివాలా తీస్తుంది. అందుకే దేవేంద్రుడు రావణుని ఘోర తపస్సును భగ్నం చేయబూనుకుంటాడు. త్రాచులను

వదులుతాడు. కొండ చిల
అప్పటికీ చలించకపోతే ఆ
దించుతాడు. అయినప్పటి
లొంగడు. సంకల్పం నుం

ఆ తపస్సుకు మెచ్చి
ప్రత్యక్షమవుతాడు. మరు
భక్తుని కోరిక మేరకు ఆత్మ
అంతలోనే విష్ణువు విష్ణువ
రావణుడిలో మాయను ప్ర
బదులు ఏకంగా పార్వతిన
అడిగేలా చేస్తాడు.

జగన్మాతను ఆశించిన

అయినప్పటికీ వచన
కాదనలేక పార్వతిని రావ
వియోగంతో తల్లడిల్లిన ప
విష్ణుమాయ అని గ్రహించి
వియోగబాధ నీకు అర్థమ
జన్మ ఎత్తి సతీ వియోగంత
అనుభవించు' అని శపిస్తు

అది విని నారదుడు

ఎందుకంటే రావణుడ
ఉంది. రాముడి జన్మకు ఈ

ఈ శాపం ఇచ్చాక పా
తిరిగి శివుని సన్నిధికి చేరు
రావణుడు పాతాళ లోకాధి
కుమార్తె మండోదరిని చూ
ఉన్న పార్వతి అనుకుని ఆ
చేసుకుని లంకకు తీసుకుని

సాక్షాత్తూ పార్వతీదేవి
రావణుణ్ణి చూసి రావణుని
హతాశురావుతుంది. శివ
రావణుణ్ణి దూషిస్తుంది. అ
విష్ణుమాయ వదిలిపోదు.



తొలి పూజ గణ

ఉత్తర కర్నాటక జిల్లాలో అ
'గోకర్ణం' క్షేత్రం ఉంది. ఇక్క
చెప్పుకునే మహాబలేశ్వర ఆ
భూమిలోకి ఉన్నట్టుగా ఉండే
రూపంలో దర్శనం ఇవ్వకపో
ఇచ్చే నిజ దర్శనంలో దీని పై
ఉండటం చూడవచ్చు. రావ
లింగంపై ఉంటాయంటారు.
మహాగణపతి ఆలయం ఉంది. ఆ మూల విరాట్టు శిరస్సు మీద చిన్న సొట్ట ఉంటుంది.
చేతితో మొట్టడం వల్ల పడిన సొట్టగా అభివర్ణిస్తారు. ఈ క్షేత్రంలో ఆత్మలింగాన్ని దర్శిం
మహా గణపతిని పూజించాలి. ఆనాడు తనకు తొలి పూజ జరగకపోవడం వల్ల కోప్పడిన
ప్రతిఫలంగా ఈనాడు ఇక్కడ తొలిపూజలు అందుకుంటున్నాడన్న మాట.

నాటి సినిమా

దివ్య చమత్కారం

ైలాస్



ువలను చుట్టబెడతాడు.
ఖరు అస్త్రంగా దేవ వేశ్యలను
కీ రావణుడు బెసకడు.
చి చెదరడు.
శంకరుడు పార్వతీ సమేతంగా
నిమిషంలో ఆ ఆదిదేవుడు
్మలింగం సమర్పించేవాడే. కాని
ూయను చూపుతాడు.
వేశపెట్టి ఆత్మలింగానికి
ీ తన పత్నిగా చేయమని

ఆ కోరిక నాశన హేతువు.
బద్ధుడైన శివుడు ఇచ్చిన మాట
ణుడికి అప్పజెప్పుతాడు. శివ
ార్వతి దీనికంతటికీ కారణం
ి 'ఓ నారాయణుడా... నా
వ్వాలంటే భూలోకాన మానవ
తో ఇంతకింత బాధ
ంది.
ఆనందబాష్పాలు రాలుస్తాడు.
ి అంతం రాముడి చేతిలో
ఈ శాపమే కారణమవుతోంది.
ార్వతి రావణుణ్ణి మాయ చేసి
ుకుంటుంది. మరోవైపు
పతి అయిన మయాసుర
ి ఆమే మాయారూపంలో
మెను కాంక్షిస్తాడు. వివాహం
ి వస్తాడు.
ని వివాహం చేసుకుని వచ్చిన
ి తల్లి కైకసి
ద్రోహి, మాతృద్రోహి అంటూ
అప్పటికిగాని రావణుడిలోని
ఆత్మలింగానికి బదులు





పార్వతీదేవిని వాంఛించడం, మండోదరిని పార్వతి దేవే అనుకొని వివాహం చేసుకోవడం ఇవన్నీ గుర్తుకు వచ్చిన రావణుడు పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు. మండోదరిని భార్యగా స్వీకరించి ఈసారి నిజంగా ఆత్మలింగం సాధించుకొని రావడానికి బయలుదేరుతాడు.

● ❖ ●

ఘోర తపస్సు జరుగుతుంది. రావణుడు తన తలను ఖండించుకుని శివుడికి అర్పణం చేస్తాడు.

శివుడు మరి నిలువలేక ప్రత్యక్షమై వక్షస్థలం నుంచి దివ్య తేజస్సుతో ప్రజ్వరిల్లుతున్న ఆత్మలింగాన్ని పెకలించి రావణుని చేతిలో పెడతాడు. 'లంకకు చేరుకునే వరకు ఈ లింగాన్ని నేలకు దించకు. ఎక్కడ దించితే అక్కడే అది స్థిరపడిపోతుంది. దానిని కదల్చడం స్వయంగా నా వల్ల కూడా కాదు' అని చెప్తాడు.

రావణుడు ఆత్మలింగం తీసుకుని బయలుదేరుతాడు.

అదే జరిగి ఆత్మలింగం లంకకు చేరితే రావణుడు మరింత శక్తిమంతుడవుతాడు. మరింత పెట్రేగుతాడు. అందుకనే నారదుడు విఘ్నేశ్వరుణ్ణి శరణుజొచ్చుతాడు.

'విఘ్నేశ్వరా. నీకు ప్రథమ పూజ చేయకుండా అవిఘ్నంగా రావణుడు ఆత్మలింగాన్ని పట్టుకు పోతున్నాడు' అని నివేదిస్తాడు. విఘ్నేశ్వరునికి కోపం వస్తుంది. 'రావణుడు అంత పని చేస్తాడా' అని బ్రాహ్మణ బాలుని రూపంలో రావణుడి దారిలో కాపు కాస్తాడు. ఇదే అదనుగా విష్ణుమూర్తి తన చక్రాన్ని సూర్యుడికి అడ్డం పెట్టి సంధ్యా సమయాన్ని సృష్టిస్తాడు. అది గమనించిన రావణుడు సంధ్య వార్చడానికి వెళ్లి వస్తానని దారిలో కనిపించిన విఘ్నేశ్వరుని చేతిలో ఆత్మలింగాన్ని పెడతాడు. తాను వచ్చే వరకు దానిని నేలకు దించవద్దని సూచిస్తాడు.

కాని మాయా రూపంలో ఉన్న విఘ్నేశ్వరుడు 'నేను ముమ్మార్లు నిన్ను పేరు పెట్టి పిలుస్తాను. వచ్చావా సరేసరి. లేదంటే లింగాన్ని కింద పెట్టేస్తాను' అంటాడు. రావణుడు సంధ్య వారుస్తుండగా గబగబా ముమ్మార్లు రావణుని పేరు పిలిచి లింగాన్ని నేలకు దించేస్తాడు.

ఇంకేముంది. ఆత్మలింగం తక్షణమే అదే స్థలిలో ప్రతిష్టితమైపోతుంది.

రావణుడు ఎంతో విలపిస్తాడు. విఘ్నేశ్వరుణ్ణి దుర్భాషలాడతాడు. తల మీద మొట్టుతాడు. లింగాన్ని ఊడ పెరకడానికి ప్రయత్నించి విఫలమవుతాడు. తుదకు ఆత్మలింగాన్ని అక్కడే వదిలిపెట్టి లంకకు పయనమవుతాడు. అలా అసురుని బారిన పడాల్సిన ఆత్మలింగం విఘ్నేశ్వరుని పుణ్యమా అని భూలోకాన ప్రతిష్టితమై మానవుల పూజలను అందుకునే దివ్యలింగంగా నేటికీ అలరారుతోంది.

అలా ఆత్మలింగం ప్రతిష్టితమైన పుణ్యక్షేత్రమే కర్నాటకలో ఉన్న గోకర్ణం. అక్కడ పూజలందుకుంటున్న మహాబలేశ్వర లింగమే నాటి ఆత్మలింగం.

● ❖ ●

'గోకర్ణం' క్షేత్ర కథ ఆధారంగా ఏ.వి.ఎం ప్రొడక్షన్స్‌వారు 1958లో తీసిన చిత్రమే 'భూకైలాస్'. ఎన్టీఆర్ రావణాసురుడిగా, జమున మండోదరిగా, అక్కినేని నారదుడిగా నటించిన ఈ సినిమా ఆబాలగోపాలాన్ని అలరించి హిట్‌గా నిలిచింది. తమిళనాడులో రావణుడికి ఉన్న ఆదరణ దృష్ట్యా ఇదే సినిమా అక్కడ 'భక్త రావణ'గా అనువాదమై విడుదలైంది. నిజానికి ఈ సినిమా రావణుని అమాయక, అచంచల భక్తికి ఒక మచ్చుతునక. శివుని మీద అతడికున్న భక్తి, అతడి వీరత్వం, నిజాయితీ దేవతల పథక రచన, పన్నాగం ఈ సినిమాలో కనిపిస్తాయి. అందరూ కలిసి రావణుని దారి మళ్లించి అతడికి దక్కవలసిన ఆత్మలింగాన్ని దక్కకుండా చేస్తారు. అయినప్పటికీ రావణుడు అఖండ శివభక్తునిగా పురాణాల్లో నమోదయ్యాడు. అతని వంటి శివభక్తుడు మరొకడు లేదు. ఎన్టీఆర్ రావణుని పాత్రను పాలధార వంటి స్వచ్ఛతతో పోషించి ఆకట్టుకుంటే అక్కినేని నారద పాత్రకు ఉండాల్సిన వంచనా శిల్పాన్ని ప్రదర్శించి మెప్పిస్తారు. సముద్రాల మాటలూ పాటలూ అందించిన ఈ సినిమాకు ఆర్. సుదర్శనం సంగీతం అందించారు. 'దేవ దేవ ధవళాచల మందిర'... , 'నీలకంధరా దేవా'..., 'రాముని అవతారం రవికుల సోముని అవతారం'... పాటలు రంజింప చేస్తాయి. రావణుని తపస్సును భగ్నం చేయడానికి వచ్చిన దేవ కన్యగా సుప్రసిద్ధ డాన్సింగ్ స్టార్ హెలన్ కనిపించి 'సుందరాంగ అందుకోరా' పాటలో అలరిస్తుంది. ఆ పాట కూడా హిట్టే.

పురాణాల్లో అసురులే గొప్ప దైవభక్తులు. వారి వరాల్లో దోషం వుండొచ్చుగాని వారి భక్తిలో లేదు. 'భూకైలాస్' కూడా అటువంటి ఉదంతానికి ఒక ఉదాహరణ.

- కె

ంపతికే

ేబియా సముద్రం ఒడ్డున
ిడే ఆత్మలింగ క్షేత్రంగా
లయం ఉంది. పూర్తిగా
ే ఈ లింగం నిత్యం నిజ
ోయినా పన్నెండేళ్లకొకసారి
ిక్కొన చేతులతో లాగినట్టుగా
ణుడి చేతి గుర్తులు ఈ
. అలాగే ఈ క్షేత్రంలో
ఇది ఆనాడు రావణుడు
ుకోవాలంటే ముందుగా
వినాయకుడు అందుకు





నంద్యాలలోని సూరజ్ గ్రాండ్ హోటల్ వద్ద వైఎస్సార్ సీపీ నేతల పైకి కొడవలితో దూసుకెళ్తున్న మధు



కాల్పులు జరుపుతున్న మధు గన్‌మెన్. చిత్రంలో వేట కొడవలితో రెచ్చిపోతున్న మధు



వైఎస్సార్ సీపీ నేతలపైకి రాళ్లు విసురుతున్న మధు అనుచరుడు



మధు

నంద్యాల్లో రౌడీ రాజ్యం

నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్ ప్రాంతం.. గురువారం మిట్ట మధ్యాహ్నం ఒంటి గంట కావస్తోంది.. దారికి అడ్డంగా ఓ వాహనం ఉండటంతో మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి వాహనం అక్కడికొచ్చి ఆగింది.. వాహనాన్ని పక్కకు తీయండని డ్రైవర్ చెబుతుండగానే ఎదుటి వైపు నుంచి రాళ్ల దాడి మొదలైంది.. టీడీపీ నేత మధు చేత్తో వేట కత్తి పట్టుకుని ఊగిపోతూ ఆవేశంతో రంకెలేస్తున్నాడు.. అంతలోనే ఆయన పక్కనున్న మరో వ్యక్తి చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమైంది.. చేయి పైకెత్తి టపా..టపా.. మని కాల్పులు జరిపాడు.. ఫ్యాక్షన్ సినిమాలోని సీన్‌ను తలదన్నేలా సాగిన ఈ సన్నివేశం సాక్షాత్తు పోలీసుల కళ్లెదుటే జరిగింది.. స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది.

సాక్షి ప్రతినిధి, కర్నూలు

కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలో ఓటమి భయంతో అధికార పార్టీ అరాచకాలకు తెరలేపింది. పోలింగ్ రోజున పోలింగ్ శాతం పెరిగే కొద్దీ మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతూ నియోజకవర్గం మొత్తం కలియతిరుగుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. తాజాగా పోలింగ్ ముగిసిన మరుసటి రోజే గురువారం మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణి రెడ్డిపై అధికార పార్టీకి చెందిన మధుసూదన్ రావు అలియాస్ అభిరుచి మధు ఏకంగా వేట కొడవలితో హత్యాయత్నం చేశాడు. మధు గన్‌మ్యాన్ శిల్పాను లక్ష్యంగా చేసుకుని రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. నంద్యాల నడిరోడ్డులో కార్లతో అటకాయించి మరీ.. చక్రపాణి రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన వైనం మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఈ తతంగమంతా పోలీసుల కళ్లెదుటే జరిగింది. అయినప్పటికీ బాధితులు శిల్పా చక్రపాణి రెడ్డి, ఆయన అనుచరులపైనే తొలుత కేసు నమోదు చేశారు. పోలీసుల కళ్లెదుటే టీడీపీ నేత మధు వేట కత్తి పట్టుకుని వీరంగం సృష్టిస్తుంటే కనీసం దానిని లాక్కొని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయలేదు. రౌడీషీటర్‌గా ఉన్న అధికార పార్టీకి చెందిన అభిరుచి మధును పోలీసులు కనీసం వారించే ప్రయత్నం జరగకపోవడం.. నిందితులను వెనకేసుకొస్తూ మంత్రి అఖిలప్రియ మాట్లాడటాన్ని గమనిస్తే అంతా స్కెచ్ ప్రకారమే వ్యవహారం నడిచిందన్న అనుమానాలు బలపడుతున్నాయి. మధుపై రౌడీషీట్ ఎత్తివేయడంతో పాటు ఉప ఎన్నికకు ముందు హడావుడిగా గన్‌మ్యాన్‌ను కేటాయించడం చర్చనీయాంశమైంది. అంటే ఉప ఎన్నికకు ముందు అధికార పార్టీ.. ప్రతిపక్ష పార్టీ నేతలపై దాడులకు వ్యూహాత్మకంగా రంగం సిద్ధం చేసిందని తెలుస్తోంది.

జరిగింది ఇదీ...

నంద్యాలలోని సలీంనగర్‌లో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు చింపింగ్ బాషా బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డితో పాటు నలుగురు కౌన్సిలర్లు పరామర్శించి తిరిగి వస్తున్నారు. అధికార పార్టీకి కేంద్రంగా ఉన్న సూరజ్ హోటల్ సెంటర్‌లో టీడీపీ నేత అభిరుచి మధుతో పాటు మరికొందరు కార్యకర్తలు తమ కార్లను అడ్డంగా నిలిపి ఉంచి చక్రపాణి రెడ్డి కారును అటకాయించారు. దీంతో సైడ్ ఇవ్వమని చక్రపాణిరెడ్డి కారు డ్రైవర్ పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఏ మాత్రం వారు స్పందించలేదు. అనంతరం నానాబూతులు తిడుతూ చక్రపాణి రెడ్డి కారువైపు అభిరుచి మధుతో పాటు మరికొందరు రాళ్లు రువ్వుతూ వేట కొడవళ్లతో దూసుకొచ్చారు. దీంతో చక్రపాణిరెడ్డి వెంట ఉన్న వారు ప్రతిఘటించేందుకు యత్నించారు. ఈ సందర్భంగా మధు గన్‌మ్యాన్ సోమభూపాల్ (నెం.1681) రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ తతంగం జరుగుతుండగా అక్కడ పోలీసులు కూడా ఉన్నారు. అయితే వారు మధు చేతిలోని వేట కొడవలిని లాక్కునేందుకు కానీ, అతన్ని అదుపులోకి తీసుకునే ప్రయత్నం కానీ చేయలేదు. కొంత సేపటి తర్వాత చక్రపాణి రెడ్డిని ఇంటికి పంపించారు. అభిరుచి మధును బుజ్జగిస్తూ అతన్ని కూడా కారు ఎక్కించి మరీ సాగనంపారు. కనీసం ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా అతన్ని అదుపులోకి తీసుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం విమర్శలకు తావిచ్చింది.

బాధితులపైనే కేసులు

ఏదైనా సంఘటన జరిగితే మొదటగా ఎవరైతే బాధితులో వారి పక్షాన పోలీసులు నిలవాలి. అయితే ఇక్కడ మాత్రం పోలీసు యంత్రాంగం మొత్తం అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగానే వ్యవహరించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నడిరోడ్డుపై వేట కొడవలి పట్టుకుని వీరంగం సృష్టించడంతో పాటు గీత గీసి మరీ సవాల్ విసిరిన మధును కనీసం ముందస్తు జాగ్రత్తలో భాగంగా అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయలేదు. పైగా ఒకడుగు ముందుకు వేసి మధు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చక్రపాణి రెడ్డితో పాటు ఇతర నేతలపై కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ నేత జగదీశ్వర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధుతో పాటు మున్నా అలియాస్ ఖాదర్, షేక్ చిన్ను, వేణు, గన్‌మ్యాన్ సోమభూపాల్‌పై కేసు నమోదు చేశారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొంటున్నారు.

రౌడీషీట్‌ను ఎత్తేసి ప్రోత్సహించారు..

వాస్తవానికి టీడీపీ నేత అభిరుచి మధు వ్యవహారంపై అనేక ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా అనేక మందిపై నడిరోడ్డుపై దాడి చేయడంతో పాటు పలు బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆయనపై 2009లో నంద్యాల టూటౌన్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటు నమోదైంది. వరుస దాడులతో జిల్లా ఉపాధ్యక్షుడి పదవి కూడా పోయింది. అయితే తిరిగి చంద్రబాబు, లోకేశ్‌లను కలిసి పదవి సంపాదించుకున్నారు. 2014లో చంద్రబాబు వచ్చాక రౌడీషీటర్‌ను కూడా ఎత్తివేశారు. ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేసేందుకు వీలుగా ఏకంగా గన్‌మెన్లను ప్రభుత్వం కేటాయించింది. జరిగిన మొత్తం సంఘటలను విశ్లేషిస్తే అంతా పక్కా స్కెచ్ ప్రకారమే వ్యవహారం నడిచిందని అర్థమవుతోంది. అసలు రౌడీషీటర్‌గా రికార్డు ఉన్న మధుకు గన్‌మెన్లను (1+1)ఎలా కేటాయిస్తారన్న ప్రశ్న ఇప్పుడు ఎదురవుతోంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతోనే భద్రత కల్పించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అసలు మారణాయుధాలతో నడిరోడ్డుపై ఎలా తిరిగారన్న ప్రశ్న ఎదురవుతోంది.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మధు

ఉద్దేశ పూర్వకంగానే మాపై దాడులు



ఉప ఎన్నికల నేపథ్యంలో మాపై అధికార పార్టీ ఉద్దేశ పూర్వకంగానే దాడులు చేస్తోంది. పోలింగ్ సందర్భంగా కూడా మా పార్టీ నేతలు, కార్యకర్తలపై అధికార పార్టీ నేతలు దాడులకు దిగారు. ఎంతగా రెచ్చగొడుతున్నా సంయమనం పాటిస్తున్నాము. అయినప్పటికీ నడిరోడ్డుపై మాపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. అధికార పార్టీ నేతల బెదిరింపులకు బెదిరేది లేదు. మా నేతలు, కార్యకర్తలను కాపాడుకుంటాము. ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే అధికార పార్టీ ఈ విధంగా వ్యవహరిస్తోంది. ప్రశాంతంగా ఉన్న నంద్యాలలో అల్లర్లను రెచ్చగొట్టాలని చూస్తోంది. దీనిని ప్రజలెవ్వరూ సహించరు.

– చక్రపాణి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నేత

అభిరుచి మధు నేర చరిత్ర

- 2009లో నంద్యాల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఓపెన్ చేశారు.
- 2015లో ఫైనాన్స్ వ్యాపారాలు చేసేటప్పుడు బలవంతంగా డబ్బు వసూలు చేశాడని కాల్‌మనీ కేసులు నమోదయ్యాయి.
- మంత్రులు నారాయణ, లోకేశ్‌తో ఉన్న పరిచయంతో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, భూకబ్జాలకు పాల్పడ్డాడని అభియోగాలున్నాయి.

తుపాకుల డిపాజిట్‌లోనూ నిర్లక్ష్యం

కర్నూలు(అగ్రికల్చర్) : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర ఎటువంటి ఆయుధాలు ఉండరాదు. గత నెల మూడో వారం నుంచి నంద్యాల ఉప ఎన్నిక కోడ్ అమలులోకి వచ్చింది. వివిధ పార్టీల నేతలు వెంటనే లైసెన్స్‌డ్ తుపాకులను సంబంధిత పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయాలి. ఇందుకు రెవిన్యూ అధికారులు చొరవ తీసుకోవాలి. జిల్లాలో 2,252 లైసెన్స్‌డ్ తుపాకులు ఉండగా, ఇందులో బ్యాంకు సెక్యూరిటీ గార్డుల వద్ద 84 ఉన్నాయి. ఇప్పటివరకు 1,211 తుపాకులు పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ అయ్యాయి. అంటే 957 తుపాకులు డిపాజిట్ కాలేదు. ఇవి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే ఉండిపోయాయి.

హత్యా రాజకీయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం



- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్‌కే రోజా ధ్వజం
- చంద్రబాబు రాక్షసానందం పొందుతున్నారు
- రాష్ట్రంలో శాంతిభద్రతలను గాలికి వదిలేశారు

పుత్తూరు: రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా ఆరోపించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం నంద్యాలలో శిల్పా చక్రపాణిరెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఆమె ఖండించారు. నడిరోడ్డుపై కత్తులు, తుపాకులతో టీడీపీ నాయకులు చెలరేగుతుంటే అణచివేయాల్సిన పోలీసులు వారిని బుజ్జగించడం సిగ్గుచేటని మండిపడ్డారు. అర్హత లేని వారికి గన్‌మెన్ సౌకర్యం కల్పించడమే కాకుండా వారిని ప్రతిపక్షాలపైకి, ప్రజలపైకి ఉసిగొల్పి సీఎం చంద్రబాబు నాయుడు రాక్షసానందం పొందుతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా టీడీపీ నాయకులకు తుపాకులు, బుల్లెట్లు ఎక్కడి నుంచి వచ్చాయని రోజా ప్రశ్నించారు. కర్నూలు జిల్లాలో నారాయణరెడ్డి హత్య, ప్రకాశం జిల్లాలో గొట్టిపాటి రవికుమార్, కరణం బలరాం వర్గాల మధ్య జరిగిన దాడుల్లో ఇద్దరు చనిపోయినా ఆ కేసులు ఇంతవరకూ అతీగతీ లేకుండా పోయాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. హత్య, అత్యాచారం కేసుల్లో నిందితులను కాపాడేందుకు 120 జీవోలను జారీ చేసిన చంద్రబాబుకు హైకోర్టు మొట్టికాయలు వేసినా బుద్ధిరాలేదని విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ ఫ్యాక్షన్ హత్యలకు జరగడానికి చంద్రబాబు ప్రభుత్వం ఆజ్యం పోస్తోందన్నారు. చంద్రబాబుకు, టీడీపీ నాయకులకు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆగని అధికార పార్టీ అరాచకాలు

- నంద్యాలలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని కుటుంబంపై దాడి
- కర్రలతో కొట్టి గాయపరిచిన వైనం

నంద్యాల అర్బన్: నంద్యాల ఉప ఎన్నికలో పోలింగ్ శాతం భారీగా నమోదు కావడం అధికార టీడీపీ నేతల్లో అసహనం రేగుతోంది. పోలింగ్ సందర్భంగా టీడీపీ అక్రమాలను అడ్డుకున్న వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న కారణంతో గురువారం ఓ కుటుంబంపై దాడి చేశారు. మహిళ చీర లాగి గాయపరిచారు. ఈ ఘటన నంద్యాల పట్టణంలోని విశ్వనగర్‌లో చోటు చేసుకుంది. విశ్వనగర్‌కు చెందిన రాములమ్మ కుటుంబం కిరాణా దుకాణం నడుపుకొంటూ జీవనం సాగిస్తోంది. ఇంటి ఎదురుగా పది సెంట్ల స్థలంలో టీడీపీకి చెందిన సుబ్బయ్య ఇసుక డంపు నిర్వహిస్తున్నాడు. బుధవారం జరిగిన ఉప ఎన్నిక పోలింగ్‌లో రాములమ్మ కుటుంబంతోపాటు ఇరుగుపొరుగు కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారు. దీన్నిజీర్ణించుకోలేని సుబ్బయ్య కుటుంబ సభ్యులు టీడీపీకి ఎందుకు ఓటు వేయలేదంటూ గురువారం రాములమ్మ కుటుంబంతో వాదనకు దిగారు. తాము వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులమని, తమకు ఇష్టమైన వారికి ఓటు వేసుకునే హక్కు ఉందంటూ రాములమ్మ కుటుంబం సమాధానం ఇచ్చింది. దీంతో సుబ్బయ్య కుటుంబ సభ్యులు, అనుచరులు ఒక్కసారిగా వారిపై దాడికి దిగారు. కిరాణా షాపులోని వస్తువులను బయటకు విసిరేశారు. అడ్డొచ్చిన రాములమ్మ చీర లాగుతూ వీరంగం సృష్టించారు. ఇదేమని ప్రశ్నించిన పక్కింటి మహిళ కవితను తోసేశారు. రాములమ్మతోపాటు ఆమె కుమారుడు శ్రీనివాసరెడ్డిపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



గాయాలను చూపుతున్న శ్రీనివాసరెడ్డి

సీఎం అండతోనే శిల్పాపై హత్యాయత్నం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజం
- నంద్యాల నడిబొడ్డున శిల్పా చక్రపాణిరెడ్డిపై దాడి దారుణం
- ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే దాడి..



సాక్షి, హైదరాబాద్: కర్నూలు జిల్లా నంద్యాలలో ముఖ్యమంత్రి ప్రోద్బలంతోనే శిల్పా చక్రపాణి రెడ్డిపై దాడి జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేయించిన దాడేనని.. చంద్రబాబుది రక్తచరిత్ర అని ధ్వజమెత్తింది. ఈ ఘటనకు పాల్పడిన రౌడీ షీటర్ అభిరుచి మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీకి చెందిన శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఫ్యాక్షనిజానికి దూరంగా ఉంటూ, సౌమ్యులుగా పేరుపడ్డ శిల్పా కుటుంబంపై ప్రభుత్వం ఈ స్థాయిలో కక్ష పెంచుకోవడం దారుణమని వ్యాఖ్యానించారు. పోలీసుల సమక్షంలోనే, ప్రజలంతా చూస్తుండగానే శిల్పా మోహన్‌రెడ్డి, చక్రపాణిరెడ్డిలను నరికేయాలని రౌడీలు కేకలు వేయడం, కత్తులు, తుపాకులతో 15 నిమిషాలు వీరంగం సృష్టించడం చంద్రబాబు ఫ్యాక్షన్ రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. అసలు శిల్పా కుటుంబం చేసిన తప్పేంటని ఆయన ప్రశ్నించారు. శిల్పా చక్రపాణిరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరాక, విలువలకు కట్టుబడి ఆరేళ్ల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడమే తప్పా అని నిలదీశారు. ఎన్నికల ఫలితం తమకు ప్రతికూలంగా ఉంటుందనే భయంతోనే తమ పార్టీ నేతలపైకి రౌడీషీటర్లను ఉసిగొల్పుతున్నారని, పథకం ప్రకారం అంతమొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఏపీ మంత్రులు, ఎమ్మెల్యేలు వంద మంది వివిపీలున్న సూరజ్‌గ్రాండ్ హోటల్ పక్కనే చక్రపాణిరెడ్డిపైన కాల్పులు జరగడం మామూలు విషయం కాదన్నారు. అక్కడే ఉన్న పోలీసులు ఘటనకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకోకపోవడాన్ని అనుమానించాల్సి వస్తోందన్నారు.

చంద్రబాబుది రక్త చరిత్ర

చంద్రబాబు పాలన మొత్తం రక్త చరిత్రేనని శ్రీకాంత్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆయన ప్రజా బలంతో పార్టీని స్థాపించలేదని, ఎన్టీఆర్ గెలిపించిన పార్టీని లాక్కున్నారని విమర్శించారు. ఫ్యాక్షనిస్టు చరిత్ర ఉన్న వారికి టికెట్టు నిరాకరించాలని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిపాదిస్తే దానికి ఒప్పుకోని చరిత్ర చంద్రబాబుదేనన్నారు. ఫ్యాక్షనిజాన్ని పెంచి పోషిస్తున్న చంద్రబాబు.. దానిని వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌పైకి నెట్టడం అలవాటైందన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఎంత మంది రౌడీషీటర్లకు, తెలుగుదేశం పార్టీ వాళ్లకు గన్‌మెన్‌లు ఇచ్చారో జాబితా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటున్న తమకు గన్‌మెన్‌లను తగ్గించారని మొత్తుకున్నా పట్టించుకోని ప్రభుత్వం, టీడీపీ ప్రలోభాలకు లొంగిపోయిన రౌడీలకు గన్‌మెన్‌లను ఇచ్చి ప్రోత్సహించడం చంద్రబాబు అనైతికతకు అద్దం పడుతోందన్నారు. చెరుకులపాడు నారాయణరెడ్డిని ఇటీవల దారుణంగా చంపిన వాళ్లను ఇంత వరకూ అరెస్టు చేయలేదని, చంద్రబాబు కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ కోసం ప్రత్యేక జీవోనా?

రౌడీ షీటర్లకు గన్‌మెన్‌లను ఏ విధంగా ఇచ్చారని, శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీ ఇష్టమొచ్చినట్టు తుపాకులు పెట్టుకోమని, అవసరం వచ్చినప్పుడు కాల్చి చంపమని ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నట్టుగా ఉందని మండిపడ్డారు. 'నిబంధనలు అందరికీ వర్తించవా? టీడీపీ ఏం చేసినా చెల్లుతుందనే జీవో ఏమైనా ఇచ్చారా?' అని నిలదీశారు. పోలింగ్ సమయంలో వీడియో క్లిప్పులు చూస్తే ఎన్నో దౌర్జన్యాలు బయట పడతాయన్నారు. పోలీసు వ్యవస్థపై తమకు అపార గౌరవం ఉందని, సమాజంలో అందరికన్నా ఎక్కువ కష్టపడతారనే విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. అయితే, ఇలాంటి వ్యవస్థ ప్రభుత్వం కోసం తొత్తులుగా మారొద్దని హితవు పలికారు. శిల్పా చక్రపాణి రెడ్డిపై దాడి విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రౌడీ షీటర్లకు ఇచ్చిన గన్‌లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చక్రపాణిపై దాడి నీచమైన చర్య

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల: నంద్యాలలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నేత శిల్పా చక్రపాణిరెడ్డిపై టీడీపీ నాయకులు హత్యాయత్నానికి పాల్పడటం నీచమైన చర్యగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అభివర్ణించారు. గురువారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని తన స్వగృహంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. నడిరోడ్డుపై టీడీపీ నేత అభిరుచి మధు చక్రపాణిరెడ్డిపై దాడికి పాల్పడి హల్‌చల్ చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం శోచనీయమన్నారు. నంద్యాలలో ఓటమి భయంతోనే టీడీపీ వారు దాడులకు తెగబడు తున్నారన్నారు. ముందస్తు ప్రణాళికతోనే దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, ఆయన మంత్రులు ఫ్యాక్షనిజాన్ని, రౌడీయిజా న్ని ప్రోత్సహిస్తున్నారని.. అందులో భాగంగానే పత్తికొండ వైఎస్సార్‌సీపీ నేత నారాయణరెడ్డిని ఇటీవల హతమార్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రౌడీషీటర్ మధు గన్‌ను పోలీసులు ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు.

బాబును ఓడించడం ఒక్కటే ఆఖరి అస్త్రం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మాన ప్రసాదరావు
- ఒక వర్గానికి అనుకూలంగా పోలీసు వ్యవస్థను మార్చేశారు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అన్ని వ్యవస్థల మాదిరిగా చివరకు పోలీసు వ్యవస్థనూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక వర్గానికి అనుకూలంగా మార్చేశారని, దీని ఫలితంగానే నంద్యాలలో పట్టపగలు శిల్పా చక్రపాణిరెడ్డిపై కాల్పులకు టీడీపీకి చెందిన నాయకుడొకరు తెగబడ్డారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మాన ప్రసాదరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసి మావోయిస్టుల హిట్‌లిస్ట్‌లో ఉన్న తనలాంటివారికి పోలీసు భద్రతను తొలగించిన చంద్రబాబు ప్రభుత్వం టీడీపీలో రౌడీషీటర్లకు మాత్రం ఇచ్చిందని దుయ్యబట్టారు. రాజకీయంగా ఓడిపోతున్నామనే అక్కసుతో విపక్ష నాయకులపై కాల్పులకు సైతం వెనకాడలేదంటే శాంతిభద్రతలను ఏ స్థాయికి దిగజార్చేశారో పౌరులు అర్థం చేసుకోవాలన్నారు. వ్యవస్థలను ఇంతలా భ్రష్టుపట్టించిన ప్రభుత్వాన్ని ఇప్పటివరకూ చూడలేదని చెప్పారు. మూడేళ్లుగా మాటలతో చెప్పినా వినని చంద్రబాబుకు పౌరులు ఓటు ద్వారా బుద్ధి చెప్పడం ఒక్కటే ఆఖరి అస్త్రమని తెలిపారు. ఏ ఎన్నికలు వచ్చినా టీడీపీ అభ్యర్థులను ఓడించడం ద్వారానే రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి ఉన్న ఏకైక మార్గమని చెప్పారు. లేదంటే టీడీపీ ప్రభుత్వ వైఖరి వల్ల నేరాలు మరింత అధికమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం ఉన్నంతకాలం అరాచకాలకు అంతం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల నియమావళిని సైతం ఉల్లంఘించి మరీ నంద్యాలలో ఉప ఎన్నికలలో రూ.వంద కోట్లు వెదజల్లారని విమర్శించారు. చివరకు ముఖ్యమంత్రి, మంత్రులు అంతా నంద్యాలలోనే మకాం వేసి రాష్ట్రంలో పరిపాలనను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. చివరకు సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలన్నా లెక్కచేయని ముఖ్యమంత్రికి బుద్ధి చెప్పాలంటే ప్రజాస్వామ్యంలో ఓడించడం ఒక్కటే పౌరుల ముందున్న మార్గమని ధర్మాన చెప్పారు.

సీమలో ఫ్యాక్షనిజం పునరావృతమయ్యేలా ఉంది: రఘువీరా

సాక్షి, అమరావతి: అంతరించిపోతున్న రాయలసీమ ఫ్యాక్షనిజం నాయకుల తీరుతో తిరిగి పునరావృతం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల నేపథ్యంలో నంద్యాలలో కాల్పులు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనతో ప్రశాంతంగా ఉన్న ప్రజలు భయాందోళనకు గురయ్యారన్నారు. 'నరికేయండి' అంటూ అరుస్తూ కొడవళ్లు పట్టుకొని టీడీపీ నేతలు రెచ్చిపోయి మాట్లాడుతున్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ఆయన తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబును ఏ1 గా చేర్చాలి


దళిత, ముస్లిం, క్రిస్టియన్ కూటమి ఛైర్మన్ షేక్ జలీల్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నంద్యాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శిల్పా చక్రపాణిరెడ్డిపై కాల్పుల ఘటనలో సీఎం చంద్రబాబును ఏ1 ముద్దాయిగా చేర్చాలని దళిత, ముస్లిం, క్రిస్టియన్ కూటమి చైర్మన్ షేక్ జలీల్ డిమాండ్ చేశారు. స్థానిక ముస్లిం ఐక్యవేదిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘటన వెనుక చంద్రబాబు హస్తం ఉందని ఆరోపించారు. చంద్రబాబు అండతోనే టీడీపీ నాయకులు కత్తులు, తుపాకులతో నడిరోడ్డుపై వీరంగం సృష్టించారన్నారు. పట్టపగలు ఇంతటి దారుణానికి పాల్పడిన టీడీపీ నాయకులను, వారికి మద్దతుగా ఉన్న చంద్రబాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

చదవలేకపోతున్నానని.. మెడికో ఆత్మహత్య

ఏపీలోని ఒంగోలు రిమ్స్ విద్యార్థి

మరిపెడ (డోర్నకల్): 'నన్ను క్షమించండి.. నేను చదవలేకపోతున్నా.. మీరు కోరుకున్నట్లు నేను డాక్టర్‌ను కాలేనేమో'అని సూసైడ్ నోట్ రాసి వైద్య విద్యార్థి గుగులోత్ మనోకృష్ణ (20) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రానికి చెందిన గుగులోతు నామ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, భార్య శోభ ఎంపీటీసీ సభ్యురాలు. వీరికి ఇద్దరు కుమారులుండగా, ఇద్దరినీ ఎంబీబీఎస్ చదివిస్తున్నారు. పెద్ద కుమారుడు మనోజ్ నల్లగొండ జిల్లాలోని నార్కట్‌పల్లి వద్ద ఉన్న కామినేని ఆస్పత్రిలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. చిన్న కుమారుడైన మనోకృష్ణ ఒంగోలు రిమ్స్ ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రథమ సంవత్సరంలో కళాశాలలోనే 75 శాతం మార్కులతో 9వ ర్యాంక్ సాధించాడు. కాగా, మనోకృష్ణ శనివారం ఇంటికి వచ్చాడు. మనోకృష్ణ గురువారం ఉదయం సినిమా చూసి ఇంటికివచ్చాడు. ఆ సమయంలో తండ్రి పాఠశాలకు వెళ్లాడు. తల్లి శోభ మండల సభకు హాజరయ్యేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మనోకృష్ణ బెడ్రూంలోని ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకున్నాడు.



శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు

భారత ఉపరాష్ట్రపతి

శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు

తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి
విచ్చేస్తున్న సందర్భంగా

హార్దిక స్వాగతం

పౌర సన్మానం

మరియు
ప్రధానమంత్రి పట్టణ గృహ నిర్మాణ పథకం క్రింద 2లక్షల 25వేల గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

26 ఆగస్టు, 2017, ఉదయం 11.00 గం॥లకు, స్థలం: సచివాలయం, వెలగపూడి, అమరావతి.

గోప్యత ప్రాథమిక హక్కే

భారతీయుల మౌలిక జీవన విధానంపై విస్తృత ప్రభావం చూపగల చరిత్రాత్మక తీర్పును గురువారం సుప్రీంకోర్టు వెలువరించింది. వ్యక్తిగత గోప్యత(ప్రైవసీ) ప్రాథమిక హక్కేనని తేల్చి చెప్పింది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత గోప్యత కూడా విడదీయలేని భాగమేనని.. రాజ్యాంగంలోని 3వ భాగం, ఆర్టికల్ 21ల్లో పేర్కొన్న జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛల్లో గోప్యత కూడా అంతర్భాగమని 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. అయితే, మిగతా ప్రాథమిక హక్కుల్లా.. ఇది నిరపేక్ష హక్కు కాదని, దీనికి పరిమితులు, నియంత్రణలుంటాయని వివరణ ఇచ్చింది. భారతీయుల ఆహార అలవాట్లు, లైంగిక విధానాలు, సామాజిక నిబంధనలు, అమల్లో ఉన్న పలు చట్టాలు, తదితర కీలక అంశాలపై ప్రభావం చూపనున్న ఈ తీర్పును పార్టీలకతీతంగా స్వాగతించారు.

పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛలో గోప్యత అంతర్భాగం

ఆర్టికల్ 21, రాజ్యాంగంలోని మూడో భాగం ఇదే చెబుతున్నాయి

9 మంది సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక, ఏకగ్రీవ తీర్పు

దీనిపై గతంలో వెలువరించిన తీర్పుల రద్దు

సంస్కృతిలో బహుళత్వాన్ని గోప్యత ప్రతిఫలిస్తుందని వ్యాఖ్య

ఆధార్‌పై ప్రత్యేక భద్రతావ్యవస్థను ఏర్పాటుచేయాలని కేంద్రానికి సూచన

సుప్రీం తీర్పును స్వాగతించిన కేంద్రం, న్యాయనిపుణులు



న్యూఢిల్లీ: భారతీయుల వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచే విషయంపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెల్లడించింది. రాజ్యాంగ నియమాల ప్రకారం గోప్యత ప్రాథమిక హక్కేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఏకగ్రీవంగా స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు పేర్కొన్న గోప్యత ప్రాథమిక హక్కు కాదనే నిర్ణయాన్ని కొట్టివేసింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, మూడో భాగం ప్రకారం గోప్యత అనేది.. ప్రజల జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛల్లో అంతర్గతంగా సమ్మిళితమై ఉంటుంది' అని పేర్కొంది. గోప్యత.. వ్యక్తిగత గౌరవానికి రాజ్యాంగ మూలమని స్పష్టం చేసింది. వివిధ సంక్షేమ పథకాల లాభాలను అందుకునేందుకు ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 547 పేజీల తీర్పును వెలువరించింది. అయితే.. తాము గోప్యత ప్రాథమిక హక్కా? కాదా? అనే అంశానికే పరిమితమయ్యామని.. ఆధార్ వల్ల గోప్యతకు భంగం వాటిల్లుతుందా లేదా అనే అంశాన్ని ఐదుగురు సభ్యుల ధర్మాసనమే విచారిస్తుందని స్పష్టం చేసింది. ఆధార్ వివరాలను కాపాడేందుకు ప్రత్యేక భద్రతావ్యవస్థను ఏర్పాటుచేయాలని కేంద్రానికి సూచించింది. కాగా సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తోపాటుగా సోలీ సొరాబ్జీ వంటి న్యాయ నిపుణుల స్వాగతించారు. 'ఏ ప్రాథమిక హక్కు కూడా సంపూర్ణం కాదు. ప్రతి హక్కూ పరిమితులు, నియంత్రణలతో కూడుకున్నదే' అని సొరాబ్జీ పేర్కొన్నారు.

పాత తీర్పులు రద్దు: సీజేఐ ఖేహర్

తీర్పు అమలు భాగాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ చదివి వినిపించారు. గతంలో ఎంపీ శర్మ (1952), ఖరక్ సింగ్ (1960) కేసుల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను రద్దుచేసినట్లు వెల్లడించారు. వ్యక్తిగత గౌరవం, ప్రజల మధ్య సమానత్వం, స్వేచ్ఛగా జీవించాలని కోరుకోవటం భారత రాజ్యాంగ మూల స్తంభాల వంటివి. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలను రాజ్యాంగం సృష్టించలేదు. ప్రతి వ్యక్తిలో అంతర్గతంగా, అవిభాజ్యంగా ఉండే అంశాలను రాజ్యాంగం గుర్తించింది. గోప్యత రాజ్యాంగం పరిరక్షించే హక్కు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించటం, వ్యక్తిగత స్వేచ్ఛనుంచే గోప్యత పుట్టుకొచ్చింది. రాజ్యాంగంలోని మూడవ భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులైన స్వేచ్ఛ, గౌరవంలోనూ గోప్యత అంతర్భాగమే' అని తీర్పులో పేర్కొన్నారు. జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే, జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ ఆర్ ఎఫ్ నారీమన్, జస్టిస్ ఏఎం సప్రే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌లు ఈ తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనంలో ఉన్నారు. ఈ తొమ్మిది మంది గతంలో సుప్రీంకోర్టు రెండు వివిధ సందర్భాల్లో ఇచ్చిన 'గోప్యతను కాపాడటం రాజ్యాంగ బాధ్యత కాద'నే నిర్ణయాన్ని ఏకగ్రీవంగా కొట్టేశారు.

కోర్టు హాల్లో ఉత్కంఠ

కేసు విచారణ సందర్భంగా మూడు వారాల్లో ఆరు రోజుల పాటు సుప్రీంకోర్టులో గోప్యతకు అనుకూలంగా, వ్యతిరేకంగా వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే. గురువారం గోప్యత ప్రాథమిక హక్కా? కాదా? అనే అంశంపై ధర్మాసనం తుది తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో కోర్టు హాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అరవింద్ దతార్, కపిల్ సిబల్, గోపాల్ సుబ్రమణ్యం, ఆనంద్ గ్రోవర్, సీఏ సుందరం, రాకేశ్ ద్వివేదీ వంటి సీనియర్ న్యాయవాదులు తీర్పు కోసం ఎదురుచూశారు. పిటిషనర్లలో ఒకరైన కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి కేఎస్ పుట్టస్వామి, మెగసెసె అవార్డు గ్రహీత శాంతా సిన్హా తదితరులు ఆధార్ ప్రజల గోప్యత హక్కును హరిస్తుందని వాదించిన సంగతి తెలిసిందే.

ముందు గోప్యత.. తర్వాత ఆధార్!

జూలై 7న ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందు పిటిషనర్లు ఆధార్‌పై తమ వాదనలు వినిపించారు. అయితే ఆధార్‌పై సమస్యలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తే నిర్ణయం తీసుకుని రాజ్యాంగ ధర్మాసనానికి నివేదిస్తారని నాడు కోర్టు పేర్కొంది. అనంతరం దీనిపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని సీజేఐ ఖేహర్ ఏర్పాటుచేశారు. అయితే, వాదనల సందర్భంగా అసలు గోప్యత రాజ్యాంగ ప్రకారం ప్రాథమిక హక్కేనా కాదా? అనే అంశాన్ని తేల్చేందుకు తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటుచేయాలని బెంచ్ సూచించింది. అయితే.. ఖరక్ సింగ్ (1960), ఎంపీ శర్మ (1950) కేసుల్లో 'గోప్యత'పై సుప్రీంకోర్టు నిర్ణయాలను పున:పరిశీలించాలన్న నిర్ణయంతో సీజేఐ జస్టిస్ ఖేహర్.. 9 మంది సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటుచేశారు. దీనిపై విచారణ జరిపిన ఈ ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేస్తూ.. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని పబ్లిక్ డొమైన్స్‌లో ఉంచటం ద్వారా ఆ సమాచారం తప్పుగా వినియోగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. సాంకేతిక యుగంలో గోప్యతను కాపాడటం అంత సులువేం కాదని అభిప్రాయపడింది. గోప్యత సంపూర్ణమైన హక్కు కాదని.. దీనిపై కొన్ని న్యాయపరమైన నియంత్రణలు విధించే అధికారం ప్రభుత్వానికి ఉందని కేంద్రం తన వాదనలను వినిపించింది. గోప్యత ఎంతమాత్రమూ ప్రాథమిక హక్కు కాదని అటార్నీ జనరల్ పేర్కొన్నారు. అణగారిన వర్గాలు, పేద ప్రజలకుండే జీవించే హక్కు, కూడు, గూడు హక్కుల కన్నా గోప్యత హక్కు గొప్పదేం కాదని కేంద్రం పేర్కొంది.

గోప్యత అంటే!



వ్యక్తిగత అన్యోన్యత, కుటుంబ జీవితం, వివాహం, సంతానం, ఇల్లు, లింగ నేపథ్యం వంటి అంశాలన్నీ గోప్యత కిందకే వస్తాయని స్పష్టం చేసింది. 'తన జీవితం ఎలా ఉండాలో కోరుకోవటం గోప్యత అవుతుంది. భిన్నత్వాన్ని కాపాడుతూ.. మన సంస్కృతిలోని బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని గోప్యత సూచిస్తుంది. గోప్యతపై న్యాయపరమైన అంచనాలు సన్నిహిత నుంచి వ్యక్తిగతంలో, వ్యక్తిగతం నుంచి బహిరంగ అంశాల్లో వేర్వేరుగా ఉంటాయి. అయితే బహిరంగ వేదికపై వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోకుండా చేయటం చాలా ముఖ్యం' అని తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది.

విచారణ సాగిందిలా..

జూలై 7: ఆధార్‌ను పలు పథకాలకు అనుసంధానించడంపై విస్తృత ధర్మాసనం విచారణ జరుపుతుందని సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. ఈ విషయమై భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది.

జూలై 12: ఆధార్ గోప్యతపై విచారణకు ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ బెంచ్‌ను ఏర్పాటు చేస్తూ సీజేఐ జస్టిస్ ఖేహర్ నిర్ణయం తీసుకున్నారు.

జూలై 18: ఈ ఐదుగురు జడ్జీల రాజ్యాంగ బెంచ్ గోప్యత ప్రాథమిక హక్కా? కాదా? అన్న విషయాన్ని నిర్ణయించేందుకు 9 మందితో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. సీజేఐ జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ ఫాలీ నారిమన్, జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌ల బెంచ్ ఏర్పాటైంది.

జూలై 19: వ్యక్తిగత గోప్యత అన్నది నిరపేక్ష హక్కు కాదని..దాన్ని నియంత్రించవచ్చని సుప్రీం అభిప్రాయపడింది. గోప్యత హక్కు ప్రాథమిక హక్కు కాదని కేంద్రం వాదించింది.

జూలై 26: గోప్యత హక్కుకు అనుకూలంగా కర్ణాటక, పశ్చిమబెంగాల్, పంజాబ్, పుదుచ్చేరి రాష్ట్రాలు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాయి.

జూలై 26: వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా పరిగణించవచ్చని, అయితే అందుకు సంబంధించిన అన్ని పార్శ్వాలను ప్రాథమిక హక్కు పరిధిలో చేర్చలేమని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది.

జూలై 27: గోప్యత అన్నది స్వతంత్ర హక్కు కాదని, అది కేవలం భావన మాత్రమేనని మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకు విన్నవించింది.

ఆగస్టు 1: ప్రజా బాహుళ్యంలో ఉన్న పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని పరిరక్షించడానికి మరింత విస్తృతమైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరం ఉందని సుప్రీం అభిప్రాయపడింది.

ఆగస్టు 2: ప్రస్తుత సాంకేతిక యుగంలో గోప్యత అన్నది ఓడిపోతున్న యుద్ధంగా మారిందన్న అత్యున్నత ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసింది.

ఆగస్టు 24: రాజ్యాంగం ప్రకారం గోప్యత అన్నది ప్రాథమిక హక్కేనని సుప్రీం చారిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది.



పటిష్టమైన భద్రతా వ్యవస్థ కావాలి

రాజ్యాంగంలో సాధారణ, ప్రాథమిక హక్కులంటూ వేర్వేరుగా ఉండవన్న ప్రభుత్వం వాదనలను కోర్టు తోసిపుచ్చింది. అయితే..ప్రభుత్వానికి మరో అవకాశాన్ని కల్పిస్తూ.. 'ఆధునిక యుగంలో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని కాపాడేందుకు పటిష్టమైన వ్యవస్థను నిర్మించండి. ఇది ప్రజల వ్యక్తిగత ప్రయోజనాలను, ప్రభుత్వం న్యాయపరమైన అవసరాలను సమతుల్యం చేసేలా ఉండాలి. జాతీయ భద్రత, నేరాలను తగ్గించటం, సృజనాత్మకతను ప్రోత్సహించటం, సామాజిక సంక్షేమ పథకాల ఫలితాలు దుర్వినియోగం కాకుండా అడ్డుకోవటమే ప్రభుత్వ అవసరం కావాలి' అని కోర్టు పేర్కొంది.

న్యాయమూర్తుల అభిప్రాయాలు

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్, జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ ఎస్ఏ నజీర్‌ల తరపున కూడా జస్టిస్ చంద్రచూడ్ ఈ తీర్పు రాశారు. 'రాజ్యాంగంలోని అధికరణం 21 ప్రకారం జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛల నుంచి గోప్యత హక్కు ఉద్భవిస్తుంది. ఓ వ్యక్తి స్వతంత్రతను గోప్యత కాపాడుతుంది. ఆ వ్యక్తి జీవితంలోని ముఖ్య ఘట్టాలను నియంత్రించుకునే సామర్థ్యాన్ని ఇస్తుంది. అయితే ఇతర ప్రాథమిక హక్కుల్లాగా ఇది సంపూర్ణమైన హక్కు కాదు. సమాచార సంరక్షణకు ప్రభుత్వం పటిష్టమైన యంత్రాగాన్ని ఏర్పాటు చేయాలి. రాజ్యాంగం.. అది అమల్లోకి వచ్చిన రోజుల్లో ఎలా ఉందో అలానే మిగిలిపోకూడదు. సవాళ్లను ఎదుర్కొనేందుకు కాలానికి, అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగం తప్పక పరిణామం చెందాలి. 70 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పటికి సాంకేతికతపరంగా ఎంతో మార్పు వచ్చింది. రాజ్యాంగం మూల విలువల ఆధారంగానే భవిష్యత్తు తరాలకు సరిపోయేలా మారుతుండాలి. అలాగే అసాధారణ లైంగిక ధోరణి కారణంగా ఎల్జీబీటీ(లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్‌జెండర్) వర్గానికి గోప్యత హక్కును నిరాకరించరాదు. వ్యక్తుల లైంగిక అభిలాషల ఆధారంగా వివక్ష చూపిస్తే వారి వ్యక్తిత్వం తీవ్రంగా దెబ్బతింటుంది. ఎల్జీబీటీలు తీవ్ర అవమానాన్ని ఎదుర్కొంటున్నారు. రాజ్యాంగంలోని 14, 15, 21 అధికరణలు గోప్యతతో పాటు వ్యక్తిగత లైంగిక అంశాలకు కూడా రక్షణ ఇస్తున్నాయి. ప్రస్తుతం స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించే సెక్షన్ 377 విషయమై సుప్రీం కోర్టులోని ఓ బెంచ్ విచారణ జరుపుతున్నందున, దాని రాజ్యాంగ చెల్లుబాటుపై సదరు ధర్మాసనమే నిర్ణయం తీసుకుంటుంది.



జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ నజీర్

'నేటి డిజిటల్ యుగంలో పిల్లల గోప్యతను పరిరక్షించడానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. పిల్లలు సాంకేతికత, సామాజిక మాధ్యమాలకు బాగా అలవాటుపడుతున్నారు. ఏ అంటే యాపిల్, బీ అంటే బ్లూటూత్, సీ అంటే చాట్ అని నేర్చుకుంటున్నారు. తెలిసీ తెలియక చేసే తప్పులకు వారు బలికాకుండా చూడాలి. గోప్యత హక్కును ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యక్తులు, సంస్థల నుంచి కాపాడుకోవాలి. సాంకేతికత విస్తృతంగా అభివృద్ధి చెందడంతో ప్రభుత్వం మన వ్యక్తిగత జీవితంలోకి చొరబడేందుకు అవకాశాలు పెరిగాయి. ఓ వ్యక్తి తన ఇంట్లోకి రావడానికి ఒకరిని అనుమతించడం అంటే ఎవరైనా లోనికి రావొచ్చని అర్థం కాదు. గోప్యతా హక్కు ప్రాథమిక హక్కే. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, ఇతరులు వ్యక్తుల అంతరంగిక వ్యవహారాల్లోకి చొరబడకుండా అది కాపాడుతుంది.'

– జస్టిస్ కిషన్ కౌల్

'పురాణాల్లోనూ వ్యక్తిగత గోప్యత ప్రస్తావన ఉంది. స్త్రీని పరపురుషుడు చూడకూడదని రామాయణంలో ఉంది. అలాగే ఇస్లాం ప్రకారం ఇతరుల ఇళ్లలోకి తొంగిచూడటం నిషిద్ధం. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా జీవించాలని బైబిల్ చెబుతుంది. ప్రాథమిక హక్కులను పొందాలంటే ముందుగా గోప్యత హక్కు ఉండాల్సిందే. మానవుల స్వేచ్ఛ నుంచి వ్యక్తిగత గోప్యత హక్కును విడదీయలేం'

– జస్టిస్ ఎస్ఏ బాబ్డే

'ఓ రోగి తనకు జీవితాంతం కొనసాగాల్సిన వైద్య చికిత్సను వద్దని చెప్పి జీవితాన్ని ముగించడం అనేది గోప్యత హక్కు కిందకు వస్తుంది. బిడ్డను కనాలా, గర్భస్రావం చేయించుకోవాలా అనేది సదరు గర్భిణి గోప్యత హక్కు పరిధిలో ఉంటుంది. ప్రజలు ఏం తినాలి, ఎలాంటి వస్త్రాలు ధరించాలి, ఎవరితో కలసి ఉండాలి అనే విషయాలను ప్రభుత్వం నిర్దేశించడాన్ని ఎవరూ ఒప్పుకోరు. గోప్యత కావాలనుకుంటారు'

– జస్టిస్ జాస్తి చలమేశ్వర్

'నా అభిప్రాయంలో ఏ వ్యక్తికైనా గోప్యత అనేది పుట్టుకతోనే సహజంగా లభించే హక్కే. ఆ వ్యక్తి చివరి శ్వాస వరకు గోప్యత హక్కు ఉంటుంది. అది వాస్తవానికి వ్యక్తి నుంచి వేరు చేయలేని, మార్చలేని హక్కు. మనిషితోపాటే పుట్టి, మనిషితోపాటే పోతుంది. అయితే ఈ హక్కుపై ప్రభుత్వాలు సామాజిక, నైతిక కోణంలో ప్రజాహితార్థం కొన్ని న్యాయమైన పరిమితులు విధించొచ్చు'

– జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే

'దేశంలో ప్రభుత్వాలు వస్తూ, పోతున్నప్పటికీ ప్రాథమిక హక్కులు శాశ్వతంగా ఉంటాయి. పాలక పార్టీలు పార్లమెంటులో తమకున్న మెజారిటీతో చట్టాలు చేయగలవు. అవసరం లేదనుకుంటే చట్టాలను రద్దు చేయగలవు. కానీ తాము ఎన్నుకున్న ప్రభుత్వాలతో సంబంధం లేకుండా రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కుల్ని పౌరులు అనుభవించవచ్చు. ఎందుకంటే ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగంగా ఉన్న గోప్యత హక్కు శాశ్వతమైనది. ఒకవేళ ప్రభుత్వాలు చేసే చట్టాలు ప్రాథమిక హక్కులకు భంగకరంగా మారితే సుప్రీం కోర్టు వాటిని చెల్లనివిగా ప్రకటిస్తుంది'

– జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్

మా వాదననే సుప్రీం సమర్థించింది


గోప్యత హక్కు కొన్ని పరిమితులకు లోబడాల్సిందే.. తీర్పును స్వాగతిస్తున్నాం: కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కన్న సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే అదే సమయంలో ఆ హక్కు కొన్ని పరిమితులకు లోబడి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ అంశంపై 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయకముందే.. గోప్యత ప్రాథమిక హక్కన్న విషయాన్ని మోదీ ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపిందని కేంద్ర న్యాయ, ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు.

'సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. ప్రభుత్వం కూడా ప్రతి సందర్భంలో అదే విషయాన్ని స్పష్టం చేసింది. ఆధార్ చట్టం సమయంలో.. గోప్యత ప్రాథమిక హక్కు.. అయితే అది కొన్ని పరిమితులు లోబడి ఉంటుందని చెప్పాం. గతేడాది మార్చిలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. భావ ప్రకటనా స్వేచ్ఛ కూడా ప్రాథమిక హక్కే. అదే సమయంలో రాష్ట్రపతి భవన్ ముందు నగ్నంగా నిరసన తెలిపేందుకు ఎవరికీ అనుమతి లేదు. వాక్ స్వాతంత్ర్యం హక్కు పరువునష్టం చట్టం పరిధుల్ని అతిక్రమించకూడదు' అని ప్రసాద్ పేర్కొన్నారు. ఆధార్, డేటా అనుసంధానంపై విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ.. 'కొద్దిమొత్తంలో మాత్రమే ఆధార్ సమాచారం బహిరంగంగా అందుబాటులో ఉంది. బయోమెట్రిక్స్‌తో పాటు నిక్షిప్త సమాచారం పూర్తిగా భద్రం' అని తెలిపారు. వ్యక్తిగత స్వేచ్ఛ ను కాపాడడంలో కాంగ్రెస్ గత చరిత్ర ఎలాంటిదో ఎమర్జెన్సీ సమయంలో మనం చూశామని రవిశంకర్ విమర్శించారు. 'సాంకేతిక దిగ్గజ కంపెనీలు భారత చట్టాలను గౌరవించడం నేర్చుకుంటాయని ఆశిస్తున్నా. గూగుల్, ఫేస్‌బుక్ లాంటి సంస్థలు మన సాధికారతకు దోహదపడుతున్నాయి. టెక్ కంపెలన్నీ భారత్‌లో అడుగుపెట్టడాన్ని స్వాగతిస్తున్నాం. సాధారణ పౌరులు కూడా సామాజిక మాధ్యమాల్లో పాలు పంచుకోవడం సంతోషకరం. సమాచార పరిరక్షణ వ్యవస్థకు తగిన సిఫార్సులు చేయడానికి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఆధార్ వలే సేకరించిన సమాచారాన్ని భద్రతకు లోబడి వినియోగించడంలో భారత్ అంతర్జాతీయంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పాలి' అని రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు.

యూపీఏ వల్లే ఈ గందరగోళం: జైట్లీ



సుప్రీం తీర్పు సానుకూల పరిణామమని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. 'గోప్యత ప్రాథమిక హక్కేనని, అయితే అది సంపూర్ణ హక్కు కాదన్న కేంద్రం వాదనను సుప్రీం కోర్టు సమర్థించింది. యూపీఏ ప్రభుత్వం ఎలాంటి చట్టం లేకుండా ఆధార్‌ను తీసుకురావడం వల్లే గోప్యత అంశం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. సమాచార భద్రత, దాన్ని ఎలా వాడాలన్న విషయంలో యూపీఏ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోలేదు. అందుకే సుప్రీంలో సవాలు చేశారు' అని జైట్లీ విమర్శించారు.

ఏడాది చివరికి 'కమిటీ' సిఫార్సులు

న్యూఢిల్లీ: డిజిటల్ యుగంలో సమాచార పరిరక్షణ కోసం అవసరమైన చర్యలను సూచించేందుకు ఏర్పాటైన కమిటీ ఈ ఏడాది చివరికల్లా తన సిఫార్సులను సమర్పించే అవకాశం ఉంది. వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరచడం, డేటా ఉల్లంఘనలను నిలువరించడం కోసం ఎలాంటి యంత్రాంగం ఏర్పాటు చేయాలనే దానిపై సలహాల కోసం ప్రభుత్వం గతంలో 10 మంది సభ్యులతో ఓ కమిటీని నియమించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బీఎన్ శ్రీకృష్ణ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తుండగా, టెలికాం విభాగ కార్యదర్శి అరుణ సుందరరాజన్, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సీఈవో అజయ్ భూషణ్ పాండే, జాతీయ సైబర్ భద్రత సమన్వయ కర్త గుల్షన్ రాయ్ తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది చివరికి కమిటీ సిఫార్సులు సమర్పించొచ్చని న్యాయ, సమాచార సాంకేతిక శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ గురువారం చెప్పారు. డేటా పరిరక్షణకు కొత్త చట్టం తీసుకురావాలా? లేక ప్రస్తుత ఐటీ చట్టంలో కొత్త నిబంధనలు చేర్చాలా? అనే దానిపై కమిటీ సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఓ అధికారి చెప్పారు.

ఆ ముగ్గురుని గుర్తుచేసుకుంటూ..!

న్యూఢిల్లీ: పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే విషయంలో దార్శనికతను, గోప్యతను ప్రాథమిక హక్కుగా పేర్కొనే అంశంలో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేసిన ముగ్గురు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తుల పాత్రను గురువారంనాటి సుప్రీం తీర్పు గుర్తుచేసుకుంది. గతంలో గోప్యతపై తీర్పు సందర్భంగా జస్టిస్ సయ్యద్ ఫజల్ అలీ (1950–51), జస్టిస్ సుబ్బారావు(1958–67), జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా (1971–77)లు గోప్యత ప్రాథమిక హక్కేనంటూ పేర్కొనటం వారి దార్శనికతకు నిదర్శనమని జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్ తన తీర్పు కాపీలో పేర్కొన్నారు.



సుప్రీం తీర్పుపై ఎవరేమన్నారు..




వ్యక్తిగత హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, మానవ గౌరవం విషయంలో ఈ తీర్పుతో కొత్త శకం మొదలైంది. సామాన్యుల వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూసేందుకు ప్రభుత్వం, దాని ఏజెన్సీలు చేస్తున్న అతిక్రమణ, నిఘాకు ఇది చెంపపెట్టు. ఈ హక్కు కోసం కాంగ్రెస్, ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు, ప్రతిపక్షాలు, కోర్టులో, పార్లమెంటులో కలసికట్టుగా పోరాడాయి. ప్రభుత్వ అహంకారపూరిత ప్రయత్నాల్ని అడ్డుకునేందుకు ప్రయత్నించాం.

– సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు



ఈ తీర్పు ప్రతి ఒక్క భారతీయుడి విజయం. ఫాసిస్టు శక్తులకు పెద్ద ఎదురుదెబ్బ. వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, గౌరవంలో గోప్యత హక్కు అంతర్భాగం. నిఘా వంటి చర్యలతో అణచివేయాలన్న బీజేపీ భావజాలానికి ఇది తిరుగులేని తిరస్కారం


– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు



రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి సుప్రీంకోర్టు వెలువరించిన అత్యంత ముఖ్యమైన తీర్పుల్లో ఇదొకటి. వ్యక్తిగత స్వేచ్ఛలో గోప్యత అత్యంత ముఖ్యమైంది. ఈ తీర్పుతో ఆర్టికల్ 21కి మరింత ప్రాధాన్యత ఏర్పడింది.

ఈ రోజు మనం మరోసారి స్వాతంత్ర్య సంబరాల్ని జరుపుకుంటున్నాం. భవిష్యత్తులో వ్యక్తిగత గోప్యతను దోచుకునేందుకు ప్రయత్నాలు జరిగినా ఆ సవాళ్లను కూడా అధిగమిస్తాం. సుప్రీం తీర్పు నేపథ్యంలో .. ఐపీసీ 377 కింద స్వలింగ సంపర్కం నేరమన్న సుప్రీం తీర్పును పునః పరిశీలించమని కోరే అవకాశముంది.

– చిదంబరం, కేంద్ర మాజీ మంత్రి




వ్యక్తిగత గోప్యత హక్కును సుప్రీంకోర్టులో వ్యతిరేకించి మోదీ ప్రభుత్వం అవివేకంగా ప్రవర్తించింది. ఈ అంశంలో ప్రభుత్వ వైఫల్యం దాని సంకుచిత మనస్తత్వాన్ని ప్రతిఫలిస్తుంది. సుప్రీం తీర్పు చరిత్రాత్మకం, ప్రగతిశీలం. వ్యక్తిగత ఇల్లు, వివాహాలు, లైంగిక ధోరణి, స్వేచ్ఛగా తిరిగే హక్కు, నచ్చింది తినే హక్కు, ఒంటరిగా ఉండే హక్కుకు ఇంట్లో, బహిరంగ పదేశాల్లో తప్పనిసరిగా సంపూర్ణ రక్షణ ఉంది.

– కపిల్ సిబల్, పిటిషనర్ల తరఫు న్యాయవాది

తన పాత తీర్పుల్ని మార్చేందుకు వెనకాడమనే మంచి సంప్రదాయాన్ని సుప్రీంకోర్టు చాటిచెప్పింది. ఇది చాలా ప్రగతిశీల తీర్పు. అయితే ఆధార్‌ను నిషేధించాలని మాత్రం ఎవరూ డిమాండ్ చేయలేరు. ఏ ప్రాథమిక హక్కు సంపూర్ణ హక్కు కాదు. కొన్ని పరిమితులుంటాయి.

– సోలీ సొరాబ్జీ, మాజీ అటార్నీ జనరల్



'సుప్రీంకోర్టు తీర్పు మోదీ ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగానే ఉంది. ఇది ప్రాథమిక హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛను సుదృఢం చేస్తుంది. ఈరోజు గోప్యత గురించి రాద్ధాంతం చేస్తున్న వారంతా(కాంగ్రెస్) దశాబ్దాలుగా మనకు ఈ విషయంలో పటిష్ట చట్టం లేకుండా చేశారు. ఆధార్ గురించి మాట్లాడుతున్న వారు కూడా దానికి చాలా ఏళ్ల పాటు చట్ట బద్ధత చేకూర్చలేకపోయారు. ఎమర్జెన్సీ పేరిట ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను లాగేసుకున్న వారే నేడు ప్రాథమిక హక్కులకు అంగరక్షకులమని నాటకాలు ఆడుతున్నారు'

– అమిత్ షా, బీజేపీ జాతీయాధ్యక్షుడు

ఈ తీర్పు ప్రభావం తీవ్రం..!

పలు చట్టాల మూలాలను స్పృశించే అవకాశం

వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా నిర్ధారిస్తూ సుప్రీంకోర్టు గురువారం వెలువరించిన తీర్పు... దేశంలోని చట్టాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఏది గోప్యత... ఏది కాదు అనే దాన్ని విస్పష్టంగా నిర్వచించాల్సి వస్తుంది. ఇప్పటివరకు గోప్యత విషయంలో ప్రభుత్వానికి, పౌరులకు మధ్యే ఎక్కువగా వివాదాలు నెలకొన్నాయి. ఇప్పుడిది ప్రాథమిక హక్కుగా సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పడంతో నేటి డిజిటల్ యుగంలో ప్రైవేటు సంస్థలు, పౌరులకు మధ్య లెక్కకు మిక్కిలి న్యాయ వివాదాలు నెలకొనే ప్రమాదముంది. గోప్యతకు భంగం కలిగిందనే కేసులు పెద్ద సంఖ్యలో వస్తాయి. గురువారం సుప్రీం తీర్పుతో... పెళ్లి, కుటుంబ వివరాలు, లైంగిక ఆసక్తులు... ఇలాంటి వివరాలన్నింటికీ రాజ్యాంగ రక్షణ ఏర్పడింది. క్రెడిట్ కార్డులు, ఖాతాల కోసం బ్యాంకులతో పంచుకున్న వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడీలు సదరు సంస్థలు గోప్యంగా ఉంచాల్సిందే. సామాజిక మాధ్యమాలకు ఇచ్చిన వివరాల విషయంలోనూ ఆ సంస్థలు గోప్యతను పాటించాల్సిందే. వ్యాపారాన్ని పెంచుకోవడానికి డాటాను నమ్ముకుంటున్న కంపెనీలకు, డాటాను అమ్ముకుంటున్న వారికీ ఇది పెద్ద ఎదురుదెబ్బ. తన వివరాలను మీకెవరు ఇచ్చారంటూ... కంపెనీలను కోర్టుకు ఈడ్చే శక్తిని సుప్రీం తీర్పు సామాన్యుడికి ఇచ్చింది. ఈ నేపథ్యంలో తీర్పు ప్రధానంగా వేటిపై ప్రభావం చూపుతుందనేది ఓసారి పరిశీలిద్దాం...



ఆధార్ కేసు

కేంద్ర ప్రభుత్వం ఆధార్ కోసం వేలిముద్రలు, ఐరిస్ తీసుకోవడం, చిరునామా, పుట్టిన తేదీ, ఫోన్ నెంబర్లు తదితర వ్యక్తిగత వివరాలను సేకరించడాన్ని సవాల్ చేస్తూ... పలు కేసులు సుప్రీంకోర్టు ముందున్నాయి. వ్యక్తి శరీరంపై తనకే పూర్తి హక్కులుంటాయని, వేలిముద్రలు, ఐరిస్ ఇవ్వడానికి నిరాకరించే హక్కు పౌరులకు ఉంటుందనేది పిటిషనర్ల వాదన. అలాగే తమ వ్యక్తిగత సమాచారం ఏ మేరకు భద్రమనేది వీరి ఆందోళన. ఐటీ రిటర్న్ సహా పలు ప్రభుత్వ పథకాలకు, సేవలకు ఆధార్‌తో ముడిపెట్టడాన్ని కూడా సవాల్ చేస్తూ పిటిషన్లు ఉన్నాయి. ఆధార్‌కార్డు కోసం సమర్పించిన వివరాలు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళుతున్నాయని, అవి వాణిజ్య అవసరాల కోసం ఈ వివరాలను వాడుకుంటున్నాయి కాబట్టి... ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని పిటిషనర్ల వాదన. బయోమెట్రిక్ వివరాలు బహిర్గతమైతే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందని, వేలిముద్రలను కృత్రిమంగా తయారుచేసి... ఆ గ్లవ్స్‌తో నేరాలకు పాల్పడితే తమ పరిస్థితి ఏమిటని పిటిషనర్లు ప్రశ్నించారు. వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా తొమ్మిది మంది జడ్జిలతో కూడిన ధర్మాసనం తేల్చిచెప్పినందున... ఆధార్ కేసుపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. గోప్యత ఇప్పుడు ప్రాథమిక హక్కు కాబట్టి ఆధార్ విధానం రాజ్యాంగానికి లోబడి ఉందా? లేదా? అనేది ఐదుగురు సభ్యుల ధర్మాసనం తేలుస్తుంది.

సెక్షన్ 377

భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 377 స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణిస్తుంది. గోప్యతను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు తేల్చిచెప్పినందున ఎల్‌జీబీటీ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్స్) గ్రూపులు సెక్షన్ 377ను సవాల్ చేస్తాయి. ఇద్దరు మేజర్ల పరస్పర అంగీకారంతో ఒక గదిలో జరిగేదాన్ని ఎలా నేరంగా పరిగణిస్తారని, ఇది తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని వీరి వాదన. ఎలాంటి లైంగిక వాంఛలు ఉన్నాయనే ఆధారంగా సెక్షన్ 377 సమాజంలోని కొందరి పట్ల వివక్ష చూపుతోందని గతంలోనే సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణిస్తున్న ఈ సెక్షన్‌ను కొట్టివేయడానికి నిరాకరిస్తూ... అది కోర్టు పని కాదని, పార్లమెంటు చేయాలని చెప్పింది. వ్యక్తిగత గోప్యత హక్కుగా మారినపుడు... స్వలింగ సంపర్కనేరానికి ఎవరినైనా అరెస్టు చేసి అభియోగాలు మోపడం కూడా సాధ్యమయ్యే పనికాదు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారని పోలీసులను కోర్టుకీడ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి సెక్షన్ 377 నిలబడదని నిపుణుల అభిప్రాయం.

యుథనేషియా


'జీవితకాలాన్ని పొడిగించే వైద్యాన్ని నిరాకరించడానికి, స్వచ్ఛందంగా ప్రాణాన్ని వదలడానికి వ్యక్తికి ఉండే స్వేచ్ఛ కూడా వ్యక్తిగత గోప్యత హక్కు కిందకే వస్తుంది' అని గురువారం తీర్పునిచ్చిన ధర్మాసనంలో సభ్యుడైన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత గోప్యత ఇప్పుడు ప్రాథమిక హక్కుగా మారింది కాబట్టి యుథనేషియా (స్వీయ నిర్ణయం మేరకు డాక్టర్ల సహకారంతో ప్రాణాన్ని వదలడం)ను చట్టబద్ధంగా చేయాలనే డిమాండ్ ఊపందుకుంటుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న, ఇక కోలుకునే అవకాశాలు లేవనుకున్న కేసుల్లో చావు కోసం ఎదురుచూస్తూ నరక యాతన అనుభవించే బదులుగా ప్రశాంతంగా తుదిశ్వాస విడిచే అవకాశం కల్పించడమే మేలనే ఉద్దేశంతో పలు పాశ్చాత్యదేశాలు యుథనేషియాను చట్టబద్ధం చేశాయి.

మారిటల్ రేప్

భార్య సమ్మతి, ఇష్టం లేకుండా సంభోగానికి పాల్పడితే... పాశ్చాత్య దేశాల్లో దాన్ని రేప్‌గానే పరిగణిస్తున్నారు. అయితే భారత్‌లో మాత్రం ఇది నేరం కాదు. దీన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ వచ్చే సోమవారం ఢిల్లీ హైకోర్టు ముందుకు రానుంది. గోప్యత హక్కుకు రాజ్యాంగబద్ధత రావడం... స్త్రీ శరీరంపై ఆమెకే పూర్తి హక్కులుంటాయనే వాదనను బలపరుస్తుందని నిపుణుల అభిప్రాయం.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

డీఎన్‌ఏ ప్రొఫైలింగ్ బిల్లు




జాతీయ, ప్రాంతీయ స్థాయిలో పౌరుల జన్యు చిత్రపటాల (డీఎన్‌ఏ)తో డాటా బ్యాంకును ఏర్పాటు చేయాలనే ప్రయత్నం జరుగుతోంది. పలు కేసుల పరిష్కారానికి ఇది ఉపయోగపడుతుందనేది ప్రభుత్వ ఉద్దేశం. 2007 నుంచి పలు మార్లు ముసాయిదా బిల్లులో మార్పు చేర్పులు చోటుచేసుకున్నాయి. 2017 జూలైలో తాజా ముసాయిదాను లా కమిషన్ రూపొందించింది. గోప్యత, సమాచార భద్రత, శాంపిల్స్ రక్షణ, డీఎన్‌ఏ సమాచారంలో కచ్చితత్వం, ఎలా ఉపయోగిస్తారు, డీఎన్‌ఏ సమాచార మార్పిడి ఎలా ఉంటుంది, లోపభూయిష్ట సమాచారాన్ని తొలగించడం... తదితర అంశాలపై బిల్లులో స్పష్టత లేదు. చట్టసభలకే వీటిని వదిలేసింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అయిన నేపథ్యంలో ప్రతి పౌరుడి జన్యు చిత్రపటాన్ని భద్రపరిచేందుకు ఉద్దేశించిన ఈ బిల్లు అంత సులభంగా వెలుగు చూడకపోవచ్చు.

వాట్సాప్ డాటా షేరింగ్




సామాజిక మాధ్యమమైన వాట్సాప్ తమ ఖాతాదారుల (సభ్యులు) వివరాలను మాతృసంస్థ అయిన ఫేస్‌బుక్‌తో పంచుకుంటోంది. దీనిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఢిల్లీ హైకోర్టులో కేసు వేశారు. తాము వాట్సాప్‌కు మాత్రమే తమ వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చామని, మరొకరితో దీన్ని పంచుకోవడం తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని వాదించారు. దాంతో కొత్త ప్రైవసీ విధానాన్ని తీసుకొస్తామని వాట్సాప్ చెప్పగా హైకోర్టు అంగీకరించింది. దీన్ని పిటిషన్‌దారులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. గోప్యత ప్రాథమిక హక్కు అయిన నేపథ్యంలో వాట్సాప్‌కు ఇబ్బందులు తప్పవు. అలాగే ఇతర సామాజిక మాధ్యమాలు కూడా గోప్యత విషయంలో భారత చట్టాలకు లోబడి పనిచేయాల్సి వస్తుంది. చాట్ హిస్టరీని సామాజిక మాధ్యమ సంస్థలు స్టోర్ చేయవచ్చా అనే ప్రశ్న కూడా తలెత్తుతుంది.

సెర్చ్ హిస్టరీ సంగతి?



మనం గూగుల్‌లో దేనిగురించైనా వెదికితే మన సెర్చ్ హిస్టరీని గూగుల్ స్టోర్ చేస్తోంది. మన ఆసక్తులేమిటో గుర్తించి మన ఐపీ అడ్రస్‌కు మన అభిరుచులకు తగినట్లుగా యాడ్స్‌ను పోస్ట్ చేస్తోంది. మనం ఏ సైటును ఓపెన్ చేసినా మన ఆసక్తులకు తగ్గట్టు యాడ్స్ వస్తాయి. ఇది గూగుల్‌కు అతిపెద్ద ఆదాయవనరు. తన సెర్చ్ హిస్టరీని వాణిజ్య అవసరాలకు వాడుకుంటూ గూగుల్ తన వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తోందని ఎవరైనా కోర్టుకు ఎక్కితే? ఇలాంటి లెక్కలేనన్ని ప్రశ్నలకు రేపొద్దున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాధానాలు వెతకాల్సి ఉంటుంది.

అబార్షన్



'పిండాన్ని మోసి బిడ్డను కనాలా, గర్భస్రావం చేయించుకోవాలా అనేది మహిళకుండాల్సిన స్వేచ్ఛ. ఇది కూడా రైట్ టు ప్రైవసీ కిందకు వస్తుంది' అని చలమేశ్వర్ అన్నారు. మన ప్రస్తుత చట్టాల ప్రకారం గర్భం దాల్చిన 20 వారాల తర్వాత అబార్షన్‌కు చట్టాలు అంగీకరించవు. సదరు గర్భం వల్ల తల్లి ప్రాణానికి ముప్పుందని డాక్టర్ల బృందం సర్టిఫై చేస్తే మాత్రం మినహాయింపు ఉంటుంది. అత్యాచార బాధితురాళ్లు, పది పన్నెండేళ్ల వయసులో అసలు జరుగుతున్నదేమిటో కూడా తెలియని పసివయసులో ఈ నిబంధన కారణంగా తల్లులు కావాల్సి వస్తోంది. ఇటీవలే ఓ పదేళ్ల అత్యాచార బాధితురాలిని అనారోగ్యం కాబట్టి ఆసుపత్రికి వెళుతున్నామని చెప్పి తీసుకెళ్లి కాన్పు జరిపించారు. చాలాకాలంగా భారతదేశంలో అబార్షన్ చట్టాలను మార్చాలనే డిమాండ్ ఉంది. జస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్యలు చట్టంలో మార్పు కోరుతున్న సంస్థల డిమాండ్లకు ఊతమిస్తాయి.

కోకా సుబ్బారావు అప్పుడే చెప్పారు!



దేశంలో గోప్యత హక్కు అంశం మొదటిసారి 1954లోనే సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. ఎంపీ శర్మ వర్సెస్ సతీష్‌చంద్ర కేసుగా రికార్డయిన ఈ కేసులో గోప్యత అంశాన్ని పరిశీలించిన సుప్రీం కోర్టు..అమెరికాలో మాదిరిగా ఇక్కడ గోప్యత హక్కు ప్రసాదించడం కుదరదని తేల్చిచెప్పింది. 1952 జూన్‌లో దివాలాతీసిన దాల్మియా జైన్ ఎయిర్‌వేస్ లిమిటెడ్ అనే కంపెనీకి సంబంధించిన రికార్డులు, ఫైళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని సవాలు చేస్తూ సదరు సంస్థ 1954లో సుప్రీం కోర్టుకెక్కింది. ప్రైవేటు ఆస్తులకు సంబంధించి ఇలాంటి సోదాలు జరిపి, దస్తావేజులు స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి లేదని దాల్మియా ఎయిర్‌వేస్ వాదించింది. కేసును విచారించిన అత్యున్నత ధర్మాసనం అమెరికా రాజ్యాంగంలోని నాలుగో సవరణ మాదిరిగా భారత రాజ్యాంగంలో గోప్యత హక్కుపై ప్రత్యేక నిబంధనలేవీ లేవని తీర్పు ఇచ్చింది. అయితే గోప్యత హక్కు గురించి రాజ్యాంగంలో ప్రత్యేకించి చెప్పనప్పటికీ ఇది వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులో అంతర్భాగమని 1964లో ఓ కేసుకు సంబంధించి మెజారిటీ అభిప్రాయంతో విభేదిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి కోకా సుబ్బారావు స్పష్టం చేశారు. తర్వాత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన సుబ్బారావు ఇలా తొలిసారి ఈ విషయంపై సూటిగా మాట్లాడిన జడ్జిగా చరిత్రకెక్కారు. తాను నేరస్తుడనే అనుమానంతో పోలీసులు ఎప్పుడుపడితే అప్పుడు తనను ఇంటి నుంచి బలవంతంగా తీసుకుపోవడంపై ఖరక్‌సింగ్ అనే వ్యక్తి ఉత్తరప్రదేశ్ పోలీస్ రెగ్యులేషన్ చట్టాన్ని సవాలు చేస్తూ 1963లో సుప్రీంను ఆశ్రయించారు. దీన్ని విచారించిన సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనంలోని ఆరుగురు జడ్జీలు కూడా వ్యక్తిగత గోప్యతను హక్కుగా పరిగణించకుండా ప్రభుత్వానికి అనుకూలంగా మెజారిటీ తీర్పునిచ్చారు. అయితే ఈ తీర్పుతో విభేదించిన జస్టిస్ కోకా సుబ్బారావు గోప్యత హక్కుకు అనుకూలంగా వ్యాఖ్యలు చేశారు. గోప్యత హక్కును రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా సూటిగా, స్పష్టంగా చెప్పనప్పటికీ వ్యకిగత స్వేచ్ఛా హక్కులో ఇది అంతర్భాగమని అన్నారు. ''ఓ మనిషి వ్యక్తిగత విషయాల్లో కావాలని జోక్యం చేసుకోవడం వల్ల ఆ వ్యక్తి భౌతిక సుఖ సంతోషాలకు, ఆరోగ్యానికి జరిగేంత హాని మరి దేని వల్లా జరగదు'' అంటూ జస్టిస్ జయంతీలాల్ షాతో కలిసి మైనారిటీ తీర్పు ఇచ్చారు. ఏపీ తొలి ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన సుబ్బారావు సుప్రీంకోర్టు జడ్జీగా, ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. 1967లో సీజేఐగా పదవీ విరమణ చేయడానికి కొన్ని నెలల ముందు రాజీనామా చేసి డా.జాకిర్ హుస్సేన్‌పై రాష్ట్రపతి పదవికి పోటీ చేశారు.

(సాక్షి నాలెడ్జ్ సెంటర్)

తండ్రి తీర్పును సరిదిద్దిన కుమారుడు



న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కుమారుడు గతంలో తన తండ్రి ఇచ్చిన తీర్పునే తప్పుబట్టినట్లయింది. 1975లో అత్యవసర స్థితి విధించిన సమయంలో ప్రాథమిక హక్కులను పక్కన బెట్టారు. 1976లో సుప్రీంకోర్టు 'ఏడీఎం జబల్‌పూర్' కేసులో తీర్పునిస్తూ వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యత ప్రాథమిక హక్కులు కావంది. నాటి ధర్మాసనంలో జస్టిస్ వైవీ చంద్రచూడ్ అనే న్యాయమూర్తి ఉన్నారు. తాజాగా తీర్పునిచ్చిన ధర్మాసనంలో ఆయన కుమారుడు జస్టిస్ డీవై చంద్రచూడ్ సభ్యుడిగా ఉన్నారు. 1976లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో తీవ్రమైన దోషాలు ఉన్నాయని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. 'ఆ తీర్పు దోషాలతో కూడింది. మానవ హక్కుల నుంచి జీవించే, వ్యక్తిగత స్వేచ్ఛలను విడదీయలేము. ఏ నాగరిక రాజ్యమూ జీవించే, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులను హరించేలా ఆలోచించదు' అని జస్టిస్ డీవై చంద్రచూడ్ తన తీర్పులో పేర్కొన్నారు. దీనిపై ఓ సీనియర్ న్యాయవాది వ్యాఖ్యానిస్తూ...దోషాలతో కూడిన తీర్పును తండ్రి ఇవ్వగా కొడుకు దానిని సరిదిద్దినట్లైందన్నారు.


చరిత్రాత్మక తీర్పునిచ్చిన న్యాయమూర్తులు వీరే...

దేశ సర్వోన్నత న్యాయస్థానం 44వ ప్రధాన న్యాయమూర్తి జగదీశ్ సింగ్ ఖేహర్ ఈ నెల 27న(ఆదివారం) పదవీ విరమణ చేయనున్నారు. సిక్కు మతస్థుల నుంచి ఈ అత్యున్నత స్థానాన్ని చేరుకున్న తొలి వ్యక్తిగా ఆయన ప్రత్యేకతను సాధించారు. ఈ ఏడాది జనవరి 4న ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన ఆయన, 2011 సెప్టెంబర్ 13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అంతకు ముందు ఉత్తరాఖండ్, కర్ణాటక హైకోర్టుల్లో చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలను నిర్వహించారు. 2జీ కుంభకోణం కేసులో, సహారా సంస్థ చీఫ్ సుబ్రతా రాయ్ కేసులో కీలక తీర్పులిచ్చారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో విధించిన రాష్ట్రపతి పాలనను కేంద్రం విరమించుకునేలా ఆయన తీర్పునిచ్చారు. తాజాగా ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ కేసులో మెజారిటీ తీర్పును (3 : 2 నిష్పత్తితో) విభేదిస్తూ మైనారిటీ తీర్పును వెలువరించారు. ఈ ఆచారాన్ని గత 1,400 ఏళ్లుగా ఆచరిస్తున్నందున, దీనిలో ఏదైనా మార్పు తీసుకురావాలంటే కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని రూపొందించాలని, ఆరునెలల్లోగా తగిన చట్టాన్ని తీసుకొచ్చేందుకు రాజకీయపార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలంటూ తమ తీర్పులో సూచించారు.



ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేహర్

జస్టిస్ జాస్తి చలమేశ్వర్



ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ 2011 అక్టోబర్ 10న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు జడ్జీల సీనియారిటీలో మూడోస్థానంలో ఉన్నారు. అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీగా పదోన్నతి పొందడానికి ముందు గువహటి, కేరళ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలను నిర్వహించారు. ఎవరైనా ఈ–మెయిల్స్ లేదా ఎలక్ట్రానిక్ మెసేజ్‌లలో పెట్టే పోస్టుల ద్వారా సంబంధిత వ్యక్తులను అసౌకర్యానికి, కోపానికి గురిచేస్తే వారిని పోలీసులు అరెస్ట్ చేసే హక్కును కల్పించే ఐటీ యాక్ట్ లోని 66 (ఏ) సెక్షన్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరిగా ఉన్నారు. సుప్రీంకోర్టు జడ్జీగా 2018 జూన్‌లో ఆయన పదవీ విరమణ చేయనున్నారు.

జస్టిస్ ఎస్‌ఏ బోబ్డే



బొంబాయి హైకోర్టు జడ్జీగా, ఆ తర్వాత మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశాక 2013 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆధార్ కార్డు లేని కారణంగా దేశ పౌరుడికి ఎవరికి కూడా ప్రాథమిక, ప్రభుత్వ సేవలను నిరాకరించరాదంటూ 2015లో ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన స్పష్టీకరణలో బోబ్డే భాగస్వామిగా ఉన్నారు.

జస్టిస్ ఆర్‌కే అగర్వాల్



2013 అక్టోబర్‌లో మద్రాసు హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా ఆర్‌కే అగర్వాల్ నియమితులయ్యారు. 2014 ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

జస్టిస్ రోహింగ్టన్ ఫాలి నారిమన్



1979లో న్యాయవాదిగా తమ కెరీర్‌ను ప్రారంభించిన ఆయన సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా పలు కేసులను వాదించారు. 2011 జూలై 27–2013 ఫిబ్రవరి 4 మధ్యకాలంలో భారత సొలిసిటర్ జనరల్‌గా పనిచేశారు. 2014 జూలై 7న సుప్రీంకోర్టు జడ్జీగా బాధ్యతలు చేపట్టారు. అప్పటికప్పుడు ఇచ్చే విడాకులు (ఇన్‌స్టెంట్ ట్రిపుల్ తలాక్) రాజ్యాంగ విరుద్ధమంటూ తాజాగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిచ్చిన ఐదుగురు జడ్జీల్లో ఒకరిగా ఉన్నారు. సామాజిక మాధ్యమాల్లో కించపరిచే పోస్టులపై దాఖలైన పిటిషన్‌లో భాగంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్‌లోని సెక్షన్ 66 (ఏ)ను కొట్టేస్తూ తీర్పునిచ్చిన ఇద్దరు జడ్జీల్లో ఈయన ఒకరు.

జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే



మణిపూర్ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా, గువాహటి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన అనంతరం 2014 ఆగస్టు 13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ ధనుంజయ్ యశ్వంత్ చంద్రచూడ్



మానవహక్కుల విషయంలో చంద్రచూడ్ నైపుణ్యతను సాధించారు. బొంబాయి హైకోర్టు జడ్జీగా, అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలను నిర్వహించారు. 2016 మే 13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్



సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2017 ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గతంలో పంజాబ్, హరియాణా, మద్రాస్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగానూ విధులు నిర్వర్తించారు. ప్రఖ్యాత చిత్రకారుడు ఎమ్మెఫ్ హుస్సేన్ వేస్తున్న పెయింటింగ్‌లలో అశ్లీలత ఉందంటూ 2008లో దాఖలైన పిటిషన్‌ను కౌల్ తిరస్కరించారు.

జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్



1958లో కర్ణాటకలోని మూడ్‌బిద్రీలో జస్టిస్ నజీర్ జన్మించారు. బీకామ్ ఆ తర్వాత న్యాయశాస్త్ర పట్టాను పొందాక 1983లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2003లో కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2004 సెప్టెంబర్ 24న అక్కడే శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఉన్నపళంగా 3 పర్యాయాలు తలాక్ (ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్) చెప్పడం చట్టవిరుద్ధమంటూ ఇచ్చిన తీర్పును విభేదిస్తూ చీఫ్ జస్టిస్ ఖేహర్ ఇచ్చిన మైనారిటీ తీర్పుతో జస్టిస్ నజీర్ ఏకీభవించారు.



- సాక్షి నాలెడ్జ్ సెంటర్

తీర్పు తర్వాతా ట్రిపుల్ తలాక్

మీరట్/లక్నో: ఉన్నపళంగా మూడుసార్లు తలాక్ చెప్పి భార్యను వదిలేయడం చెల్లదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన కొన్ని గంటల్లోనే ఓ గర్భిణికి ఆమె భర్త అదే విధానంలో విడాకులిచ్చాడు. కట్నం కోసం తన భర్త తనను రోజూ కొట్టే వాడనీ, సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన మంగళవారమే ముమ్మారు తలాక్ చెప్పి విడాకులిచ్చాడని యూపీలోని మీరట్‌కు చెందిన ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఆలిండియా ముస్లిం మహిళా పర్సనల్ లా బోర్డు స్పందిస్తూ...సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడే భర్తలకు ఏ శిక్ష వేస్తారనేది ఇప్పుడు ప్రశ్నగా మారిందని వ్యాఖ్యానించింది. ట్రిపుల్ తలాక్ కేసుల్లో శిక్షను నిర్ణయించేందుకు అవసరమైన నిబంధనలు తీసుకొచ్చే బాధ్యత నుంచి తప్పుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొంది.

నేపాల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

నేపాల్ ప్రధాని దేవ్‌బాతో భేటీలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: నేపాల్ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ హామీనిచ్చారు. నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాతో గురువారం మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడం, భూకంపాల తర్వాత హిమాలయన్ దేశాల్లో పునర్నిర్మాణం వంటి ఎనిమిది అంశాలపై వీరిద్దరూ ఒప్పందం చేసుకున్నారు.



నేపాల్ ప్రధానితో మోదీ కరచాలనం

భారత్–నేపాల్‌ల మధ్య ఉన్న ఓపెన్ సరిహద్దు దుర్వినియోగం కాకుండా ఇరుదేశాల భద్రత, రక్షణ బలగాలు ఒకరినొకరు సహకరించుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. దీనికి దేవ్‌బా స్పందిస్తూ ప్రతి విషయంలోనూ భారత్‌కు సహకారం అందిస్తామని, ఓపెన్ సరిహద్దు ఉన్నప్పటికీ భారత్‌కు వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలు జరగనివ్వమని హామీనిచ్చారు. సమావేశానంతరం ఇద్దరు నేతలు విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ దేవ్‌బాతో సమావేశం సుహృద్భావ వాతావరణంలో చక్కగా జరిగిందన్నారు. ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ, భద్రత అంశాలు ఎంతో కీలకమైనవిగా అభిప్రాయపడ్డారు. అనంతరం కటైయా–కుసాహ, రాక్సల్–పర్వానీపూర్ సరిహద్దుల ప్రాంతాల మధ్య విద్యుత్ రవాణా లైన్లను ప్రారంభించారు.

గుజరాత్‌కు జైట్లీ, కర్ణాటకకు జవదేకర్..

న్యూఢిల్లీ: గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయా రాష్ట్రాలకు ఎన్నికల ఇన్‌చార్జ్‌లను బీజేపీ నియమించింది. జైట్లీకి గుజరాత్ ఎన్నికల బాధ్యతలు అప్పగించగా జవదేకర్‌కు కర్ణాటక బాధ్యతలను అప్పగిస్తున్నట్లు బీజేపీ గురువారం తెలిపింది. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కేంద్ర మంత్రి గెహ్లాట్‌ను నియమించారు. కేంద్ర మంత్రులు నరేంద్ర తోమర్, నిర్మలా సీతారామన్, జితేంద్ర సింగ్, పీపీ చౌదరిని గుజరాత్ ఎన్నికలకు కో–ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. కేంద్ర మంత్రి గోయల్‌ను కర్ణాటక ఎన్నికల కో–ఇన్‌చార్జ్‌గా నియమించారు.

అమెరికా రెస్టారెంట్‌లో కాల్పులు



చార్లెస్టన్: అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం రేగింది. దక్షిణ కరోలినాలోని చార్లెస్టన్‌లోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగి ఓ వ్యక్తిపై కాల్పులు జరిపి, మరికొందరిని బందీలుగా తీసుకున్నాడు. అయితే ఈ దాడి ఉగ్ర చర్య కాదని పట్టణ మేయర్ జాన్ టెక్లెన్‌బర్గ్ చెప్పారు. వ్యక్తిగత కక్షతోనే అతను ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. లోపల ఎంత మంది బందీలుగా ఉన్నారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. కిచెన్ నుంచి ఓ వ్యక్తి హఠాత్తుగా బయటికొచ్చి 'చార్లెస్టన్‌కు కొత్త బాస్ వచ్చాడు. అందరూ ఇక్కడి నుంచి వెళ్లాలి' అని రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న వారితో అన్నట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు.

డేరా చీఫ్‌పై రేప్ కేసులో నేడే తీర్పు

- పంచకులకు చేరుకున్న వేలాది మంది గుర్మీత్ మద్దతుదారులు
- వ్యతిరేక తీర్పు వస్తే అల్లర్లు జరుగుతాయని అనుమానం
- భారీగా బలగాల మోహరింపు

చండీఘర్/న్యూఢిల్లీ: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం సింగ్‌పై అత్యాచార ఆరోపణలకు సంబంధించిన కేసులో శుక్రవారం తీర్పు వెలువడనుండటంతో హరియాణా, పంజాబ్ నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. సాధారణంగా ప్రశాంతంగా ఉండే హరియాణాలోని పంచకులలో ఈ తీర్పు నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొంది. గుర్మీత్‌కు వ్యతిరేకంగా తీర్పు వస్తే ఆందోళనలు చెలరేగే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు గుర్మీత్ మద్దతుదారులు, అభిమానులు దాదాపు లక్ష మంది వరకూ పంచకుల చేరుకున్నట్టు తెలుస్తోంది. ఈ పరిణామాలతో పంచకులతో పాటు పంజాబ్, హరియాణాల్లోని సున్నితమైన ప్రాంతాల్లో పోలీసులకుతోడు



పంచకులకు చేరుకున్న గుర్మీత్ మద్దతుదారులు


15 వేలమంది పారామిలిటరీ బలగాలను మోహరించారు. అన్ని జిల్లాల్లోనూ 144 సెక్షన్ విధించారు. డేరా సచ్చా సౌదాకు పంజాబ్, హరియాణాల్లో లక్షలాది మంది మద్దతుదారులు ఉన్నారు. దీంతో ఈ రెండు రాష్ట్రాల్లోనూ హైఅలర్ట్ ప్రకటించారు. ముందుజాగ్రత్త చర్యగా ఇరు రాష్ట్రాల్లోనూ 72 గంటల పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలుపుదల చేశారు. సోషల్ మీడియాలో పోస్టులపై అధికారులు నిఘా పెట్టారు. పంచకులకు వెళ్లే బస్సులు, రైళ్లపై ఆంక్షలు విధించారు. పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

కోర్టుకు హాజరవుతా: గుర్మీత్

తీర్పు నేపథ్యంలో శుక్రవారం తాను సీబీఐ న్యాయస్థానానికి హాజరవుతానని గుర్మీత్ రామ్‌రహీం సింగ్ ట్వీటర్‌లో ప్రకటించారు. తన మద్దతుదారులు, అభిమానులు శాంతంగా ఉండాలని సూచించారు. ''నాకు చట్టంపై గౌరవం ఉంది. నేను వెన్నునొప్పితో బాధపడుతున్నా.. చట్టానికి కట్టుబడే ఉంటాను. గురువారం కోర్టుకు హాజరవుతాను. నాకు దేవునిపై పూర్తి నమ్మకం ఉంది. ప్రతి ఒక్కరూ శాంతంగా ఉండాలి''అని ట్వీటర్‌లో గుర్మీత్ ట్వీట్ చేశారు. ఇద్దరు సాధ్వీలపై గుర్మీత్ రామ్‌రహీం సింగ్ అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి పంజాబ్, హరియాణా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ డేరా చీఫ్‌పై కేసు నమోదు చేసింది. తీర్పు నేపథ్యంలో సిర్సాలోని 3 గ్రామాల్లో కర్ఫ్యూ విధించారు.

పర్యావరణ పరిరక్షక దేవుడు గణనాథుడు

ముఖ్యమంత్రి చంద్రబాబు వినాయక చవితి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ప్రకృతికి ప్రతీకగా నిలిచే ఆరాధ్యదైవమైన గణేశ్ పూజలకు మట్టి ప్రతిమలనే ఉపయోగించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. తెలుగు ప్రజలకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పురోభివృద్ధికి విఘ్నాలన్నీ తొలగిపోవాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం చెప్పారు. విఘ్నేశ్వరుణ్ణి 21 రకాల చెట్ల ఆకులతో పూజించాలని శాస్త్రాలు చెబుతున్నాయని, ఔషధ గుణాలున్న అటువంటి వృక్ష జాతులను రక్షించి, భావితరాలకు అందించాలన్న సందేశం ఇందులో ఇమిడి ఉందన్నారు.

29న తెలుగు పత్రికల ఎడిటర్లతో అమిత్ షా భేటీ

28న రాష్ట్రానికి రానున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు



సాక్షి, అమరావతి: మూడు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల 28న రాష్ట్రానికి వస్తున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడు అమిత్ షా 29న తెలుగు పత్రికల ఎడిటర్లు, బ్యూరో చీఫ్‌లతో భేటీ కానున్నారు. విజయవాడలో విధులు నిర్వహిస్తున్న ఆంగ్లపత్రికల బ్యూరో చీఫ్‌లను కూడా సమావేశానికి ఆహ్వానించనున్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా అమిత్ షా పాల్గొనే కార్యక్రమాలపై చర్చించేందుకు బీజేపీ ముఖ్య నేతలు గురువారం ఎంపీ గోకరాజు గంగరాజు గెస్ట్‌హౌస్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కార్యక్రమాల జాబితాను సిద్ధం చేసి, ఢిల్లీలోని అమిత్ షా కార్యాలయానికి పంపారు. కాగా, 28న రాష్ట్ర పర్యటనకు వచ్చే అమిత్ షాకు ఘనస్వాగతం పలకాలని రాష్ట్ర నేతలు నిర్ణయించారు. 28న ఉదయం 9.30 గంటలకు అమిత్‌షా గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని పార్టీ నేతలు చెబుతున్నారు. అక్కడి నుంచి విజయవాడ స్టేట్ గెస్ట్‌హౌస్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. మూడు రోజుల పర్యటనలో ఒక రాత్రి పార్టీ కార్యకర్త ఇంటిలో బస చేయడంతో పాటు ఆ రాత్రి అక్కడి బూత్ కమిటీ సభ్యులతో అమిత్‌షా సమావేశమవుతారు. ఈ సమావేశానికి విజయవాడ నగరంలో రెండు, నగరానికి చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో మరో మూడు ప్రాంతాలను గుర్తించినట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

పేలిన రెడ్‌మి నోట్4 ఫోన్



కాలిపోయిన సెల్ ఫోన్ చూపిస్తున్న సాయి

అచ్యుతాపురం (యలమంచిలి): చార్జింగ్ పెట్టిన రెడ్‌మి నోట్4 మొబైల్ ఫోన్ పేలిపోయిన ఘటన విశాఖ జిల్లా రామన్నపాలెంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంధం ధర్మిరెడ్డి సాయి తన రెడ్‌మి నోట్ 4 సెల్ ఫోన్‌కు చార్జింగ్ పెట్టి, చార్జింగ్‌లో ఉన్న ఫోన్‌తో కాసేపు మాట్లాడి బయటికి వెళ్లాడు. ఐదు నిమిషాల తరువాత పెద్ద శబ్ధం రావడంతో వచ్చి చూడగా సెల్‌ఫోన్ నుంచి పొగలు వస్తున్నాయి. ఈ ఫోన్‌ను 2 నెలల క్రితం కొనుగోలు చేసినట్లు సాయి చెప్పాడు.

తిరుమల ఘాట్‌లో కూలిన కొండరాళ్లు

సాక్షి, తిరుమల: తిరుమల ఘాట్ రోడ్డులో మళ్లీ కొండచరియలు విరిగిపడుతున్నాయి. వరుసగా మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే రెండో ఘాట్ రోడ్డులో 2 రోజులుగా భారీ స్థాయిలో కొండచరియలు కూలుతున్నాయి. గురువారం కూడా తొమ్మిదో కి.మీ. వద్ద భారీ స్థాయిలోని ఓ బండరాయి సుమారు 100 అడుగుల ఎత్తు నుంచి రోడ్డుపైకి దొర్లుకొచ్చింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పింది. దీంతో అప్రమత్తమైన అధికారులు జేసీబీతో రాళ్లు తొలగించారు.

రిజర్వేషన్లపై కార్యాచరణ ప్రకటించాలి

- జైట్లీ ఆదేశాలతోనైనా బాబు బుద్ధి తెచ్చుకోవాలి
- కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం
- మద్దతు తెలిపిన ఆదిశేషగిరిరావు, ధర్మాన కృష్ణదాసు

జగ్గంపేట: కాపులకు బీసీ రిజర్వేషన్లు కల్పించేందుకు కార్యాచరణ ప్రకటించాలని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం నుంచి రోజూలాగే గురువారం ఉదయం తలపెట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడంతో గేటు వద్ద సాయంత్రం వరకు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మద్దతు తెలియజేసేందుకు వచ్చిన వారిని ఉద్దేశించి, మీడియాతో ముద్రగడ మాట్లాడారు. భారీగా ఉద్యమం చేస్తున్నప్పటికీ కాపు జాతిపై చంద్రబాబు సవతితల్లి ప్రేమ ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ బీసీ వర్గీకరణ కోసం కాలపరిమితిని నిర్దేశించి, ఆ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించడం చూసి చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఎప్పటిలోగా రిపోర్టు తెప్పించుకుని అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టి కేంద్రానికి పంపిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు నిరవధిక యాత్ర ఆగదని స్పష్టం చేశారు.



ముద్రగడకు మద్దతు తెలుపుతున్న నిర్మాత ఆదిశేషగిరిరావు

పాదయాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం: ఆదిశేషగిరిరావు

కాపు రిజర్వేషన్ల కోసం ఉద్యమం చేస్తున్న ముద్రగడను గురువారం కిర్లంపూడిలోని ఆయన నివాసంలో సినీ నటుడు కృష్ణ సోదరుడు, నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు ధర్మాన కృష్ణదాసు, ఆ పార్టీ జనరల్ సెక్రటరీ సాగి ప్రసాదరాజు తదితరులు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ... చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయకుండా ముద్రగడ పాదయాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ ప్రభుత్వం ఇలా వ్యవహరించలేదన్నారు. కాపుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

మాకెలాగూ పండగ లేదు.. మీరైనా జరుపుకోండి..

ఎప్పటిలాగే గురువారం తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం నుంచి పాదయాత్రకు బయలుదేరిన కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను, ఆయన అనుచరులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ 'మాకు ఎలాగూ పండగలు లేవు. మాకు కాపలా ఉండవద్దు. మీరు, మీ కుటుంబాలు సంతోషంగా వినాయక చవితి చేసుకోండి' అని పోలీసులకు సూచించారు. శుక్రవారం తాను పాదయాత్ర చేయనని హామీ ఇచ్చారు. పోలీసులందరూ ఇంటికి వెళ్లి ఆనందంగా పండగలో పాల్గొని సంతోషంగా రావాలని కోరారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరంలో కూర్చుని ప్రభుత్వానికి నిరసన తెలియజేసిన ముద్రగడ వర్షాన్ని కూడా లెక్క చేయలేదు. శిబిరంలో కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, ప్రకాష్, గౌతు స్వామి, రాజీవ్ తదితరులున్నారు.



పోలీసులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతున్న ముద్రగడ

సీఎం సాక్షిగా ఇసుక నిబంధనలకు తూట్లు

- ముఖ్యమంత్రి ఇంటి సమీపంలో భారీ భవన నిర్మాణం
- బేస్ మట్టం లెవెల్‌కు మట్టి బదులు ఇసుక వాడకం

ఉండవల్లి (తాడేపల్లి రూరల్): ఉండవల్లి – అమరావతి కరకట్టపై నివాసం ఉంటున్న సీఎం చంద్రబాబు సాక్షిగా ఉచిత ఇసుక పాలసీకి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. సీఎం నివాసం పక్కన చిన్న చిన్న సభలు ఏర్పాటు చేసేందుకు 60 సెంట్ల పంట పొలంలో భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ భవనం కృష్ణానది నీటి మట్టానికి కేవలం రెండు అడుగుల ఎత్తులో ఉండడంతో చిన్నపాటి వరద వచ్చినా మునిగిపోయే అవకాశం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో భూమిపై ఐదు అడుగుల వరకు పిల్లర్లు లేపి, వాటికి గోడలు నిర్మించి.. అందులో ఇసుక నింపుతున్నారు. ఉచిత ఇసుక పాలసీ ప్రకారం నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఇసుకతో నింపకూడదు. కేవలం మట్టితో మాత్రమే నింపాల్సి ఉంటుంది. ఇసుక దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం ఈ నిబంధన రూపొందించింది. అయితే ఈ ప్రాంతంలో మట్టి కంటే ఇసుకే తక్కువ ధరకు వస్తుందని నిబంధనలకు నీళ్లొదిలారు. ఒక లారీ మట్టి రూ.5 వేలు అవుతుండగా, లారీ ఇసుక రూ.1000కే వస్తోంది. దీంతో కాంట్రాక్టర్ పక్కనే ఉన్న నదిలోంచి యథేచ్ఛగా ఇసుక తోడుకొస్తూ ఈ భవనం బేస్‌మట్టం ఎత్తు పెంచేందుకు వాడుతున్నాడు.

పిడుగుపాటుకు ఏడుగురి మృతి

విశాఖలో ముగ్గురు, విజయనగరం జిల్లాలో నలుగురు మృత్యువాత

సాక్షి, విశాఖపట్నం/సాక్షి ప్రతినిధి, విజయనగరం: విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం పడింది. ముఖ్యంగా చోడవరం, మాడుగుల, పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడ్డాయి. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ ఏకధాటిగా వర్షం కురిసింది. చీడికాడ మండలం వరహాపురంలో పొలంలో పిడుగుపడి తల్లీ కూతుళ్లు మృత్యువాతపడ్డారు. గ్రామానికి చెందిన బాలిబోయిన రాములమ్మ (45), ఆమె కుమార్తె పార్వతి (25) వరి నాట్లు వేస్తుండగా భారీ వర్షంతో పాటు పిడుగు పడింది. పార్వతి అక్కడికక్కడే మృతి చెందగా, గ్రామానికి తరలిస్తుండగా రాములమ్మ మృతి చెందింది. అలాగే దేవరాపల్లి మండలం రైవాడ పంచాయతీకి చెందిన శ్రీరామపురంలో రైతు దగ్గు సన్నిబాబు (53) పొలం నుంచి పశువులను కళ్లానికి తోలుకొస్తుండగా పిడుగుపడి అపస్మారక స్థితికి వెళ్లాడు. దేవరాపల్లిలో పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు.

విజయనగరంలో నలుగురి మృతి

విజయనగరం జిల్లాలో వేర్వేరు చోట్ల గురువారం సాయంత్రం పడ్డ పిడుగులకు నలుగురు మృత్యువాత పడ్డారు. లక్కవరపుకోట మండలం ఖాసాపేటలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురవగా పిడుగులు పడ్డాయి. ఈ సంఘటనలో గ్రామం సమీపంలోని పొలంలో పనిచేస్తున్న కోళ్ల రామునాయుడు (68), కొటాన అప్పలనాయుడు (50) మృత్యువాతపడ్డారు. వీరిలో రామునాయుడు వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొంది వ్యవసాయం చేసుకుంటున్నారు. మరో సంఘటనలో శృంగవరపుకోట మండలం చుక్కవానిపాలేనికి చెందిన విశ్వనాథ దండు (60) పొలంలో దమ్ముపడుతుండగా పిడుగుపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల రైతులు ఆయన్ను ఎస్‌కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అలాగే దత్తిరాజేరు మండలం పెదమానాపురం బీసీ కాలనీకి చెందిన పాచిపెంట అన్నపూర్ణ (52) పొలంలో ఉభాలు చేస్తుండగా పిడుగుపాటుకు గురై మృతి చెందింది.



విశాఖ జిల్లా వరహాపురంలో పిడుగుపడి మృతిచెందిన తల్లి రాములమ్మ, కూతురు పార్వతి

కన్నతల్లిని గెంటేశారు...

- ఇంటికి తాళం వేసి ఊరెళ్లిన కొడుకు, కోడలు
- అండగా నిలిచిన స్ఫూర్తి మహిళామండలి

సాలూరు: నవమాసాలు మోసి, కని, పెంచిన తల్లి బిడ్డలకు భారమైంది. ఆమెను బయటకు ఈడ్చేసిన కొడుకు, కోడలు.. ఉంటున్న ఇంటికి తాళంవేసి ఊరెళ్లిపోయిన ఘటన విజయనగరం జిల్లా సాలూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. ఇదేమని ప్రశ్నించిన ఇరుగుపొరుగువారిపై ఆ భార్యాభర్తలు బెదిరింపులకు దిగారు. దీనికి సంబంధించి స్థానిక మహిళలు అందించిన వివరాలు ఇలాఉన్నాయి. పట్టణంలోని రామాకాలనీలోని మున్సిపల్ పార్క్ సమీపంలో అద్దె ఇంటిలో నివసిస్తున్న సోదావలి లక్ష్మి తన భర్త మరణించడంతో ఇద్దరు కొడుకుల దగ్గర నెలరోజులు వంతున వెళ్లబుచ్చుతోంది. పెద్దకొడుకు శ్రీను విజయనగరంలోను, చిన్నకొడుకు రాజు సాలూరు రామాకాలనీలోనూ నివసిస్తున్నారు. ప్రస్తుతం సాలూరులోని చిన్నకొడుకువద్ద లక్ష్మి తలదాచుకుంటోంది. ఆమె తమవద్ద ఉండటం ఇష్టంలేని కొడుకు, కోడలు కొంతకాలం నుంచి వేధిస్తున్నారు. భోజనం సైతం పెట్టకుండా కడుపు మాడుస్తున్నారు. పెద్ద కొడుకు ఇంటిదగ్గర కూడా ఇదే పరిస్థితని లక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. వెల్డింగ్ షాపులో రోజువారీ కూలీలుగా తన ఇద్దరు బిడ్డలు పనిచేస్తున్నారని, తాను దయనీయమైన పరిస్థితిలో ఉన్నానని వాపోయింది. ఇదేమని ప్రశ్నించిన ఇరుగుపొరుగువారిపై కస్సుమని లేవడమే గాకుండా ఆమెకు భోజనం పెడితే కిరోసిన్ పోసి ముట్టించేస్తామని కొడుకు, కోడలు బెదిరించినట్టు పలువురు మహిళలు తెలిపారు. ఒక సంచిలో బట్టలు సర్దేసి, బలవంతంగా ఇంటి బయటకు నెట్టేసి, తాళంవేసుకుని కొడుకు, కోడలు వెళ్లిపోవడంతో దిక్కుతోచని స్థితిలో వున్నానని ఆ తల్లి రోదించసాగింది. విషయం తెలుసుకున్న స్ఫూర్తి మహిళా మండలి అధ్యక్షురాలు బలగ రాధ అక్కడకు చేరుకుని లక్ష్మి ఆవేదనను అర్థం చేసుకుని ఆదరించారు. పోలీసుల సహకారంతో కొడుకు, కోడళ్లకు కౌన్సెలింగ్ ఇప్పించి సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కొడుకులు ఆదరించేంతవరకు వృద్ధురాలు తమవద్దే ఉంటారని తెలిపారు.



బాధిత మహిళకు అండగా నిలిచిన స్ఫూర్తి మహిళా మండలి సభ్యులు

34 అడుగుల భారీ మట్టి గణపయ్య!

- ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమలోనే అతిపెద్ద విగ్రహం ఏర్పాటు
- 1,116 కిలోల లడ్డూని నైవేద్యంగా సమర్పించనున్న ముస్లిం సోదరులు
- ప్రజలకు 70 వేల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

తిరుపతి రూరల్

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వరంలో బాల వినాయక కమిటీ ఈ ఏడాది రాయలసీమలోనే అతిపెద్ద మట్టి సాయిగణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. 34 అడుగుల ఎత్తు, 25 అడుగుల వెడల్పు ఉన్న ఈ విగ్రహాన్ని చెవిరెడ్డి స్వగ్రామమైన తుమ్మలకుంటలో ఏర్పాటు చేశారు. సినీ ఆర్ట్ డైరెక్టర్ చిన్నా ఆధ్వర్యంలో సుమారు 70 మంది నిపుణులు 16 రోజులపాటు శ్రమించి ఈ విగ్రహాన్ని తయారుచేశారు. శరీరం మొత్తం షిరిడీ సాయి ఆకారంలో ఉండి, తల మాత్రం గణేశుడి రూపంలో ఉన్న ఈ విగ్రహం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విగ్రహం చుట్టూ షిరిడీ ఆలయం ఉట్టిపడేలా షెట్టింగ్స్ వేశారు.

కేవలం గడ్డి, మట్టితోనే....

భారీ సాయిగణేశ్ విగ్రహం తయారీలో ఎలాంటి రసాయనాలను వినియోగించలేదు. కేవలం మట్టి, చెక్కలు, గడ్డి, టెంకాయ పీచులతోనే దీన్ని తయారు చేశారు. అందుకోసం 10 వేల కిలోల బంకమట్టి, 2 వేల కిలోల టెంకాయ పీచులు, 300 కిలోల గడ్డి, 100 కిలోలకు పైగా చెక్కలను వినియోగించారు.

1,116 కిలోల లడ్డూ..

ముస్లిం సోదరులు షరీఫ్, అష్రఫ్‌లు తయారు చేసిన 1,116 కిలోల లడ్డూను మొదటి నైవేద్యంగా స్వామివారికి సమర్పించనున్నారు. తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలు అందుకోనున్న ఈ సాయిగణపతికి సెప్టెంబర్ 2న మధ్యాహ్నం 11 గంటల నుంచి నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు. పసుపు, కుంకుమ కలిపిన నీళ్లతో రెండు ఫైర్ ఇంజన్ల సహాయంతో ప్రతిష్టించిన చోటే నిమజ్జనం చేస్తామని చెప్పారు. అలాగే ప్రజలకు 70 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు చెవిరెడ్డి తెలిపారు.



తుమ్మలగుంటలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం

'రెడ్ స్టార్' సంగీత ఆత్మహత్యాయత్నం

చిత్తూరు జిల్లా జైల్లో యాసిడ్ తాగటంతో ఆస్పత్రికి తరలింపు



చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగీత చటర్జీ

చిత్తూరు అర్బన్: ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో నిందితురాలిగా ఉన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన సినీనటి సంగీత చటర్జీ గురువారం చిత్తూరులోని జిల్లా జైల్లో ఆత్మహత్యాయత్నం చేసింది. మరుగుదొడ్లు శుభ్రం చేసే యాసిడ్ తాగటంతో జైలు అధికారులు ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చెన్నైకు చెందిన అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ లక్ష్మణ్ రెండో భార్య సంగీత చటర్జీపై చిత్తూరు జిల్లాలో పలు కేసులు నమోదయ్యాయి. కోల్‌కతాకు చెందిన ఆమెపై యాదమరి, నింద్ర, కల్లూరు పోలీస్‌స్టేషన్లలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు నమోదయ్యాయి. లక్ష్మణ్ జైల్లో ఉండగా ఎర్రచందనం లావాదేవీలు నిర్వహించటంతోపాటు పలువురు స్మగ్లర్లకు డబ్బులు చేరవేసినట్లు పోలీసులు గుర్తించారు. గతేడాది కోల్‌కతాలోని ఆమె లాకర్ల నుంచి రూ.కోట్ల విలువైన నగదు, బంగారం, పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను చిత్తూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఏడాది మార్చిలో సంగీతను కోల్‌కతాలో అరెస్టు చేసి చిత్తూరుకు తరలించారు. ఐదు నెలలుగా ఆమె చిత్తూరులోని జిల్లా జైల్లో రిమాండు ఖైదీగా ఉంది. స్మగ్లింగ్ కేసుల్లో బెయిల్ రాకపోవడంతో పాటు జైల్లో ఇబ్బందుల కారణంగా యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డట్లు సంగీత పేర్కొంది. ఆస్పత్రిలో చికిత్స అందించిన తరువాత ఆమె కోలుకుంది. తొలుత జైల్లో అధికారుల నుంచి వేధింపులు ఉన్నాయని చెప్పిన ఆమె అనంతరం అలాంటిదేమీ లేదని పేర్కొనటం గమనార్హం. వైద్యుల సూచన మేరకు అనంతరం ఆమెను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. జైల్లో ఖైదీలకు అందుబాటులో యాసిడ్ ఎందుకు ఉంచారో అధికారులు జవాబు చెప్పటం లేదు.ఈ ఘటనలో జైలు అధికారుల నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆంధ్ర ఉద్యోగులను పంపిస్తాం

తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న ఆంధ్రప్రాంత ఉద్యోగులను త్వరలోనే వారి రాష్ట్రానికి పంపించి అక్కడ పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను ఇక్కడకు తీసుకువస్తామని టీఎస్‌బీసీఎల్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు అన్నారు. గురువారం ఆయన ఎక్సైజ్ భవన్‌లోని తన నూతన కార్యాలయంలో 'సాక్షి'ప్రతినిధితో మాట్లాడారు. కార్పొరేషన్‌లో ఆంధ్రప్రాంతానికి చెందిన 12 మంది ఉద్యోగులు ఉన్నారని, ఆంధ్రలో తెలంగాణకు చెందిన నలుగురు ఉద్యోగులు ఉన్నారని, 10–15 రోజుల్లో అక్కడి వారిని ఇక్కడకు తీసుకువస్తామని చెప్పారు. ఈమేరకు రెండు రాష్ట్రాల కార్పొరేషన్ ఎండీలు కలసి మాట్లాడుకున్నారని తెలిపారు.

విశాఖకు భారీ పరిశ్రమలు రావు

- ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్
- భూముల కొరత తీవ్రంగా ఉంది
- రెండేళ్లలో లక్ష ఐటీ ఉద్యోగాలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో భారీ పరిశ్రమలు వచ్చే అవకాశాలు కనిపించడం లేదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. విశాఖలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూముల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఒక్క విశాఖలోనే గత మూడేళ్లలో 40 ఐటీ కంపెనీలు ముందుకొచ్చినా వాటికి భూములు కేటాయించలేని దుస్థితి నెలకొందని, దీంతో విశాఖకు చెందిన ఐటీ రంగ నిపుణులు హైదరాబాద్, బెంగుళూరు వంటి సిటీలకు తరలి వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ రేసపువానిపాలెంలో ఎనిమిది ఐటీ కంపెనీలతో ఏర్పాటుచేసిన టెక్‌హబ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం పోర్టు గెస్ట్‌హౌస్‌లో ఐటీ పరిశ్రమలకు అనువైన భూములు, మౌలిక వసతుల కల్పన, స్మార్ట్ సిటీ తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. పార్క్ హోటల్‌లో ఐటీ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... రానున్న రెండేళ్లలో కోటి చదరపు అడుగుల విస్తీర్ణంలో సమగ్ర ఐటీ పర్యావరణ అభివృది కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. రానున్న రెండేళ్లలో లక్ష ఐటీ ఉద్యోగాలు కల్పించనున్నామని, వాటిలో 70 వేల ఉద్యోగాలు విశాఖలోనే కల్పించబోతున్నామని తెలిపారు. ఏపీ ఫైబర్ గ్రిడ్ ద్వారా 2018 కల్లా 50 లక్షల ఫైబర్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. టెక్‌హబ్‌లో పాత్రా బీపీవో ఇండియా సర్వీసెస్ కంపెనీ రెండువేల ఉద్యోగాలు, డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ 1500 ఉద్యోగాలు కల్పించేందుకు మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. రాష్ట్ర ఐటీ సలహాదారు జేఏ చౌదరి, ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సలహాదారులు రవికుమార్ పి వేమూరి, సీఈవో సాంబశివరావు, ఎలక్ట్రానిక్ అండ్ ఐటీ ఏజెన్సీ ప్రమోషన్ సీఈవో సీహెచ్ తిరుమల రావు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ జి.సృజన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

కౌమార సమస్యలపై మీడియా ఫోకస్ చేయాలి

- మూడు రాష్ట్రాల యునిసెఫ్ కో–ఆర్డినేటర్ ప్రొసూన్‌సేన్
- ఈ తరహా కథనాలు రాసేవారికి రూ.10 వేలు ఫెలోషిప్

సాక్షి, విశాఖపట్నం: కౌమార దశలో బాలబాలికలు ఎదుర్కొనే సమస్యలపై మీడియా ఫోకస్ చేయాలని యునిసెఫ్ కర్ణాటక, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కో–ఆర్డినేటర్ ప్రొసూన్ సేన్ కోరారు. 10 నుంచి 19 ఏళ్ల మధ్య ఉండే పిల్లలు సరైన అవగాహన లేక పెడదారి పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వారిని ఎడ్యుకేట్ చేసేలా విశ్లేషణాత్మక వార్తా కథనాలు రాయాలని సూచించారు. యునిసెఫ్ ఆధ్వర్యంలో గురువారం విశాఖలో నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. కౌమార దశలో ఉన్న బాలబాలికలకు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు యునిసెఫ్.. భారత్‌తో పాటు పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌లో ఉన్న పురులై, అస్సాంలోని సబ్‌సెహర్‌తో పాటు ఏపీలోని విశాఖ జిల్లాను ఎంపిక చేసినట్లు తెలిపారు. దేశంలో 24 కోట్ల మంది కౌమార దశలో ఉంటే, ఏపీలో దాదాపు కోటి మంది ఉన్నారని చెప్పారు. ఏపీలో ఏటా ఐదారు వేల ఆత్మహత్యలు జరుగుతుంటే.. వారిలో ఏడు శాతం మంది కౌమార దశలో ఉన్నవారేనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సరైన అవగాహన లేక ఈ వయసులో బాలబాలికలు ఎన్నో సమస్యలు, రుగ్మతలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. తమ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలియక పెడదారిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి సమస్యలపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరముందన్నారు. ఈ తరహా కథనాలు రాసే సంస్థలు, రిపోర్టర్లకు అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లలో ప్రతి నెలా రూ.10 వేల చొప్పున ఫెలోషిప్ అందజేయనున్నట్టు ప్రకటించారు. వర్క్‌షాప్‌లో ఏయూ ప్రొఫెసర్, డీవీఆర్ మూర్తి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న యునిసెఫ్ కో–ఆర్డినేటర్ ప్రొసూన్‌సేన్



యూఎస్ ఓపెన్‌కు రావ్‌నిక్ దూరం

గాయం కారణంగా యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి మరో అగ్రశ్రేణి క్రీడాకారుడు దూరమయ్యాడు. 2016 వింబుల్డన్ టోర్నీ రన్నరప్ మిలోస్ రావ్‌నిక్ ఎడమచేతి మణికట్టు గాయం కారణంగా యూఎస్ ఓపెన్ నుంచి తప్పుకున్నాడు. ఈ విషయాన్ని రావ్‌నిక్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బుధవారం వెల్లడించాడు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈటోర్నీకి ఇప్పటికే నొవాక్ జొకోవిచ్, స్టాన్ వావ్రింకా, కీ నిషికోరి గాయాల కారణంగానే దూరంగా ఉన్నారు.



భారత్ ముందున్న లక్ష్యం 231... రోహిత్, ధావన్ జోరుగా ఆడి తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించారు. ఇక మ్యాచ్ మళ్లీ ఏకపక్షం అనుకున్న దశలో లంక స్పిన్నర్ అఖిల ధనంజయ మాయకు బ్యాటింగ్ ఆర్డర్ ఒక్కసారిగా పేకమేడలా కుప్ప కూలింది. 22 పరుగుల వ్యవధిలో ఏకంగా 7 వికెట్లు కూలాయి. జట్టు ఓటమి దిశగా పయనిస్తున్న సమయంలో ధోని, భువీ భాగస్వామ్యం అద్భుత విజయాన్ని అందించింది. ధోని ఎప్పటిలాగే తనదైన శైలిలో ప్రశాంతంగా ఆడగా... భువనేశ్వర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌తో సత్తా చాటాడు. 100 పరుగుల అభేద్య భాగస్వామ్యం టీమిండియాకు ఎప్పటికీ గుర్తుంచుకునే విజయాన్ని అందించింది.

ధనంజయ

1 ఎనిమిదో వికెట్‌కు భారత్ తరఫున అత్యధిక భాగ స్వామ్యం (100) నెలకొల్పిన ధోని, భువనేశ్వర్ జోడి

99 వన్డేల్లో ఎంఎస్ ధోని చేసిన స్టంపింగ్‌ల సంఖ్య. సంగక్కరతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు.

భువీంద్రజాలం

భారత్‌ను గెలిపించిన భువనేశ్వర్, ధోని

ఆరు వికెట్లు తీసిన లంక బౌలర్ ధనంజయ

కాండీ: ఓటమి ఖాయమే అనుకున్న స్థాయి నుంచి సీనియర్ బ్యాట్స్‌మన్ ఎంఎస్ ధోని (68 బంతుల్లో 45 నాటౌట్; 1 ఫోర్) అనుభవానికి తోడు భువనేశ్వర్ (80 బంతుల్లో 53 నాటౌట్; 4 ఫోర్లు; 1 సిక్స్) విలువైన అర్ధ సెంచరీతో భారత జట్టు గట్టెక్కింది. ఈ జోడీ రికార్డు భాగస్వామ్యంతో గురువారం జరిగిన రెండో వన్డేలో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన భారత్ మూడు వికెట్ల తేడాతో శ్రీలంకపై నెగ్గింది. అంతకుముందు టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 236 పరుగులు చేసింది. సిరివర్ధన (58 బంతుల్లో 58; 2 ఫోర్లు, 1 సిక్స్), కపుగెడెర (61 బంతుల్లో 40; 2 ఫోర్లు) మాత్రమే రాణించారు. బుమ్రాకు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ వర్షం కురవడంతో రెండు గంటలపాటు మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. దీంతో 47 ఓవర్లలో లక్ష్యాన్ని 231 పరుగులకు కుదించారు. రోహిత్ (45 బంతుల్లో 54; 5 ఫోర్లు, 3 సిక్సర్లు), ధావన్ (50 బంతుల్లో 49; 6 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడారు. ధనంజయకు ఆరు వికెట్లు దక్కాయి.

ఆదుకున్న సిరివర్ధన

లంక ఇన్నింగ్స్‌లో ఓపెనర్ డిక్‌వెల్లా క్రీజులో ఉన్న కాసేపు వేగంగా ఆడాడు. అయితే మిడ్ వికెట్‌లో ధావన్ పట్టిన క్యాచ్‌తో అవుటయ్యాడు. దీంతో తొలి వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కొద్దిసేపటికే వరుస ఓవర్లలో గుణతిలక (37 బంతుల్లో 19; 2 ఫోర్లు), కెప్టెన్ తరంగ (9) అవుట్ కావడంతో జట్టుపై ఒత్తిడి పెరిగింది. ఆ తర్వాత కుశాల్ (19), మాథ్యూస్ (41 బంతుల్లో 20;2 ఫోర్లు) రూపంలో 121 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో లంక ఇన్నింగ్స్‌ను సిరివర్ధన, కపుగెడెర ఆదుకున్నారు. సిరివర్ధన 49 బంతుల్లో 50 పరుగులు పూర్తిచేశాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడిని బుమ్రా విడదీశాడు.

శుభారంభం అదుర్స్..

స్వల్ప లక్ష్యం కోసం బరిలోకి దిగిన భారత్‌కు రోహిత్, ధావన్ మెరుపు ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా లంక గడ్డపై ఆడిన చివరి పది వన్డేల్లో మొత్తం 37 పరుగులే చేసిన రోహిత్ ప్రారంభం నుంచే ఎదురుదాడికి దిగాడు. రెండో బంతినే ఫోర్‌గా మలిచిన అతను తొమ్మిదో ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. 43 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా అటు ధావన్ కూడా చెత్త బంతులను బౌండరీ దాటించడంతో 15 ఓవర్లలోనే జట్టు స్కోరు 102 పరుగులకు చేరింది. 16వ ఓవర్ నుంచి స్పిన్నర్ ధనంజయ చేసిన మాయతో భారత శిబిరం కుదేలైంది. మొదట రోహిత్‌ను ఎల్బీగా అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సిరివర్ధన వేసిన ఆ మరుసటి ఓవర్‌లోనే మాథ్యూస్ తీసుకున్న అద్భుత డైవింగ్ క్యాచ్‌తో ధావన్ అవుటయ్యాడు. ఇక 18వ ఓవర్‌లో ధనంజయ భారత్‌కు గట్టి షాకే ఇచ్చాడు. బ్యాటింగ్ ప్రాక్టీస్ కోసం రాహుల్ (4), జాదవ్ (1)లను కోహ్లి (4)ముందుగా పంపించాడు. కానీ ధనంజయ ఐదు బంతుల వ్యవధిలోనే తన గూగ్లీ బంతులతో ఈ ముగ్గురినీ బౌల్డ్ చేయడంతో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇంతటితో ఆగకుండా తన మరుసటి రెండు ఓవర్లలో పాండ్యా (0), అక్షర్ (6)ల పనిపట్టాడు. ఈ ఇబ్బందికర పరిస్థితిలో క్రీజులో ఉన్న ధోనికి భువనేశ్వర్ అండగా నిలిచాడు. దాదాపు 23 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన ఈ జోడి మొదట వికెట్ పడకుండా ఆచితూచి ఆడినా చివర్లో జోరు కనబరిచింది. ముఖ్యంగా భువీ.. ధోనికన్నా వేగంగా ఆడుతూ 77 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. చివరికంటా నిలిచిన వీరు జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్‌వెల్లా (సి) ధావన్ (బి) బుమ్రా 31; గుణతిలక (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 19; కుశాల్ మెండిస్ ఎల్బీడబ్ల్యు (బి) చాహల్ 19; తరంగ (సి) కోహ్లి (బి) పాండ్యా 9; మాథ్యూస్ ఎల్బీడబ్ల్యు (బి) అక్షర్ 20; సిరివర్ధన (సి) రోహిత్ (బి) బుమ్రా 58; కపుగెడెర (బి) బుమ్రా 40; ధనంజయ (సి) అక్షర్ (బి) బుమ్రా 9; చమీర నాటౌట్ 6; ఫెర్నాండో నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 236.**

వికెట్ల పతనం: 1–41, 2–70, 3–81, 4–99, 5–121, 6–212, 7–221, 8–230. **బౌలింగ్:** భువనేశ్వర్ 10–0–53–0; బుమ్రా 10–2–43–4; చాహల్ 10–1–43–2; పాండ్యా 5.2–0–24–1; అక్షర్ 10–0–30–1; జాదవ్ 4.4–0–32–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ ఎల్బీడబ్ల్యు (బి) ధనంజయ 54; ధావన్ (సి) మాథ్యూస్ (బి) సిరివర్ధన 49; రాహుల్ (బి) ధనంజయ 4; జాదవ్ (బి) ధనంజయ 1; కోహ్లి (బి) ధనంజయ 4; ధోని నాటౌట్ 45; పాండ్యా (స్టంప్డ్) డిక్‌వెల్లా (బి) ధనంజయ 0; అక్షర్ ఎల్బీడబ్ల్యు (బి) ధనంజయ 6; భువనేశ్వర్ నాటౌట్ 53; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (44.2 ఓవర్లలో ఏడు వికెట్లకు) 231.**

వికెట్ల పతనం: 1–109, 2–113, 3–114; 4–118, 5–119, 6–121, 7–131. **బౌలింగ్:** మలింగ 8–0–49–0; ఫెర్నాండో 6.2–0–32–0; మాథ్యూస్ 3–0–11–0; చమీర 7–0–45–0; ధనంజయ 10–0–54–6; సిరివర్ధన 10–0–39–1.

సింధు శ్రమించి...



సింధు

- క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్
- శ్రీకాంత్, సైనా ముందుకు.. సాయి ప్రణీత్ అవుట్
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

సింధు ప్రిక్వార్టర్స్ ప్రత్యర్థి ఎన్గాన్ యి చెయుంగ్. ఈ హాంకాంగ్ అమ్మాయిపై గతంలో మూడు సార్లు అలవోక విజయం సాధించిన రికార్డు సింధుది. ఆమె ఫామ్ దృష్ట్యా ఈసారి కూడా అదే ఫలితమని భావించినా... మ్యాచ్ మాత్రం మరోలా సాగింది. ఎన్గాన్ పట్టుదలగా ఆడటంతో మ్యాచ్ తుదికంటా హోరాహోరీగా సాగింది. తొలి గేమ్‌ను కోల్పోయిన సింధు ఒక దశలో రెండో గేమ్‌లోనూ వెనుకబడింది. చివరకు తన అనుభవాన్నంతా రంగరించి మ్యాచ్‌లో నిలిచిన తెలుగమ్మాయి, మూడో గేమ్ విజయంతో గట్టెక్కింది.

గ్లాస్గో: అలవోకగా గెలుస్తుందనుకున్న మ్యాచ్‌లో పీవీ సింధు ఆపసోపాలు పడింది. సులువైన ప్రత్యర్థితో తలపడుతూ కూడా ఓటమి దిశగా వెళ్లినట్లు కనిపించింది. అయితే చివరకు తన అసలు సత్తాను ప్రదర్శించి కీలక సమరంలో విజయాన్ని అందుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్ ఫైనల్లో సింధు 19–21, 23–21, 21–17తో ఎన్గాన్ యి చెయుంగ్ (హాంకాంగ్)పై గెలిచి ఊపిరి పీల్చుకుంది. మరో వైపు సైనా నెహ్వాల్ అలవోక విజయంతో క్వార్టర్స్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 13వ సీడ్ అజయ్ జయరామ్, 15వ సీడ్ భమిడిపాటి సాయి ప్రణీత్ ప్రిక్వార్టర్స్‌లోనే నిష్క్రమించారు. అజయ్ 11–21, 10–21తో ఐదో సీడ్ చెన్ లాంగ్ చేతిలో పరాజయం చవిచూడగా, సాయిప్రణీత్ 21–19, 10–21, 12–21తో ఆరో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో కంగు తిన్నాడు.



శ్రీకాంత్

ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో నాలుగో సీడ్ సింధు ప్రతీ పాయింట్ కోసం శ్రమించాల్సివచ్చింది. 13వ సీడ్ ఎన్గాన్ ఆరంభం నుంచి పట్టుబిగించడంతో పోటాపోటీగా సాగిన తొలి గేమ్‌ను హాంకాంగ్ ప్లేయర్ వశం చేసుకుంది. ఇక రెండో గేమ్‌లోనూ తన దూకుడు పెంచడంతో సింధు 13–16తో వెనుకంజలో నిలిచింది. ఈ దశలో సర్వశక్తులు ఒడ్డి నాలుగు పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి వచ్చింది. ఐతే చెయుంగ్ కూడా దీటుగా పాయింట్లు సాధిస్తుండటంతో ఉత్కంఠ పెరిగింది చివరకు 21–21 వద్ద వరుసగా రెండు పాయింట్లు సాధించిన సింధు గేమ్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్ స్వరూపాన్ని అర్థం చేసుకున్న హైదరాబాదీ స్టార్ నిర్ణాయక మూడో గేమ్‌లో మొదటి నుంచి జాగ్రత్తగా ఆడింది. నెట్ వద్ద చురుగ్గా స్పందించిన ఆమె స్మాష్‌లతో రాణించింది. 5–1తో టచ్‌లోకి వచ్చిన ఆమె 12–8 స్కోరు వరకు ఆధిక్యంలోనే ఉంది. ఈ దశలో ఎన్గాన్ వరుసగా 4 పాయింట్లు చేసి 12–12తో స్కోరును సమం చేసింది. దీనికి దీటుగా బదులిచ్చిన సింధు వరుసగా మూడు పాయింట్లు చేసి జోరు పెంచింది. 21–17తో గేమ్‌ను, మ్యాచ్‌ను గెలిచింది. మరో ప్రి క్వార్టర్స్‌లో 12వ సీడ్ సైనా 21–19, 21–15తో రెండో సీడ్ సుంగ్ జీ హున్ (కొరియా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.



సైనా

పురుషుల ప్రిక్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ 21–14, 21–18తో 14వ సీడ్ ఆండర్స్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)పై విజయం సాధించాడు. వరుస గేముల్లో 42 నిమిషాల్లో ప్రత్యర్థిని చిత్తు చేశాడు. తొలి గేమ్ ఆరంభంలో కాసేపు మాత్రమే పోటీనిచ్చిన డెన్మార్క్ ఆటగాడు ఆ తర్వాత తేలిగ్గానే చేతులెత్తేశాడు. 5–6తో ఉన్న శ్రీకాంత్ వరుసగా 6 పాయింట్లు సాధించి 11–6తో ఆధిక్యంలోకి వచ్చాడు ఆ తర్వాత వెనుదిరిగి చూసే అవకాశం రాని హైదరాబాద్ ఆటగాడు నిమిషాల వ్యవధిలో గేమ్‌ను ముగించాడు. తర్వాత రెండో గేమ్‌లో రెట్టించిన ఉత్సాహాన్ని కనబరిచిన అతను 11–3తో ఆధిపత్యాన్ని చాటాడు. అయితే ఆంటోన్‌సెన్ వరుసగా ఆరు పాయింట్లు సాధించి నిలువరించే ప్రయత్నం చేసినా... శ్రీకాంత్ నెట్‌వద్ద తెలివిగా ఆడి పైచేయి కొనసాగించాడు. చివరి దాకా ఆధిక్యంలోనే నిలిచిన ఈ ప్రపంచ పదో ర్యాంకర్ 21–18తో గేమ్‌ను మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో 15వ సీడ్ సిక్కిరెడ్డి- ప్రణవ్ చోప్రా ద్వయం 22–20, 18–21, 18–21తో ఆరో సీడ్ డెబ్బి సుశాంటో–ప్రవీణ్ జోర్డాన్ జంట చేతిలో ఓడింది.

పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్... టాప్‌సీడ్ సన్ వాన్ హో (కొరియా)తో, మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు... ఐదో సీడ్ సన్ యూ (చైనా)తో, గిల్మోర్ (స్కాట్లాండ్), బింగ్ జియావో (చైనా) మ్యాచ్ విజేతతో సైనా తలపడుతుంది.

సాక్షి, వినేశ్ కూడా అవుట్

పారిస్: ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్ (60 కేజీలు), వినేశ్ ఫొగట్ (48 కేజీలు) కూడా ఈ మెగా ఈవెంట్‌లో ఆకట్టుకోలేకపోయారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్ బౌట్‌లలో సాక్షి 1–3తో ల్యూసా నైమెష్ (జర్మనీ) చేతిలో పరాజయం పాలవ్వగా, వినేశ్‌పై విక్టోరియా ఆంథోని (అమెరికా)పైచేయి సాధించింది. వీరితో పాటు శీతల్ తోమర్ (53 కేజీలు), నవ్‌జ్యోత్ కౌర్ (69 కేజీలు) కూడా టోర్నీ నుంచి నిష్క్రమించారు. పెద్దగా అంచనాల్లేకుండా బరిలోకి దిగిన శీతల్ ప్రిక్వార్టర్స్‌లో 10–0తో గెలుపొంది, క్వార్టర్స్‌లో 2–4తో ఎస్టేరా డోబ్రె (రొమేనియా) చేతిలో ఓడిపోయింది. నవ్‌జ్యోత్ కౌర్ 5–10తో ఆకిర్బాట్ నసన్‌బుర్మా (మంగోలియా) చేతిలో ఓడిపోయి ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. ఇక భారత్ పతక ఆశలన్నీ ఆసియన్ చాంపియన్ బజ్‌రంగ్ పూనియా (65కేజీలు), ఒలింపియన్ సందీప్ తోమర్ (57 కేజీలు)లపైనే ఉన్నాయి.

ఐపీఎల్ బిడ్డింగ్ బరిలో ఎయిర్‌టెల్, యాహూ

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) డిజిటల్ హక్కుల కోసం టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్, వెబ్ సర్వీస్ ప్రొవైడర్ యాహూ బరిలోకి దిగాయి. ఈ మేరకు ఐపీఎల్ బిడ్ డాక్యుమెంట్‌ను ఎయిర్‌టెల్, యాహూ కొనుగోలు చేసినట్లు బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. వీటితో పాటు మరో రెండు కొత్త కంపెనీలు బామ్‌టెక్, డీఏజడ్‌ఎన్/ పర్ఫామ్ గ్రూప్ కూడా ఆన్‌లైన్ హక్కుల కోసం పోటీపడుతున్నాయని ఆయన చెప్పారు.

నేటి నుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్

హాంబర్గ్: ప్రతిష్టాత్మక ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు రంగం సిద్ధమైంది. నేటి నుంచి పది రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు భారత బాక్సర్లు సిద్ధమయ్యారు. భారత్ తరపున అమిత్ సాంగ్వాన్ (49 కేజీలు), కవీందర్ బిష్త్ (52 కేజీలు), గౌరవ్ బిధురీ (56 కేజీలు), శివ థాపా (60 కేజీలు), మనోజ్ కుమార్ (69 కేజీలు), వికాస్ కృషన్ (75 కేజీలు), సుమిత్ సాంగ్వాన్ (91 కేజీలు), సతీశ్ (+ 91 కేజీలు) బరిలోకి దిగనున్నారు. ఇప్పటివరకు ఈ మెగా టోర్నీలో విజేందర్ సింగ్ (2009), వికాస్ (2011), శివ (2015) మాత్రమే కాంస్యాలను సాధించారు.

మళ్లీ ఓడిన టైటాన్స్


ప్రొ కబడ్డీ లీగ్

లక్నో: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ మళ్లీ నిరాశపరిచింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 23–25 స్కోరుతో యూపీ యోధ చేతిలో పరాజయం చవిచూసింది. ఈ లీగ్‌లో 11 మ్యాచ్‌లాడిన తెలుగు జట్టుకిది ఎనిమిదో ఓటమి. గత మ్యాచ్‌లో యు ముంబాపై అద్భుత విజయాన్ని సాధించిన టైటాన్స్ ఈ మ్యాచ్‌లోనూ పోరాడింది. అయితే ప్రత్యర్థి రైడర్ల జోరు ముందు తలవంచింది. రైడింగ్‌లో రాహుల్ చౌదరి విఫలమయ్యాడు. 23 సార్లు రైడింగ్‌కు వెళ్లిన రాహుల్ కేవలం 4 పాయింట్లే చేశాడు. ఓవరాల్‌గా అతను 6 పాయింట్లు సాధించాడు. మిగతా వారిలో ఫర్హాద్ మిలగర్దన్ 4, సోంబిర్ 3 పాయింట్లు చేశారు. యోధ తరపున నితిన్ తోమర్ (6), నితీశ్ కుమార్ (5) కీలక పాయింట్లు సాధించారు. సురేందర్ సింగ్, జీవ కుమార్ చెరో 4 పాయింట్లు చేశారు. నేడు (శుక్రవారం) జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబాతో జైపూర్ పింక్‌పాంథర్స్, బెంగాల్ వారియర్స్‌తో పట్నా పైరేట్స్ తలపడతాయి.



బీసీసీఐ ఓ పురుషాధిక్య సంస్థ

- మహిళల ఘనతని జీర్ణించుకోవట్లేదు
- ఎడుల్జీ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: క్రికెట్ బోర్డు పరిపాలన కమిటీ (సీఓఏ) సభ్యురాలు, మాజీ సారథి డయానా ఎడుల్జీ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)పై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీసీఐ ఓ పురుషాధిక్య సంస్థ అని, మహిళల ఘన విజయాల్ని, ఘనతల్ని బోర్డు పాలకులు జీర్ణించుకోవడం లేదని విమర్శించారు. ఇంగ్లండ్‌లో జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో మిథాలీ సేన రన్నరప్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'బీసీసీఐని విమర్శించేందుకు నేనెప్పుడూ వెనుకాడలేదు. 2006లో మహిళల సంఘం అందులో విలీనమైనప్పటి నుంచి నేను గమనిస్తూనే ఉన్నా. మహిళల క్రికెట్ అంటే వారికెప్పుడు చిన్నచూపే. కొందరు బోర్డు పెద్దలకు మహిళల క్రికెట్ అంటే గిట్టదు. వారి ఘనతలు పట్టవు' అని వ్యాఖ్యానించింది. '2011లో బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్. శ్రీనివాసన్ ఎన్నికయ్యారు. వాంఖడే స్టేడియంలో ఆయనకు శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్లిన నాకు ఆయన మాటల్లో పురుషాహంకారం కనబడింది. నేనైతే మహిళల క్రికెట్‌ను ఇంతదాకా రానిచ్చేవాడినే కాదని శ్రీనివాసన్ చెప్పడం నన్ను బాధించింది' అని ఎడుల్జీ వివరించారు.



కాణిపాకం ఆలయం ముఖచిత్రం (ఇన్‌సెట్‌లో) వరసిద్ధి వినాయకుడి నమూనా విగ్రహం

రేపటి నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు

కాణిపాకం: చిత్తూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. అలాగే వినాయక చవితి సందర్భంగా లక్షలాదిగా విచ్చేసే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 21 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో రోజూ ఒక వాహనంపై సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయకస్వామి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. శుక్రవారం వేకువజామున అభిషేకం అనంతరం స్వామివారు చందనాలంకారంతో భక్తులకు దర్శనమిస్తారని దేవస్థానం ఈవో పి.పూర్ణచంద్రరావు తెలిపారు. దేవస్థానం నిత్య అన్నదాన కేంద్రంలో రోజూ రెండు వేల మందికి, ఉభయదాతలు అన్నదాన కేంద్రంలో మరో రెండు వేల మందికి అన్న ప్రసాదాల పంపిణీ ఉంటుందన్నారు. రోజూ లక్ష మందికి పైగా భక్తులు రానున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థను కట్టుదిట్టం చేసినట్లు వివరించారు.


ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు కమిటీ

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు సంబంధించి గురువారం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి మానవ వనరుల శాఖ మంత్రి చైర్మన్‌గా, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వైస్ చైర్మన్‌గా, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, రాజమండ్రి ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉంటారు.

కోస్తాలో నేడు భారీ వర్షాలు

రాయలసీమలో బలపడిన నైరుతి రుతుపవనాలు: ఐఎండీ

సాక్షి, అమరావతి/ విశాఖ సిటీ: రాబోయే 24 గంటల్లో (శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు) కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. రాయలసీమలో నైరుతి రుతుపవనాలు అత్యంత క్రియాశీలకంగా మారాయి. ఈశాన్య బంగాళాఖాతం, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం గురువారం రాత్రి ఉత్తర కోస్తా తీరం, పరిసర ప్రాంతాలకు చేరింది. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకూ ఉపరితల ఆవర్తనం విస్తరించింది. మరో ఉపరితల ఆవర్తనం కోస్తాంధ్ర పరిసర ప్రాంతాల్లో ఏర్పడింది. ఇది సముద్ర మట్టానికి 3.6 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తువరకూ ఆవరించింది. ఉపరితల ద్రోణి ఉత్తర ఒడిశా నుంచి రాయలసీమ, కోస్తాంధ్ర మీదుగా కదులుతోంది. వీటి ప్రభావంవల్ల వచ్చే 24 గంటల్లో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని గురువారం ఐఎండీ తెలిపింది. తదుపరి 3 రోజులపాటు కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. రాయలసీమలో తేలికపాటి వానలు పడతాయని పేర్కొంది. కాగా, గడిచిన 24 గంటల్లో నెల్లూరు జిల్లా రాపూరు, వైఎస్సార్ జిల్లా రాయచోటి, కమలాపురంలో 7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కోడూరు, తిరుమలలో 6 సెం.మీ, తడ, కారంచేడు, తిరుపతి, మదనపల్లె, పాకాల, పలమనేరు, చిత్తూరు, వల్లూరులో 5 సెం.మీ వర్షం కురిసింది.



గోధుమ మొలకల గణపతి..

కవిటి: వినాయక చవితిని పురస్కరించుకుని ఓ శిల్పి గోధుమ మొలకలతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం బొరివంక గ్రామానికి చెందిన ఉద్దానం యూత్ క్లబ్ సభ్యుడు, శిల్పి బైరి తిరుపతిరావు ప్రతి ఏటా వినూత్నంగా వినాయకుడి విగ్రహాన్ని రూపొందిస్తారు. ఈసారి కూడా గోధుమ మొలకలతో గణేశుడి విగ్రహాన్ని తయారు చేసి తన ప్రత్యేకను చాటుకున్నారు. గోధుమలు మానవులకు ఎన్నో విధాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పది అడుగుల వినాయకుడి ప్రతిమను తయారు చేసేందుకు 40 కిలోల గోధుమల మొలకలను, మట్టి, ఎండుగడ్డిని వినియోగించినట్టు తెలిపారు. ఇందులో ఎటువంటి రసాయన రంగులు వినియోగించలేదని తిరుపతిరావు పేర్కొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

సాక్షి బిజినెస్
శుక్రవారం 25-8-2017
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
28 ▲	5 ▲
31,596	9,857

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండూ రాత్రి 11:30కి)


సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,267	▽	11
డోజోన్స్	21,808	▽	4
ఎఫ్‌టీఎస్ఈ 100	7,407	▲	24
డాక్స్	12,181	▲	7
షాంఘై	3,272	▽	16
నికాయ్	19,354	▽	81

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.25	64.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	80.49	83.27
€	యూరో	ఎస్‌బీఐ	74.32	76.94
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.66	59.68
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.65	51.62
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.34	47.83
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.50	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.86	18.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.81	11.04

ఇన్ఫీ @ నీలేకని



మళ్లీ సొంతగూటికి... చైర్మన్‌గా పగ్గాలు

- ప్రస్తుత చైర్మన్ శేషసాయి, కో-చైర్మన్ రవి రాజీనామా
- బోర్డు నుంచి కూడా తప్పుకున్న విశాల్ సిక్కా
- స్వతంత్ర డైరెక్టర్లుగా వైదొలిగిన జెఫ్రీ, జాన్
- కొత్త సీఈవో కోసం కొనసాగనున్న అన్వేషణ

న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా వ్యవస్థాపకులు, బోర్డుకు మధ్య విభేదాలతో నలిగిపోయిన ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కి కాస్త ఊపిరి తీసుకునే అవకాశం దొరికింది. సంక్షోభ పరిస్థితులకు తెరదించుతూ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సొంత గూటికి మళ్లీ తిరిగొచ్చారు. ఇతర సహ వ్యవస్థాపకులు, ఇన్వెస్టర్ల ఒత్తిడికి తలొగ్గి కంపెనీ కొత్త చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు అంగీకరించారు. ఇప్పటిదాకా చైర్మన్‌గా ఉన్న ఆర్.శేషసాయి స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టరుగా కూడా వ్యవహరిస్తారు. గురువారం బోర్డు సమావేశం అనంతరం ఇన్ఫోసిస్ పలు కీలక నిర్ణయాలు ప్రకటించింది. రవి వెంకటేశన్ సహ-చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన ఇకపై స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగుతారు. ఇక గతవారం సీఈవో పదవికి రాజీనామా చేసినా.. వారసుడి ఎంపిక దాకా వైస్-చైర్మన్‌గా కొనసాగుతున్న విశాల్ సిక్కా.. తాజాగా బోర్డు నుంచి కూడా తప్పుకున్నారు. మరో ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లు జెఫ్రీ ఎస్ లేమాన్, జాన్ ఎచ్‌మెండీ కూడా బోర్డు నుంచి వైదొలిగారు. ఆయా అధికారుల రాజీనామాలను ఆమోదించినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఈ మార్పులు తక్షణం అమల్లోకి వచ్చినట్లు కంపెనీ తెలిపింది. తాత్కాలిక సీఈవోగాను, ఎండీగాను యూబీ ప్రవీణ్ రావు కొనసాగుతారు. పూర్తి స్థాయి కొత్త సీఈవో కోసం అన్వేషణ కొనసాగనుంది. తాజా పరిణామాలను వివరించేందుకు ఆగస్టు 25న (ఇవాళ) ఇన్వెస్టర్లతో సమావేశం అవుతున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది.

కార్పొరేట్ గవర్నెన్స్ లోపించిందని, ఇన్ఫోసిస్ ప్రక్షాళన జరగాలంటూ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తి తదితరుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యవస్థాపకులు పదే పదే తనను టార్గెట్ చేసుకుంటున్నారని పరోక్షంగా ఆరోపిస్తూ సిక్కా అర్ధంతరంగా సీఈవో పదవికి గత వారం రాజీనామా చేసినప్పటి నుంచి ఇన్ఫీ పరిణామాలు రోజుకో మలుపు తిరుగుతున్న సంగతి తెలిసిందే. చైర్మన్‌గా నీలేకని నియామకం వార్తలతో అమెరికా నాస్‌డాక్‌లో ఇన్ఫోసిస్ ఏడీఆర్ 0.74 శాతం ఎగిసింది. 14.93 డాలర్ల దగ్గర ట్రేడవుతోంది.

> ఇన్ఫీ సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకని 2002-2007 మధ్య కాలంలో సంస్థ సీఈవోగా పనిచేశారు. ఆ తర్వాత విశిష్ట గుర్తింపు కార్డుల ప్రాధికార సంస్థ ఆధార్‌కు సారథ్యం వహించేందుకు 2008లో వైదొలిగారు. నీలేకని సీఈవోగా వ్యవహరించిన 2002 మార్చి 2007 ఏప్రిల్ మధ్య కాలంలో ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాప్ ఏకంగా 374 శాతం ఎగిసింది. పరిశ్రమను మించిన పనితీరు కనపర్చింది. అమ్మకాలు 40%, లాభాలు వార్షికంగా 37 శాతం మేర వృద్ధి చెందాయి.

నెలలుగా సంక్షోభం..

ఆరేడు నెలలుగా ఇన్ఫీలో సంక్షోభం చెలరేగుతోంది. సహవ్యవస్థాపకులు.. ముఖ్యంగా నారాయణ మూర్తికి, బోర్డుకు మధ్య విభేదాలు అంతకంతకూ ముదిరాయి. ఇజ్రాయెల్ సంస్థ పనయా కొనుగోలు వ్యవహారం మొదలు అనేక అంశాల్లో కార్పొరేట్ గవర్నెన్స్ లోపించిందంటూ మూర్తి పలు సందర్భాల్లో బోర్డును తప్పుపట్టారు. బోర్డు, మూర్తి మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం బహిరంగంగానే కొనసాగింది. ఈ పరిణామాల నడుమ.. ఇన్ఫీ చరిత్రలో సీఈవోగా నియమితుడైన తొలి వ్యవస్థాపకయేతర వ్యక్తి విశాల్ సిక్కా ఆగస్టు 18న రాజీనామా చేశారు. అసలు బాధ్యతలపై దృష్టి పెట్టనివ్వకుండా తనపై వ్యక్తిగత ఆరోపణలు పెరిగిపోతుండటం ఇందుకు కారణంగా ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. సిక్కా రాజీనామాకు వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తి నిరంతరాయంగా ఆరోపణలు గుప్పిస్తుండటమే కారణమంటూ ఇన్ఫోసిస్ బోర్డు.. స్టాక్ ఎక్స్చేంజీలకు రాసిన ఈ-మెయిల్‌లో ఆరోపించింది. ఈ పరిణామంపై మండిపడిన నారాయణమూర్తి.. బోర్డు ఆరోపణలు ఖండించారు. ఇన్వెస్టర్లతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు మూర్తి ప్రకటించినప్పటికీ.. అది వాయిదా పడింది. సిక్కా రాజీనామా అనంతరం నీలేకనికి బాధ్యతలు అప్పగించాలంటూ ఇన్వెస్టర్లతో పాటు ఇన్ఫీలో గతంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన పలువురు మాజీ సిబ్బంది నుంచి కూడా డిమాండ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో నీలేకని తిరిగి వెనక్కి రావడానికి అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సిక్కాతో తెగదెంపులు..

నందన్ నీలేకని తిరిగి రావడం ఖరారైన నేపథ్యంలో ఇన్ఫోసిస్.. సిక్కాతో సంబంధాలు పూర్తిగా తెగదెంపులు చేసుకోనుంది. కాంట్రాక్టు ప్రకారం ఆయనకు ఇవ్వాల్సిన పరిహారాన్ని చెల్లించేయనున్నట్లు ఒక ప్రకటనలో వివరించింది. ఆయనకు 90 రోజులకి సంబంధించి బేస్ పేతో పాటు ఉద్యోగులకు లభించే ప్రయోజనాలన్నీ కల్పిస్తామని పేర్కొంది. ఇప్పటిదాకా షేర్ల రూపంలో ఆయనకు రావాల్సిన బకాయిలను కూడా చెల్లించనున్నట్లు వివరించింది.

సొంతగూటికి రాక సంతోషం: నీలేకని

ఇన్ఫోసిస్‌కి మళ్లీ తిరిగిరావడం సంతోషంగా ఉంది. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నాను. క్లయింట్లు, షేర్‌హోల్డర్లు, ఉద్యోగులు మొదలైన వారందరికీ ప్రయోజనాలు చేకూర్చేలా వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా బోర్డులోని నా సహచర సభ్యులతో కలసి పనిచేస్తాను. గడిచిన మూడేళ్లుగా సీఈవోగా సేవలు అందించిన విశాల్‌కి కృతజ్ఞతలు. ఆయన భవిష్యత్‌లో చేపట్టే వాటిల్లోనూ రాణించాలని కోరుకుంటున్నాను.



స్వాగతిస్తున్నా..: విశాల్ సిక్కా

నందన్ నీలేకని నియామకాన్ని స్వాగతిస్తున్నా. బాధ్యతల బదలాయింపు జరిగే వరకూ బోర్డులో కొనసాగుతానని గతంలో చెప్పా. దానికి అనుగుణంగానే ఇప్పుడు ఆయన రాకతో తక్షణం వైదొలుగుతున్నా. నందన్ సమర్థుడైన నాయకుడు. ఇన్ఫోసిస్ కొత్త శిఖరాలు అధిరోహించేలా మార్గనిర్దేశం చేసే దిశగా నీలేకని నియామకాన్ని స్వాగతిస్తున్నా. ఆయనతో పాటు ప్రవీణ్, ఇతర ఇన్ఫోసియన్లు మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తూ.. శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

సమర్థ నాయకుడు నీలేకని..: శేషసాయి



ఇన్ఫోసిస్‌ను వృద్ధి పథంలో నడిపించేందుకు నీలేకని సమర్థుడైన నాయకుడు. భవిష్యత్తు వ్యూహాలపై కంపెనీ దృష్టి పెట్టేందుకు ఆయన నియామకం దోహదపడగలదు. నీలేకని సారథ్యంలో కంపెనీ మేనేజ్‌మెంట్ బృందం సమిష్టిగా పనిచేసి.. ఇన్ఫోసిస్‌ను పరిశ్రమలో అగ్రస్థానానికి చేర్చగలదనడంలో సందేహం లేదు.

ఎంట్రీ-1... ఎగ్జిట్-5



శేషసాయి, చైర్మన్ | రవి వెంకటేశన్, సహ - చైర్మన్ | విశాల్ సిక్కా, సీఈఓ-ఎండీ | జెఫ్రీ లేమాన్, స్వతంత్ర డైరెక్టర్ | జాన్ ఎచ్‌మెండీ, స్వతంత్ర డైరెక్టర్

ఎయిరిండియా ఆస్తుల విక్రయం షురూ!

వివిధ నగరాల్లోని ఫ్లాట్లు, స్థలాలు, భవంతులకు ఈ-వేలం

- బిడ్ల దాఖలుకు ఆఖరు తేదీ వచ్చేనెల 6
- రూ.500 కోట్లు లభిస్తాయని అంచనా



ముంబై: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా... దేశవ్యాప్తంగా తనకున్న ఆస్తుల్లో కొన్నింటిని అమ్మకానికి పెట్టింది. ఎయిరిండియాకు దేశమంతటా విపరీతమైన ఆస్తులున్న నేపథ్యంలో... వాటిని విక్రయించి సంస్థకున్న అప్పుల్లో కొన్నిటిని తీర్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం తెలిసిందే. ఆ తరువాత ఆస్తులు మినహా ఎయిరిండియా విమానాలను, బ్రాండ్‌ను, కార్యకలాపాలను ఏదో ఒక కంపెనీకి విక్రయించే అవకాశమున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలిచ్చింది. ఇందులో భాగంగానే ఆస్తుల విక్రయం మొదలైనట్లు భావిస్తున్నారు. సంస్థకు పుణె, అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై, తిరువనంతపురం, గోవా, లక్నో, గ్వాలియర్, గుర్గావ్, భుజ్ ప్రాంతాల్లో ఉన్న 27 రెసిడెన్షియల్ ఫ్లాట్లు, విల్లాలు, కమర్షియల్ ప్లాట్లు, స్థలాలు, ఆఫీసు భవంతులను తాజాగా అమ్మకానికి పెట్టారు. ఈ విక్రయం ద్వారా కనీసం రూ. 500 కోట్లు సమకూరుతాయని సంస్థ భావిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ ఈ ఆస్తులకు ఈ-వేలం నిర్వహించనుండగా... బిడ్ల దాఖలుకు చివరి తేదీని సెప్టెంబర్ 6గా నిర్ణయించారు. కంపెనీని పునరుద్ధరించే ప్రయత్నాల్లో భాగంగా ఇప్పటికే ఎయిరిండియాలో వాటాల ఉపసంహరణ ప్రక్రియకు కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదముద్ర వేసింది. దీనిపై ప్రస్తుతం ఆర్థిక మంత్రి జైట్లీ సారథ్యంలోని మంత్రుల బృందం కసరత్తు చేస్తోంది. 2017 మార్చి ఆఖరుకి ఎయిరిండియా మొత్తం రుణభారం రూ.48,879 కోట్లు. గతేడాది కంపెనీ నికర నష్టం రూ. 3,643 కోట్లకు తగ్గగా.. నిర్వహణ లాభం రూ. 300 కోట్లుగా నమోదైంది.

మరో కింగ్‌ఫిషర్‌లా కానివ్వం: మంత్రి అశోక్

ఎయిరిండియాను మరో కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌లా మారనివ్వబోమని పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక గజపతి రాజు స్పష్టం చేశారు. ఉద్యోగులను ఇంటికి పంపాలని తాము కోరుకోవడం లేదన్నారు.

నేడే మార్కెట్‌లోకి రూ.200 నోట్లు

రిజర్వ్ బ్యాంక్ ప్రకటన

- ప్రకాశవంతమైన పసుపు రంగులో...
- స్వచ్ఛ భారత్ లోగో, అశోక స్తంభం, సాంచీ స్థూపాలకు చోటు



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అందరికీ షాకిచ్చింది. తొలిసారిగా రూ.200 నోట్లను శుక్రవారం నుంచే మార్కెట్‌లోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించింది. తక్కువ డినామినేషన్ కరెన్సీకి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని రూ.200 నోట్లను వెంటనే చెలామణిలోకి తీసుకువస్తున్నట్లు పేర్కొంది. ఈ కొత్త నోట్లు ప్రకాశవంతమైన పసుపు రంగులో ఉంటాయి. 'ఆగస్టు 25 శుక్రవారం రోజున రూ.200 నోట్లను మార్కెట్‌లోకి తెస్తున్నాం. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకం కలిగిన ఈ నోట్లు మహాత్మా గాంధీ నూతన సిరీస్‌లో ఉంటాయి' అని బ్యాంక్ తాజా ప్రకటనలో తెలిపింది. కొత్త రూ.50 నోట్లపై హంపీ రథం మాదిరిగానే ఈ రూ.200 నోట్లపై కూడా భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా సాంచీ స్థూపం ఉంటుందని పేర్కొంది. ఇక నోటుకు ఒకవైపు మహాత్మా గాంధీ ఫోటో, అశోక స్తంభం చిహ్నం.. మరొకవైపు స్వచ్ఛభారత్ లోగో, సాంచీ స్థూపం వంటివి ఉంటాయని వివరించింది.

ఎక్కడ లభ్యమవుతాయి?

వాస్తవానికి రూ.200 నోట్లు అందరికీ ఏటీఎంల ద్వారానే అందుబాటులోకి రావాల్సి ఉంది. కాకపోతే ఈ నోట్లను పంపిణీ చేయడానికి వీలుగా ఏటీఎంలను రీక్యాలిబరేషన్ చేయాల్సి ఉంది. అప్పటి దాకా వీటిని ఇతర రూ.50, 20, 10 నోట్ల మాదిరిగా బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారానే పంపిణీ చేయనున్నట్లు ఆర్‌బీఐ వర్గాలు తెలియజేశాయి.

బ్యాంకుల విలీనమే.. మందు!!

- అసెట్ క్వాలిటీ కష్టాలకు చెక్ ● ప్రభుత్వ రంగంలో పటిష్టమైన బ్యాంకుల ఆవిర్భావం
- ప్రతికూలతల కన్నా ప్రయోజనాలే అధికం ● అనువుగా పీఎన్‌బీ, కెనరా తదితర బ్యాంకులు

సాక్షి, బిజినెస్ విభాగం

ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీన ప్రక్రియలను వేగవంతం చేస్తూ కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు బ్యాంకింగ్ రంగంలో చర్చనీయమవుతున్నాయి. ఓ వైపు సంస్కరణలను వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలతో తమ నిరసన తెలియజేస్తున్నప్పటికీ... మరోవైపు కేంద్రం మాత్రం విలీనాల దిశగా చర్యలు తీసుకుంటూనే ఉంది. ఇందుకోసం ప్రత్యామ్నాయ యంత్రాంగం (ఏఎం) ఏర్పాటుకు కేంద్రం ఆమోదముద్ర కూడా వేసింది. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వివరణిస్తూ... విలీనానికి వాణిజ్యపరమైన ప్రయోజనాలే ప్రాతిపదికగా ఉంటాయని, ఆయా బ్యాంకుల బోర్డులే మెర్జర్ల ప్రతిపాదనలను ముందుకు తేవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బ్యాంకు ఉద్యోగుల సంఘాలు పీఎస్‌బీల విలీనాలను వ్యతిరేకిస్తున్నప్పటికీ.. చిన్న స్థాయిలోనే మిగిలిపోతున్న పలు పీఎస్‌బీలకు విలీనాలు ప్రయోజనకరమే అంటున్నారు విశ్లేషకులు. నిధుల సమీకరణ వ్యయాలు తక్కువ స్థాయిలో ఉంచుకుంటూ.. లాభదాయకంగా ఉంటే భారీ, పటిష్ట బ్యాంకుల ఏర్పాటే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని వారు చెబుతున్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో అసెట్ క్వాలిటీ సమస్యల గురించి అందరికీ తెలిసినవే కాబట్టి... ప్రత్యామ్నాయ యంత్రాంగం (ఏఎం) ఏర్పాటు ప్రకటన సమయం గురించి పెద్దగా సందేహించాల్సిన అవసరం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రాతిపదికలు ఇవే కావొచ్చు..

అనలిస్టుల అభిప్రాయం ప్రకారం ప్రాంతీయంగా ఆయా పీఎస్‌బీలకి ఉన్న పట్టు.. క్యాపిటల్ అడెక్వసీ నిష్పత్తి, ఆదాయాల వృద్ధి తదితర అంశాలే విలీనాలకు ప్రాతిపదిక కావచ్చు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ మొదలైనవి విలీనాలకు శ్రీకారం పలికే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ బ్యాంకులకు తమ తమ ప్రాంతాల్లో గట్టి పట్టు ఉండటం.. విలీన ప్రతిపాదనకు ఊతమిస్తోంది. గడిచిన ఆరు నెలలు, ఏడాది కాలంలో ఏదో ఒక సందర్భంలో విలీనాలకు తాము అనుకూలమేనని ప్రకటించడమే కాక రైట్స్ ఇష్యూ తదితర మార్గాల్లో సొంతంగా వనరులు సమకూర్చుకునే సామర్థ్యాన్ని కూడా ఇవి చాటుకున్నాయి. విలీన ప్రక్రియపై కొంత మేర అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) కూడా బరిలో ఉండగలదని అంచనా. ప్రస్తుతానికి ఇవన్నీ కూడా మెర్జర్‌కి అనువైన బ్యాంకులుగానే కనిపిస్తున్నప్పటికీ.. విలీనాలకు సంబంధించి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు మరింత మూలధనం అవసరం అవుతుందని ఓ బ్రోకరేజి సంస్థకు చెందిన ఈక్విటీస్ విభాగం హెడ్ చెప్పారు. ఇక ఇండియన్ బ్యాంక్ మెరుగ్గానే ఉన్నప్పటికీ.. విలీనాల బరిలో దూకేంత పెద్ద బ్యాంకు కాదని పేర్కొన్నారు.



ప్రధాన కారణాలు ఏంటంటే...

విలీనాలకు ప్రధానంగా రెండు కారణాలు చూపుతున్నారు. కరెంటు అకౌంటు, సేవింగ్ అకౌంటు (కాసా) నిష్పత్తి తక్కువగా ఉండటం ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రధానమైన బలం. కాసా డిపాజిట్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు 34% వాటా ఉంటే.. ప్రైవేట్ బ్యాంకులకు 30% ఉంది. ఇక బ్యాంకుల్లో జరిగే డిపాజిట్లలో సుమారు 70% వాటా పీఎస్‌బీలదే. ఇప్పుడిప్పుడే ప్రైవేట్ బ్యాంకులు పుంజుకుంటున్నప్పటికీ.. పీఎస్‌బీల్లోకి వచ్చి పడే డిపాజిట్ల పరిమాణం భారీగానే ఉంటోంది. గతేడాది పెద్ద నోట్ల రద్దు సమయంలో ఇది మరోసారి సుస్పష్టంగా కనిపించింది. పొదుపు ఖాతాలపై వడ్డీ రేటు కోతతో.. డిపాజిట్లు తరలిపోకుండా తమ దగ్గరే అట్టే పెట్టుకోవడానికి కూడా పీఎస్‌బీలకు విలీనాలు తప్పనిసరిగా మారుతోంది. రుణాలకు డిమాండ్ పుంజుకున్న పక్షంలో తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఇది చాలా కీలకం. చాలా బ్యాంకులకు ఎస్‌బీఐ, పీఎన్‌బీ వంటి అగ్రశ్రేణి బ్యాంకుల స్థాయి లేకపోవడంతో భారీ కార్పొరేట్ రుణాలు వంటి వాటి విషయంలో అవి చిన్నా, చితకా బ్యాంకులుగానే కొనసాగాల్సి వస్తోంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్నా విలీనాలే ఉత్తమ మార్గంగా పరిశీలకులు చెబుతున్నారు.

పొదుపు ఖాతాపై బీఓఐ వడ్డీకోత



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) రూ. 50 లక్షల వరకూ పొదుపు ఖాతాలపై వడ్డీరేటును అరశాతం తగ్గించింది. దీనితో ఈ రేటు 3.5 శాతానికి తగ్గింది. రూ.50 లక్షల పైన ఖాతాలపై వడ్డీరేటు యథాపూర్వం 4%గా కొనసాగుతుంది. ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడాసహా పలు బ్యాంకులు ఇప్పటికే ఈ మేరకు చర్యలు తీసుకున్నాయి.

II
సాక్షి భవిత
శుక్రవారం 25-8-2017
స్వర్ణయా వర్థతే విద్య
విద్య నేటి విద్యలో..
● జనరల్ స్టడీస్: ఇండియన్ హిస్టరీ
● బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: ఇంగ్లిష్ లాంగ్వేజ్
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?

- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటీ)లో 340 సైంటిస్ట్ 'బి', సైంటిఫిక్ టెక్నికల్ అసిస్టెంట్ 'ఎ' పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 28
- సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్)లో 12 ఆఫీసర్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 28
- ఐఐటీ బాంబేలో సీనియర్ స్పోర్ట్స్ ఆఫీసర్, ఎస్‌టీవో తదితర ఏడు పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 28

తీర మైదానాలు.. ఎడారులు.. తూర్పు కనుమలు



కాంపిటీటివ్ గైడెన్స్
జాగ్రఫీ

దక్కన్ పీఠభూమికి ఇరువైపులా అరేబియా సముద్రం, బంగాళాఖాతం వెంబడి వివిధ తీర మైదానాలున్నాయి. అవి రెండు రకాలు.

1. పశ్చిమ తీర మైదానం
2. తూర్పు తీర మైదానం

పశ్చిమ తీర మైదానం

- దక్కన్ పీఠభూమికి పశ్చిమం వైపున, అరేబియా సముద్రం మధ్య వ్యాపించి ఉంది. సన్నగా, అసమానంగా, అక్కడక్కడ కొండల భూభాగంతో గుజరాత్ తీరంలోని 'రాణా ఆఫ్ కచ్' నుంచి దక్షిణాన 'కన్యా కుమారి' వరకు విస్తరించి ఉంది.
- ఈ మైదానం ఇరుకుగా, తక్కువ వెడల్పు (10–25 కి.మీ) కలిగి ఉంటుంది.
- ఈ మైదానంలో డెల్టాలు/కయ్యలు మాత్రమే ఉన్నాయి.

గమనిక: నదులు తమతోపాటు తెచ్చిన ఒండ్రు మట్టిని తమ ముఖ ద్వారం వద్ద నిక్షేపించకుండా సముద్రంలో కలిస్తే ఆ ప్రాంతాన్ని కయ్యలు అంటారు.

- పశ్చిమ తీర రేఖ సచ్ఛిద్రంగా రంపపు పళ్ల నిర్మాణాన్ని కలిగి ఉండటం వల్ల భ్రంశాలు ఏర్పడటంతో ఈ మైదానం సహజ ఓడ రేవులకు ప్రసిద్ధి చెందింది.
- పశ్చిమ కనుమ పశ్చిమ వాలు ఎక్కువగా ఉండటం; పశ్చిమ కనుమల, అరేబియా సముద్రం మధ్య దూరం తక్కువగా ఉండటం వల్ల పశ్చిమ తీర మైదానాల్లో డెల్టాలు లేవు.
- పశ్చిమ తీర మైదానాన్ని వివిధ రకాలుగా విభజించవచ్చు. అవి..

1. **గుజరాత్ మైదానం:** గుజరాత్‌లోని రాణా ఆఫ్ కచ్ నుంచి డామన్ వరకు విస్తరించి ఉంది. ఇక్కడి తీరాన్ని గుజరాత్ తీరం/కాండ్లా తీరం/కథియవార్ తీరం/గిర్నార్ తీరం అంటారు.
- ఈ మైదానం ఆటుపోటులకు ప్రసిద్ధి.
- ఈ తీర మైదానంలో ప్రవహించే నదులు.. నర్మద, తపతి, సబర్మతి, మహీ మొదలైనవి.
- ఈ మైదాన తీరంలో 'గిర్నార్' కొండలు ఉన్నాయి. ఈ కొండల్లోని ఎత్తైన శిఖరం గిర్ శిఖరం.
- గిర్నార్ కొండల్లో 'గిర్ నేషనల్ పార్క్' (జునాఘడ్) గుజరాత్‌లో ఉంది.

2. **కొంకణ్ మైదానం:**
- డామన్ నుంచి గోవా వరకు(గోవా, మహారాష్ట్రల్లో) విస్తరించి ఉంది.
- ఈ మైదానం బసాల్ట్ నేలలకు ప్రసిద్ధి. దీన్ని కొంకణ్ తీరం అని కూడా పిలుస్తారు.

3. **కర్ణాటక మైదానం:**
- గోవా నుంచి కన్ననూర్ వరకు విస్తరించి ఉంది. దీన్ని కెనరా తీరం అని కూడా అంటారు
- ఈ మైదానం గుండా శరావతి, నేత్రావతి నదులు ప్రవహిస్తున్నాయి.
- ఈ మైదానం ప్రవహించే శరావతి నదిపై దేశంలోనే అతి ఎత్తైన జోగ్/జర్సోప్పా జలపాతం ఉంది. దీని ఎత్తు సుమారు 275 మీటర్లు.
- ఈ తీర మైదానం కయ్యలకు ప్రసిద్ధి.

4. **కేరళ తీరమైదానం:**
- కన్ననూర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి ఉంది. దీన్నే మలబార్ తీరం అని కూడా అంటారు.
- ఈ మైదానం ఉప్పునీటి సరస్సులకు ప్రసిద్ధి. ఈ ఉప్పునీటి సరస్సులనే లాగూన్లు(వృష్ట జలాలు) అంటారు.
- ఇక్కడి లాగూన్లు అష్టముడి, వెంబనాడ్.
- లాగూన్లను స్థానికంగా 'కాయల్' అంటారు.
- ఈ కాయల్స్‌ను వెనక జలాలు అంటారు.
- దేశంలో పొడవైన లాగూన్, సరస్సు చిలుకా సరస్సు (ఒడిశా).
- దేశంలో అత్యధికంగా లాగూన్లు విస్తరించి ఉన్న మైదానం మలబార్ తీరం
- ఈ మైదానంలో ప్రవహించే నదులు పెరియార్, పంబ, భద్రావతి మొదలైనవి
- దేశంలో పశ్చిమ, తూర్పు తీరాల మొత్తం పొడవు 6,100 కి.మీ.
- దేశంలో అత్యధిక తీరం గల రాష్ట్రం గుజరాత్ (1,054 కి.మీ.)
- దేశంలో అత్యధిక తీరం గల రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ (974 కి.మీ)

తూర్పు తీర మైదానం

- దక్కన్ పీఠభూమికి తూర్పున, బంగాళాఖాతానికి మధ్య విస్తరించి ఉంది.
- బల్లపరుపుగా ఉండి ఎక్కువ వెడల్పు (సుమారు 120 కి.మీ) కలిగి ఉంది.
- ఈ మైదానం దక్షిణాన కన్యాకుమారి నుంచి ఈశాన్యంగా సువర్ణరేఖ నది మీదుగా గంగా నది ముఖద్వారం వరకు సుమారు 1,800 కి.మీ. పొడవున విస్తరించి ఉంది.
- తూర్పు తీరంలో మహానది, గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి నదుల వల్ల ఏర్పడిన డెల్టాలు ఉన్నాయి.

గమనిక: నదులు తమతోపాటు తెచ్చిన ఒండ్రుమట్టిని తమ ముఖ ద్వారం వద్ద నిక్షేపణ చేసి సముద్రంలో కలిసే ప్రాంతాన్ని డెల్టా అంటారు.

- ఈ తీరంలోని డెల్టాలు దక్షిణ భారతదేశపు ధాన్యాగారాలుగా ప్రసిద్ధి చెందాయి.
- తూర్పు తీరంలో పొడవైన తీరం గల రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు.
- తూర్పు తీర మైదానం విశాలమైన బీచ్‌లతో నిర్మితమైంది.
- విరూపకారక బలాల వల్ల బంగాళాఖాతం ఖండ భూభాగం నుంచి క్రమంగా తిరోగమిస్తోంది.
- తూర్పు తీరంలో హుగ్లీ నది ముఖద్వారం వద్ద సముద్రంలోని ఖండ భూభాగాలు తిరోగమనం చెందడం వల్ల 'న్యూమూర్' దీవులు ఆవిర్భవించాయి.
- కొల్లేరు సరస్సు ఒకప్పుడు తూర్పు మైదానంలోని కృష్ణా–గోదావరి నదీ డెల్టాల మధ్య ఉప్పునీటి సరస్సుగా ఉండేది. తర్వాతి కాలంలో బంగాళాఖాతం క్రమంగా ఖండ భూభాగం నుంచి తిరోగమించడంతో ఈ సరస్సు ప్రస్తుతం తీరానికి దూరంగా ఖండ భూభాగంపై మంచినీటి సరస్సుగా ఆవిర్భవించింది.
- తూర్పు తీర మైదానాన్ని కూడా వివిధ మైదానాలుగా విభజించవచ్చు. అవి..

1. **తమిళనాడు మైదానం:**
- దీన్ని కోరమాండల్ తీరం అని కూడా అంటారు.
- ఇది కన్యాకుమారి నుంచి పులికాట్ సరస్సు వరకు వ్యాపించి ఉంది.
- ఈ మైదానంలో ప్రవహించే నది కావేరి.
- దీన్ని ప్రాచీన కాలంలో చోళ మండలం అనే పేరుతో పిలిచేవారు.
- పులికాట్ సరస్సుకు సమీపంలోనే శ్రీహరికోట ద్వీపం ఉంది. ఇక్కడే సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఉంది.
- పులికాట్ సరస్సును ఆనుకొని 'నేలపట్టు' పక్షి సంరక్షణ కేంద్రం ఉంది.

గమనిక:
- దేశంలో మూడు సముద్రాల తీర రేఖ గల రాష్ట్రం తమిళనాడు.
- దేశంలో మూడు సముద్రాల తీర రేఖ గల నగరం కన్యాకుమారి(తమిళనాడు).

2. **ఆంధ్రామైదానం:**
- దీన్ని కోస్తా తీరం/సర్కార్ తీరం అంటారు.
- పులికాట్ సరస్సు నుంచి బరంపురం (ఒడిశా) వరకు విస్తరించి ఉంది.
- ఈ మైదానంలో గోదావరి–కృష్ణా, పెన్నా డెల్టాలు విస్తరించి ఉన్నాయి.
- కృష్ణా–గోదావరి నదుల మధ్య కొల్లేరు సరస్సు ఉంది.
- కొల్లేరు సరస్సులో కలిసే నదులు.. బుడమేరు, తమ్మిలేరు, ఉప్పుటేరు.
- కొల్లేరు సరస్సులోని నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే నది ఉప్పుటేరు.

3. **ఉత్కళ మైదానం:**
- దీన్ని ఒడిశా తీరం/కళింగ తీరం/ఒరియా తీరం అని కూడా అంటారు.
- ఇది బరంపురం నుంచి సుందర్‌బన్స్ వరకు వ్యాపించి ఉంది.
- ఈ మైదానంలో మహానది డెల్టా, చిలుకా సరస్సు ఉన్నాయి. ఈ సరస్సులో రిడ్లే తాబేళ్లను పెంచుతున్నారు.
- ఈ తీరంలో సిమ్లిపాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉంది.

4. **వంగ తీరం:** దీన్ని కాంతి తీరమైదానం/బెంగాలీ తీరం అని కూడా అంటారు.
- ఇది సుందర్‌బన్స్ నుంచి గంగా నది ముఖద్వారం వరకు విస్తరించి ఉంది.
- ఇక్కడ ఉన్న డెల్టా గంగా నది డెల్టా.
- ఈ తీరంలో మడ అడవులు ఉన్నాయి.
- ఈ తీరమైదానంలో ప్రపంచంలోనే అతి పెద్ద డెల్టా అయిన సుందర్‌బన్ డెల్టా ఉంది.

పశ్చిమ తీరాలు	రాష్ట్రాలు
1. కాండ్లా తీరం	గుజరాత్
2. కొంకణ్ తీరం	మహారాష్ట్ర, గోవా
3. కెనరా తీరం	కర్ణాటక
4. మలబార్ తీరం	కేరళ

తూర్పు తీరాలు	రాష్ట్రాలు
1. కోరమాండల్ తీరం	తమిళనాడు
2. సర్కార్ తీరం	ఆంధ్రప్రదేశ్
3. ఉత్కళ/కళింగ తీరం	ఒడిశా
4. వంగ తీరం	పశ్చిమ బెంగాల్

ఎడారులు

- భారత ఉపఖండంలో అతి పెద్ద ఎడారి థార్ ఎడారి. దీన్ని భారతదేశపు గొప్ప ఎడారి అని అంటారు. ఇది ఆరావళి పర్వతాలకు వాయవ్యంగా ఉంది. దీని విస్తీర్ణం సుమారు రెండు లక్షల చ.కి.మీ.
- ఈ ఎడారిలో అత్యధిక భాగం మన దేశంలో, అతి కొద్ది భాగం పాకిస్తాన్‌లో విస్తరించి ఉంది.
- ఈ ఎడారి రాజస్థాన్‌లో అధిక భాగం; పంజాబ్, హర్యానాలో కొంత భాగం విస్తరించి ఉంది.
- ఈ ఎడారిలో వార్షిక వర్షపాతం అతి తక్కువ (10–50 సెం.మీ) కావడం వల్ల అక్కడక్కడ ముళ్ల పొదల వంటి ఉద్భిజాలు(జీరోఫైటిక్ వృక్షాలు) ఉన్నాయి.
- ఈ ఎడారి ప్రాంతంలోని జోధ్‌పూర్, బికనీర్, జైసల్మీర్ మొదలైనవి మన దేశ జన పదాల్లో ముఖ్యమైనవి.
- పోఖ్రాన్ అణు పరీక్షను ఈ ఎడారిలోనే జరిపారు.
- నీటి లభ్యత ఉన్న ప్రదేశాల్లో జన్మించి ఎడారుల మీదుగా ప్రవహించే నదులను ఎడారి జీవ నదులు/ఎక్సోటిక్ రివర్స్ అంటారు.
- ఈ ఎడారిలో ప్రవహించే నది సింధూ నది.

తూర్పు కనుమలు

- జార్ఖండ్‌లోని ఛోటా నాగపూర్ పీఠభూమి నుంచి మొదలై నీలగిరి పర్వతాల వరకు విస్తరించి ఉన్నాయి.
- పశ్చిమ కనుమల మాదిరిగా అవిచ్ఛిన్నంగా కాకుండా తెంపులు తెంపులుగా విస్తరించి ఉన్నాయి.
- ఇవి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా నదుల మధ్య అదృశ్యమై, మళ్లీ ఆంధ్ర మధ్య భాగంలో మొదలై నీలగిరి కొండల వరకు విస్తరించి ఉన్నాయి.
- ఈ తూర్పు కనుమల మీదుగా కొన్ని ముఖ్య నదులు ప్రవహిస్తున్నాయి. అవి.. మహానది, గోదావరి, కృష్ణా, పెన్నా.
- తూర్పు కనుమల ఉత్తర భాగం చార్నోకైట్, ఖొండాలైట్ లాంటి శిలలతో ఏర్పడింది.
- తూర్పు కనుమలను మూడు భాగాలుగా విభజించవచ్చు. ఉత్తర భాగాన్ని ఉత్తర కొండలని, మధ్య భాగాన్ని కడప కొండలని, దక్షిణ భాగాన్ని తమిళ కొండలని అంటారు.

నీలగిరి పర్వతాలు:
- ఇవి పశ్చిమ కనుమల రూపాంతరాలు. కేరళ, కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో విస్తరించి ఉన్నాయి.
- నీలగిరి కొండల్లో ఎత్తైన శిఖరం దొడబెట్ట. దీని ఎత్తు సుమారు 2,637 మీటర్లు.
- ద్వీపకల్ప పీఠభూమిలో, దక్షిణ భారత దేశంలో ఎత్తైన శిఖరం కూడా దొడబెట్టే.
- ఈ పర్వతాల్లో మాకుర్తి అనే శిఖరం వద్దే ఊటీ/ఉదకమండలం అనే వేసవి విడిది కేంద్రం ఉంది.
- ఈ పర్వతాల్లోని ఏకైక జలపాతం కలహటి . ఇది తమిళనాడులో ఉంది.
- ఈ పర్వత ప్రాంతాల్లో నివసించే ఆదిమ జాతులు తోడాలు, కోటాలు, బడగాలు మొదలైనవారు.
- అన్నామలై కొండలు కేరళలో విస్తరించి ఉన్నాయి. వీటిలో ఎత్తైన శిఖరం అనైముడి. దీని ఎత్తు సుమారు 2,695 మీటర్లు.
- రాజస్థాన్ మైదానం ఆరావళి పర్వతాలకు పశ్చిమంగా శుష్క శీతోష్ణస్థితిని కలిగి ఉంది. దీన్ని మర్వార్/మరుస్థలి అంటారు.
- **పంజాబ్–హర్యానా మైదానం:** పంజాబ్, హర్యానాలో విస్తరించి ఉంది. ఇందులో దోయాబ్‌లు ఎక్కువగా ఉన్నాయి.
- **గంగా మైదానం:** ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్‌లో విస్తరించి ఉంది.
- ఈ మైదానాన్ని ఎగువ, మధ్య, దిగువ గంగా మైదానాలుగా వర్గీకరించవచ్చు.
- దిగువ గంగా మైదానంలో ప్రపంచంలోనే అతి పెద్ద డెల్టా అయిన సుందర్‌బన్ డెల్టా (పశ్చిమ బెంగాల్)లో ఉంది.
- బ్రహ్మపుత్ర మైదానం అసోం, బంగ్లాదేశ్‌లో విస్తరించి ఉంది. ఈ మైదాన ప్రాంతంలోనే మజులీ దీవి ఉంది.

దోయాబ్: రెండు నదుల మధ్య ప్రాంతాన్ని దోయాబ్ అంటారు. ఇది సారవంతమైన మృత్తికలకు ప్రసిద్ధి. బిస్త్ దోయాబ్.. బియాస్–సట్లెజ్ నదుల మధ్య; బారీ దోయాబ్.. బియాస్–రావి నదుల మధ్య; చెజిక్ దోయాబ్.. చీనాబ్–జీలం నదుల మధ్య ఉన్నాయి.

- గాలి వల్ల ఏర్పడిన క్రమక్షయ మైదానాన్ని పెడిప్లెయిన్స్ అంటారు.
- నదుల వల్ల ఏర్పడిన క్రమక్షయ మైదానాన్ని ప్లెనిప్లెయిన్స్ అంటారు.
- సముద్రాల వల్ల ఏర్పడిన క్రమక్షయ మైదానాన్ని తరంగ క్రమక్షయ మైదానం అంటారు.



ముల్కల రమేష్
సీనియర్ ఫ్యాకల్టీ, జీవీఎస్ స్టడీ సర్కిల్

కాంపిటీటివ్ కౌన్సెలింగ్

పోటీ పరీక్షల్లో కెమిస్ట్రీ ప్రాధాన్యత ఏమిటి? ఏయే పాఠ్యాంశాలు ముఖ్యం?

– కళ్యాణి, ఆదిలాబాద్.




- సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ లాంటి పలు పోటీ పరీక్షల్లో జనరల్ సైన్స్ విభాగంలో రసాయన శాస్త్రం ఒక ముఖ్య విభాగం. గత నాలుగైదేళ్ల ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే కెమిస్ట్రీపై ఆరు నుంచి పది వరకు ప్రశ్నలు వస్తుండటాన్ని గమనించొచ్చు. పాలిమర్‌లు, ఔషధాలు, పర్యావరణ రసాయనశాస్త్ర అంశాలపైనే ఎక్కువ ప్రశ్నలు అడుగుతున్నారు. పరమాణు నిర్మాణం, ఆవర్తన పట్టిక, కర్బన రసాయన శాస్త్రం, రసాయన పదార్థాల ఫార్ములాలు, అణు భారాలు, రసాయన పదార్థాల ఉపయోగాలు లాంటి టాపిక్‌లను రిపీటెడ్‌గా చదవాలి. ఈ పాఠ్యాంశాల నుంచి ఇస్తున్న ప్రశ్నలను గమనిస్తే ఫండమెంటల్స్ పైనే ఎక్కువగా అడుగుతున్నట్లు తెలుసుకోవచ్చు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలు చదివితే సరిపోతుంది. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన అంశాలతో ఇమిడి ఉన్న రసాయనశాస్త్ర ప్రశ్నలకు హైస్కూల్ స్థాయి పాఠ్య పుస్తకాలతో పాటు పత్రికల్లో వచ్చే విషయ సంబంధ వ్యాసాలు, అప్‌డేట్స్‌ను చదివితే పోటీ పరీక్షల్లో రసాయన శాస్త్ర ప్రశ్నలకు సులువుగా సమాధానం రాయొచ్చు.

రాష్ట్రపతి ఎన్నిక.. రాజ్యాంగ అధికరణలు

పోటీ పరీక్షల ప్రత్యేకం
పాలిటీ





- **భారత పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?**
  జవాబు: బ్రిటన్
  వివరణ: బ్రిటన్ పార్లమెంటు విధానంలోని రెండు రకాల కార్యనిర్వాహక శాఖల విధానాన్ని స్వీకరించారు కానీ అందులోని వారసత్వ రాజరిక వ్యవస్థను తీసుకోలేదు. అలాగే మన రాజ్యాంగ నిర్మాతలు.. ఐర్లాండ్ తరహాలో ఎన్నికయ్యే అధ్యక్షుడి వ్యవస్థను సూచించారు.
- **రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో, ఏ అధికరణలో పొందుపర్చారు?**
  జ: రాజ్యాంగంలోని 5వ భాగంలో 52వ అధికరణ నుంచి 62వ అధికరణ వరకు రాష్ట్రపతి గురించి వివరించారు.
- **రాజ్యాంగం ప్రకారం కేంద్ర కార్యనిర్వాహక అధికారాలను ఎవరి పేరిట పొందుపర్చారు?**
  జ: రాష్ట్రపతి
  వివరణ: రాజ్యాంగంలోని 53వ అధికరణ ప్రకారం రాష్ట్రపతి.. కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్య నిర్వాహక అధికారి. రాష్ట్రపతి తన కార్య నిర్వాహక అధికారాలను స్వయంగా గానీ తన కింది అధికారుల సహాయంతో గానీ నిర్వహిస్తారు. తన కింది అధికారులు అంటే కేంద్ర మంత్రి మండలిగా భావించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రామ్‌జనామ్ V/s స్టేట్ ఆఫ్ పంజాబ్ 1955, షంషేర్‌సింగ్ V/s స్టేట్ ఆఫ్ పంజాబ్ 1974 కేసుల సందర్భంలో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ రాష్ట్రపతి రాజ్యాధినేత మాత్రమే అని పేర్కొంది. ప్రభుత్వాధినేత ప్రధానమంత్రి అని స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రకారం రాష్ట్రపతి నామమాత్రపు సార్వభౌమాధికారే.
- **రాజ్యాంగంలోని ఏ అధికరణ రాష్ట్రపతి ఎన్నిక గురించి తెలియజేస్తుంది?**
  జ: 54వ అధికరణ
  వివరణ: భారత రాష్ట్రపతిని ఎన్నుకునే వ్యవస్థను 'ఎన్నికల గణం (ఎలక్టోరల్ కాలేజ్)' అంటారు. ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.
  1. భారత పార్లమెంట్(లోక్‌సభ/రాజ్యసభ)కు ఎన్నికైన సభ్యులు
  2. రాష్ట్రాల విధాన సభకు ఎన్నికైన సభ్యులు (ఎంఎల్ఏలు)
  3. ఢిల్లీ, పుదుచ్చేరి విధాన సభలకు ఎన్నికైన సభ్యులు

  70వ రాజ్యాంగ సవరణ ద్వారా 1992లో కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, పుదుచ్చేరి శాసన సభ సభ్యులకు రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పిస్తూ ఎన్నికల గణంలో చేర్చారు. ఇది 1995 జూన్ నుంచి అమల్లోకి వచ్చింది. ఢిల్లీ, పుదుచ్చేరి శాసనసభ్యులు 1997లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో తొలి సారిగా ఓటు హక్కు వినియోగించుకున్నారు
- **రాజ్యాంగంలోని ఏ అధికరణ రాష్ట్రపతి ఎన్నిక విధానాన్ని తెలుపుతుంది?**
  జ: 55వ అధికరణ
  వివరణ: రాష్ట్రపతి ఎన్నిక పరోక్ష విధానంలో జరుగుతుంది. నైష్పత్తిక ప్రాతినిధ్య విధానంలో ఏక ఓటు బదలాయింపు పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తారు. ఎన్నికల గణంలోని సభ్యుల ఓటుకు విలువ నిర్ణయిస్తారు. రాష్ట్రపతి ఎన్నికలో ఎం.ఎల్.ఎ. ఓటు విలువ నిర్ణయించే సూత్రం.

$$\text{ఎంఎల్ఏ ఓటు విలువ} = \frac{\text{రాష్ట్ర మొత్తం జనాభా}}{\text{ఎన్నికైన విధాన సభ సభ్యుల సంఖ్య} \times 1000}$$

$$\text{ఎం.పి. ఓటు విలువ} = \frac{\text{మొత్తం రాష్ట్రాల విధాన సభ్యుల ఓటు విలువ}}{\text{ఎన్నికైన పార్లమెంటు సభ్యుల సంఖ్య}}$$

  రాష్ట్రపతి ఎన్నికలో 'కోటా' ఓట్లను నిర్ణయిస్తారు. ఎక్కువ కోటా ఓట్లు పొందిన అభ్యర్థి గెలిచినట్లుగా ప్రకటిస్తారు. అంటే మొత్తం పోలైన ఓట్లలో చెల్లిన వాటి నుంచి సగం కంటే ఎక్కువ ఓట్లు పొందిన అభ్యర్థిని రాష్ట్రపతిగా ప్రకటిస్తారు.
- **రాజ్యాంగంలోని ఏ అధికరణ రాష్ట్రపతి పదవీకాలం గురించి తెలియజేస్తుంది?**
  జ: 56వ అధికరణ
  వివరణ: రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి పదవీ కాలం ఐదేళ్లు. ఈ లోపు రాష్ట్రపతి ఏ కారణంతోనైనా తన పదవికి రాజీనామా చేయవచ్చు. అలాంటప్పుడు రాజీనామా లేఖను ఉప రాష్ట్రపతిని సంబోధిస్తూ రాయాలి. ఒకవేళ ఆ సమయంలో ఉప రాష్ట్రపతి పదవి ఖాళీగా ఉంటే రాష్ట్రపతి తన రాజీనామాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపిస్తారు.
- **రాజ్యాంగంలోని 57వ అధికరణ ఏ అంశం గురించి వివరిస్తుంది?**
  జ: రాష్ట్రపతి పదవికి ఒక వ్యక్తి ఎన్ని సార్లయినా పోటీ చేయవచ్చనే అంశాన్ని వివరిస్తుంది.
  వివరణ: రాజ్యాంగ పరిషత్తులో నెహ్రూ మాట్లాడుతూ ఒక వ్యక్తి రాష్ట్రపతి పదవిని రెండు కన్నా ఎక్కువ సార్లు చేపట్టకూడదని, దీన్ని సంప్రదాయంగా పాటించాలని పేర్కొన్నారు. కానీ రాజ్యాంగంలో ఎక్కడా కూడా ఒక వ్యక్తి రాష్ట్రపతి పదవిని రెండు కన్నా ఎక్కువ సార్లు చేపట్టరాదని పేర్కొనలేదు. రెండు సార్లు అనేది సంప్రదాయం మాత్రమే.
  ఉదా: బాబూ రాజేంద్రప్రసాద్ మాత్రమే రెండు సార్లు రాష్ట్రపతి పదవిని చేపట్టాడు.

8. **రాష్ట్రపతి పదవికి పోటీ చేసే అభ్యర్థికి ఉండాల్సిన అర్హతల గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణ పేర్కొంటుంది?**
  జ: 58వ అధికరణ
  వివరణ: రాజ్యాంగంలోని 58వ అధికరణ ప్రకారం భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసే అభ్యర్థికి కొన్ని అర్హతలు నిర్ణయించారు.
  1. భారత పౌరుడై ఉండాలి.
  2. 35 ఏళ్ల వయసు నిండి ఉండాలి.
  3. లోక్‌సభ సభ్యుడిగా ఎన్నిక కావడానికి కావాల్సిన ఇతర అర్హతలు ఉండాలి.
  4. పార్లమెంట్ నిర్ణయించిన ఇతర అర్హతలు ఉండాలి.

  రాష్ట్రపతి అర్హతలకు సంబంధించిన చట్టాలను రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉంది.

- **రాష్ట్రపతి వేతన, భత్యాల గురించి రాజ్యాంగంలోని ఏ ప్రకరణ పేర్కొంటుంది?**
  జ: 59వ ప్రకరణ
  వివరణ: రాజ్యాంగంలోని ప్రకరణ 59 ప్రకారం రాష్ట్రపతి వేతన, భత్యాలను పార్లమెంట్ నిర్ణయిస్తుంది. వీటిని సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. ఉచిత నివాసం, వైద్య సదుపాయాలు లభిస్తాయి. రాష్ట్రపతి నివాస సముదాయాన్ని రాష్ట్రపతి భవన్ అంటారు.
- **రాజ్యాంగంలోని ఏ అధికరణ రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం గురించి వివరిస్తుంది?**
  జ: 60వ అధికరణ
  వివరణ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆయన అందుబాటులో లేకపోతే సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తి ప్రమాణం చేయిస్తారు.
- **రాష్ట్రపతి తొలగింపు విధానాన్ని రాజ్యాంగంలోని ఏ అధికరణలో పొందుపర్చారు?** **జ: 61వ అధికరణ**
  వివరణ: అధికరణ 61 రాష్ట్రపతిని అభిశంసించే విధానాన్ని తెలియజేస్తుంది. దీన్నే 'మహాభియోగ తీర్మానం' అంటారు. ఇది ఒక క్వాసి–జ్యుడీషియల్ పద్ధతి. దీన్ని అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. మహాభియోగ తీర్మానాన్ని పార్లమెంటులోని ఏ సభ(లోక్‌సభ/రాజ్యసభ)లో అయినా ప్రవేశపెట్టవచ్చు.
  రాష్ట్రపతి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే అభిశంసించవచ్చు. రాష్ట్రపతిని తొలగించడానికి ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంట్‌లోని రాజ్యసభ/లోక్‌సభ మొత్తం సభ్యుల్లో కనీసం 1/4 వంతు సభ్యులు సంతకం చేయాలి. ఆ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టే 14 రోజుల ముందుగానే ఆ విషయాన్ని సభాధ్యక్షునికి, ఆ రాష్ట్రపతికి తెలియజేయాలి.
  రాష్ట్రపతిపై ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానాన్ని సభ(లోక్‌సభ/రాజ్యసభ)లోని మొత్తం సభ్యుల సంఖ్యలో 2/3 వంతు మంది ఆమోదించాలి.
  ఈ విధంగా పార్లమెంట్‌లోని రెండు సభలు విడివిడిగా 2/3 వంతు సభ్యుల ఆమోదం తెలియజేస్తే రాష్ట్రపతిని పదవి నుంచి తొలగించవచ్చు. మహాభియోగ తీర్మానం ద్వారా ఇంతవరకు ఏ రాష్ట్రపతినీ తొలగించలేదు. రాష్ట్రపతి వి.వి.గిరిపై మహాభియోగ తీర్మానం నోటీస్ ఇచ్చారు. కానీ దాన్ని తర్వాత ఉపసంహరించుకున్నారు.
- **రాష్ట్రపతి పదవీకాలం ముగియకముందే నూతన రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ముగించాలని రాజ్యాంగంలోని ఏ అధికరణ పేర్కొంటుంది?** **జ: 62వ అధికరణ**
  వివరణ: రాష్ట్రపతి మరణించినప్పుడు (లేదా) రాజీనామా చేసినప్పుడు (లేదా) తొలగింపునకు గురైనప్పుడు ఆ రోజు నుంచి ఆరు నెలల్లోగా నూతన రాష్ట్రపతిని ఎన్నుకోవాలి.



వి. కొండల్
ప్రభుత్వ కళాశాల లెక్చరర్

ప్రతి వారం మీ భవిత మెయిన్ పేజీల్లో...

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
10+2/గ్రాడ్యుయేట్ స్పెషల్	ఇంజనీరింగ్/ ఎంబీఏ స్పెషల్	జాబ్ పాయింట్	కెరీర్ గైడెన్స్/ టెక్నాలజీ స్పెషల్	ఫారెన్ ఎడ్యుకేషన్ స్పెషల్	యూత్ స్టోరీ/ కరెంట్ అఫైర్స్ (ఇంగ్లిష్)	జాబ్ స్కిల్స్/ గెస్ట్ కాలమ్
గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం

సాక్షి
భవిత
III
శుక్రవారం 25-8-2017
స్పర్థయా వర్ధతే విద్య

ఫ్రాన్స్.. బెటర్ ఛాన్స్



యూరోపియన్ దేశాల్లోకెల్లా సుందర ప్రాంతం.. నిత్యం పర్యాటకులతో కళకళలాడే ప్రదేశం.. ఫ్యాషన్‌కు పుట్టిల్లు.. ఫ్రాన్స్! ఇప్పుడు విదేశీ విద్యార్థులనూ ఆహ్వానిస్తోంది..! ఇందుకు అక్కడి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఏటా సెప్టెంబర్ నెలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది.. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యావకాశాలపై విశ్లేషణ..!

ఫారెన్ ఎడ్యుకేషన్

ప్రపంచ ఫ్యాషన్ రాజధాని ఫ్రాన్స్.. విద్యా వేదికగానూ మారుతోంది. ఇటీవలి కాలంలో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఈ దేశం వెళ్తున్న విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటమే ఇందుకు నిదర్శనం. 2016 నాటికి పలు దేశాలకు చెందిన 3.10 లక్షల మంది ఫ్రాన్స్‌లోని విశ్వవిద్యాలయాల్లో చదువుతుండటం విశేషం.

భారత్ నుంచి క్రమేణా పెరుగుతున్న సంఖ్య

2012లో 2,600 మంది.. 2017 జూన్ నాటికి 4,500.. ఫ్రాన్స్‌కు ఉన్నత విద్య కోసం వెళ్లిన భారత్ విద్యార్థుల సంఖ్య ఇది. ఇతర దేశాలకు వెళ్తున్న వారితో పోల్చితే తక్కువైనప్పటికీ.. ఫ్రాన్స్ వైపు కూడా మన విద్యార్థులు దృష్టిసారిస్తున్నారనడానికి దీనిని ఉదాహరణగా పేర్కొనవచ్చు.

10,000 : 2020..

2020 నాటికి భారత విద్యార్థుల సంఖ్యను పదివేలకు పెంచేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఔత్సాహికులకు ఈ మేరకు పలు విధాల తోడ్పాటునందిస్తోంది. ఇక్కడి విద్యావకాశాలలో ఆర్ట్స్, లిబరల్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, టూరిజం, లగ్జరీ మేనేజ్‌మెంట్‌లు ముందువరుసలో నిలుస్తున్నాయి. మన విద్యార్థులు ఎక్కువగా ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సుల వైపే దృష్టి సారిస్తున్నారు.

నాలుగు వేలపైగా ఇన్‌స్టిట్యూట్‌లు

ప్రస్తుతం ఫ్రాన్స్‌లో నాలుగు వేలపైగా ఉన్నత విద్యా సంస్థలున్నాయి. స్థానిక విద్యా విధానం ప్రకారం అండర్ గ్రాడ్యుయేట్, మాస్టర్స్, డాక్టోరల్ కోర్సులు అభ్యసించే వీలుంది. ఫీజులు కూడా కొంత నామమాత్రంగానే ఉంటాయని చెప్పొచ్చు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో వార్షిక ఫీజు ఇంజనీరింగ్ కోర్సులకు 620 యూరోలు, మేనేజ్‌మెంట్ కోర్సులకు 4,500 యూరోల నుంచి 7 వేల యూరోల వరకు చెల్లించాల్సి ఉంటుంది. హ్యూమానిటీస్, ఆర్ట్స్ తదితర సంప్రదాయ కోర్సులకు సగటున ఏడాదికి 270 యూరోలు వ్యయమవుతుంది. ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్స్‌లో మాత్రం ఈ ఫీజులు రెట్టింపుగా ఉంటాయి.

నివాస ఖర్చులు అందుబాటులోనే..

సాధారణ జీవనశైలికి నివాస ఖర్చులు నెలకు 500 నుంచి 600 యూరోలు అవుతాయి. ఈ మొత్తంలోనే వసతి, రవాణా, ఇతర వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవచ్చు. ద్వితీయ శ్రేణి నగరాల్లో వ్యయం 400 యూరోల నుంచి 500 యూరోల మధ్య ఖర్చవుతుంది.

స్కాలర్‌షిప్ సదుపాయాలు కూడా..

ఫ్రాన్స్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు ప్రభుత్వ పరిధిలో, యూనివర్సిటీ ఆధ్వర్యంలో పలు స్కాలర్‌షిప్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. భారత్– ఫ్రాన్స్ మధ్య ప్రత్యేక ఒప్పందం ఫలితంగా అండర్ గ్రాడ్యుయేట్ (బ్యాచిలర్ డిగ్రీ), మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ వరకు ఈ స్కాలర్‌షిప్‌లు లభిస్తున్నాయి. అవి..

- **చర్పక్ ఏఎంఈ స్కాలర్‌షిప్ (మాస్టర్స్ ప్రోగ్రామ్):** రెండేళ్ల మాస్టర్ ప్రోగ్రామ్‌లో ఒక విద్యా సంవత్సరం (పది నెలల వ్యవధి)కి గాను ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు, 615 యూరోల నివాస వ్యయం లభిస్తాయి.
- ఫ్రాన్స్‌లో పీహెచ్‌డీ ప్రవేశం పొందిన అభ్యర్థులకు భారత శాస్త్ర సాంకేతిక శాఖ, ఫ్రాన్స్ ఎంబసీలు సంయుక్తంగా రామన్ చర్పక్–పీహెచ్‌డీ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. దీనిప్రకారం గరిష్టంగా ఆరు నెలల వరకు ఫ్రాన్స్‌లో ఉండి ఎలాంటి ఖర్చు లేకుండా రీసెర్చ్ యాక్టివిటీస్ చేయొచ్చు.

ఆరు నెలల ముందుగా..

ఫ్రాన్స్‌లోని అన్ని వర్సిటీల్లో రెండేళ్ల వ్యవధిలో ఉండే మాస్టర్ ప్రోగ్రామ్స్‌కు సెప్టెంబర్ నెలలో తరగతులు ప్రారంభమవుతాయి. ఔత్సాహిక విద్యార్థులు కనీసం ఆరు నెలల ముందుగా దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించాలి. తర్వాత అకడమిక్ సెషన్ ప్రారంభానికి కనీసం మూడు నెలల ముందు దరఖాస్తు చేస్తే.. వీసా పొందేందుకు తగిన సమయం అందుబాటులో ఉంటుంది.

వీసా ప్రక్రియ సులువు

భారత్– ఫ్రాన్స్ ద్వైపాక్షిక ఒప్పందాల ఫలితాల్లో భాగంగా విద్యార్థులకు వీసా ప్రక్రియ సులభమైంది. యూనివర్సిటీలో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులు 'క్యాంపస్ ఫ్రాన్స్' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలు సంతృప్తికరంగా ఉంటే తర్వాత దశలో క్యాంపస్ ఫ్రాన్స్ ప్రాంతీయ కార్యాలయాల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఫ్రాన్స్‌నే ఎంపిక చేసుకోవడానికి కారణాలను తెలుసుకునే విధంగా ఈ ఇంటర్వ్యూ ఉంటుంది.

వర్క్ ఎట్ స్టడీ

ఫ్రాన్స్‌లో చదువుకునే విద్యార్థులు వారానికి 20 గంటలు మించకుండా పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకోవచ్చు. సాధారణంగా యూనివర్సిటీల్లో రీసెర్చ్ ఫ్యాకల్టీ వద్ద రీసెర్చ్ అసిస్టెంట్‌గా చేరేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నాన్–సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు సూపర్ మార్కెట్స్, హాస్పిటల్స్, టూరిజం ఏజెన్సీల్లో పని దొరుకుతుంది. వారానికి కనీసం 60 యూరోల ఆదాయం పొందొచ్చు.

ఎలైట్ వర్సిటీల్లో చేరితే.. ఈయూలో స్వేచ్ఛగా

ఫ్రాన్స్‌లో గ్రాండ్స్ ఎకోల్స్‌గా పిలిచే ఎలైట్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు యూరోపియన్ యూనియన్‌లో 26 దేశాల్లో (ఫ్రాన్స్ సహా) ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది దీనికోసం ఎలాంటి ప్రత్యేక వీసాలు పొందక్కర్లేదు. ఉదాహరణకు ఫ్రాన్స్‌లోని ఒక ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన విద్యార్థికి.. అకడమిక్ కోర్సులో భాగంగా జర్మనీలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది.

పోస్ట్ స్టడీ వర్క్.. ప్రోత్సాహకర విధానాలు

భారత విద్యార్థులకు కలిసొచ్చే మరో ముఖ్యాంశం.. పోస్ట్ స్టడీ వర్క్. రెండేళ్ల మాస్టర్స్ కోర్సు పూర్తయిన విద్యార్థులు రెండేళ్ల పాటు అక్కడే కొనసాగి ఉద్యోగాన్వేషణ చేయొచ్చు. ఈ సమయంలో ఉద్యోగం లభిస్తే ఎంప్లాయర్ అందించే స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా వర్క్ పర్మిట్ పొందొచ్చు. తొలుత రెండేళ్ల వ్యవధికి ఇచ్చే ఈ వర్క్ పర్మిట్‌ను తర్వాత పొడిగించుకునే అవకాశం ఉంది.

ఇంగ్లిష్, ఫ్రెంచ్ లాంగ్వేజ్ తప్పనిసరి

ఫ్రాన్స్ వెళ్లాలనుకునేవారికి కాసింత ఇబ్బందికరంగా నిలుస్తున్న అంశం.. విదేశీ విద్యార్థులు ఫ్రెంచ్ భాషలో బేసిక్ సర్టిఫికేషన్ పొందాలనే నిబంధన. అయితే.. ఫ్రాన్స్ విదేశీ వ్యవహారాల శాఖ అంతర్జాతీయంగా ఉన్న తన ఎంబసీల ద్వారా ఫ్రెంచ్ భాష శిక్షణ సదుపాయాలను కల్పిస్తోంది కాబట్టి ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్ని దేశాల్లో నేరుగా, మరికొన్ని దేశాల్లో గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లతో ఒప్పందం ఆధారంగా ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. ఫ్రెంచ్‌తో పాటు విద్యార్థులు ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ వంటి ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్ స్కోర్లు పొందాల్సి ఉంటుంది.

- వీటితోపాటు ఇంజనీరింగ్, సైన్స్ కోర్సుల ఔత్సాహికులు జీఆర్ఈ స్కోర్లు సాధించాలి.
- మేనేజ్‌మెంట్ ఔత్సాహికులకు జీమ్యాట్ స్కోర్ తప్పనిసరి.

ఆధునికం.. ఆహ్లాదకరం..

ఫ్రాన్స్ ఓవైపు ఘన సంస్కృతి, సంప్రదాయలు..మరోవైపు పురాతన నిర్మాణాలు, చారిత్రాత్మక కట్టడాల నెలవు. ఫ్యాషన్, ఆధునిక జీవన శైలి ఆహ్లాదపరుస్తుంటాయి. భిన్న దేశాల వారున్నప్పటికీ.. విదేశీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యాంపస్ వర్గాలు చర్యలు తీసుకుంటున్నాయి. స్థానిక, విదేశీ విద్యార్థుల కలయికగా స్టూడెంట్స్ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా తమ సంస్కృతికి త్వరగా అలవాటుపడేలా చూస్తున్నాయి. ఫ్రెంచ్ భాషలో మాట్లాడగలిగే నేర్పు ఉంటే క్యాంపస్ బయటి వాతావరణంలోనూ సులువుగా కలిసిపోవచ్చు.

అవసరమైన డాక్యుమెంట్స్

- అకడమిక్ సర్టిఫికెట్స్
- అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్
- లెటర్ ఆఫ్ రికమండేషన్
- స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్
- ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్
- స్పాన్సర్‌షిప్ లెటర్
- స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్
- పాస్‌పోర్ట్

ఉత్తమ విశ్వవిద్యాలయాలివే..

- ఎకోల్ నార్మల్ సుపీరియర్
- ఎకోల్ పాలిటెక్నిక్
- యూనివర్సిటీ పియెర్రె ఎట్ మేరీ క్యూరీ
- సెంట్రల్ సుపీలెక్
- ఎకోల్ నార్మల్ సుపీరియర్ డె లియన్
- యూనివర్సిటీ గ్రెనోబల్
- ప్యారిస్ యూనివర్సిటీ
- యూనివర్సిటీ డి స్ట్రాస్‌బర్గ్
- ప్యారిస్ యూనివర్సిటీ డిడెరట్
- యూనివర్సిటీ డి మాంట్‌పెల్లెర్

ఉపయోగపడే వెబ్‌సైట్స్

- www.inde.campusfrance.org
- www.diplomatie.gouv.fr
- www.vfs-france.co.in

అందుబాటులోని ఇతర స్కాలర్‌షిప్‌లు

- EIFFEL స్కాలర్‌షిప్
- ఎరాస్మస్ ముండస్ స్కాలర్‌షిప్
- చర్పక్ ఏఎంఈ స్కాలర్‌షిప్
- **వివరాలకు వెబ్‌సైట్: www.inde.campusfrance.org**

బులెటిన్ బోర్డ్

కోస్ట్‌గార్డ్‌లో నేవిక్(జీడీ) పోస్టులు

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లోని నేవిక్ (జనరల్ డ్యూటీ) పోస్టులను 10+2 ఎంట్రీ–01/2018 బ్యాచ్ ద్వారా భర్తీ చేసేందుకు అర్హులైన యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది.

పోస్టు పేరు: నేవిక్(జనరల్ డ్యూటీ)

వేతనం: రూ.21,700 + ఇతర అలవెన్సులు.

విద్యార్హతలు: 50శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన విద్యార్హత. మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లోనూ 50శాతం మార్కులు వచ్చి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, జాతీయస్థాయిలో క్రీడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన అభ్యర్థులకు మార్కుల్లో 5శాతం సడలింపు ఉంటుంది.

వయోపరిమితి: 18–22 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరికి ఐదేళ్లు, ఓబీసీ కేటగిరికి మూడేళ్లు సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: ఎగ్జామినేషన్(రాతపరీక్ష), ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్(పీఎఫ్‌టీ), మెడికల్ ఎగ్జామినేషన్ (ప్రిలిమినరీ).

శారీరక దారుఢ్య పరీక్ష(ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్–పీఎఫ్‌టీ): రాతపరీక్షలో మెరుగైన మార్కులు సాధించిన అభ్యర్థులకు శారీరక దారుఢ్య పరీక్ష ఉంటుంది. ఇందులో 1.6 కి.మీ దూరాన్ని ఏడు నిమిషాల్లో పరిగెత్తగలగాలి. 20 స్కాట్ అప్స్(ఉఠక్ బైఠక్) తీయగలగాలి. 10 పుష్‌అప్స్ తీయగలగాలి. ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఆయా పరీక్ష కేంద్రాల్లో మెడికల్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.

శారీరక ప్రమాణాలు: ఎత్తు.. కనీసం 157 సెం.మీ; ఛాతీ.. తగినంత ఉండాలి. గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ వ్యాకోచించగలగాలి; బరువు... ఎత్తు, వయసుకు తగినంత ఉండాలి. 10 కేజీలు ఎక్కువ/తక్కువ ఉన్నా అనుమతిస్తారు. వీటితో నిబంధనల మేరకు తగినంత దృష్టి, వినికిడి సామర్థ్యం తప్పనిసరి. టాటూ(పచ్చబొట్లు) ఉండకూడదు.

తెలుగు రాష్ట్రాల్లో రాతపరీక్ష కేంద్రాలు: సికింద్రాబాద్, విశాఖపట్నం.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తుల ప్రారంభం: ఆగస్టు 26, 2017

దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబర్ 4, 2017

వెబ్‌సైట్: www.joinindiancoastguard.gov.in

రైజ్ యాక్ట్.. కలిసొస్తుందా!

అమెరికా జాబ్స్



అమెరికా.. అవకాశాల స్వర్గం..! ప్రతిభావంతులను రారమ్మని ఆహ్వానించే దేశం..! అందునా భారతీయ యువత విద్య, ఉద్యోగాల స్వప్నం..! కానీ.. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వచ్చాక హెచ్-1బి వీసా క్యాప్‌పై పరిమితులు.. ఉన్నత విద్య కోసం వెళ్దామంటే ఆంక్షలు.. గ్రీన్‌కార్డ్ పొందాలంటే ఎన్నో అడ్డంకులు..! మన యువతను ఆందోళనకు గురిచేసిన ఇన్ని ప్రతికూల అంశాల మధ్య ఇటీవల తెచ్చిన రైజ్ (రిఫార్మింగ్ అమెరికన్ ఇమ్మిగ్రేషన్ ఫర్ స్ట్రాంగ్ ఎకానమీ) చట్టం మాత్రం ఆశలు రేకెత్తిస్తోంది. అగ్రరాజ్యంలో చదువు, కొలువు స్వప్నంపై భరోసా ఇస్తోంది. ఈ నేపథ్యంలో విశ్లేషణ..!



గ్రీన్ కార్డ్ మంజూరులో లాటరీ పద్ధతికి స్వస్తి పలికి నైపుణ్యాల ఆధారంగా పాయింట్ల గణన చేపట్టడం రైజ్ చట్టం ఉద్దేశం. ఇది భారతీయులకు కలిసొస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చట్టంలోని ఇంగ్లిష్ నైపుణ్యం, ఉన్నత విద్య, అధిక వేతన ఉద్యోగాలు, వయసు తదితర అంశాలకు పాయింట్లు నిబంధన ఎక్కువగా మన యువతకే అనుకూలమని భావిస్తున్నారు. కొందరు మాత్రం రైజ్ యాక్ట్ చీకటిలో వెలుగు రేఖ లాంటిది మాత్రమేనని.. ఎక్కువ ఆనందించడానికి ఆస్కారం లేదని పేర్కొంటున్నారు. ఈ కొత్త చట్టం అమల్లోకి వస్తే చట్టబద్ధ వలసలను సగానికి సగం (10 లక్షల నుంచి 5 లక్షలకు) కుదించనున్నారనే అంశాన్ని ఉదాహరణగా చూపుతున్నారు.

నేపథ్యం

ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమెరికాలోని స్వదేశీ నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో హెచ్–1బీ వీసాలపై నిబంధనలు విధించింది. దీని కారణంగా దేశానికి విదేశీ విద్యార్థుల ద్వారా లభిస్తున్న వందల కోట్ల ఆదాయం చేజారిపోతోందనే విమర్శలు ఎదుర్కొంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు ఉన్న ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్‌లో విదేశీయులకు వీసాలు మంజూరు చేసే పదుల సంఖ్యలోని సెక్షన్లకు సవరణలు చేస్తూ రైజ్ యాక్ట్‌ను రూపొందించింది.

లాటరీ బదులు పాయింట్ల విధానం

ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్‌లోని పలు సెక్షన్లకు మార్పు చేస్తూ రైజ్ యాక్ట్ రూపొందించారు. ఇప్పటివరకు లాటరీలో ఇచ్చే వీసా విధానానికి స్వస్తిపలికి.. పాయింట్ల పద్ధతిని ఆవిష్కరించారు. వయసు, విద్యార్హతలు, ఇంగ్లిష్ నైపుణ్యం, వేతన ప్యాకేజీ తదితర పలు అంశాల ఆధారంగా ఒక్కోదానికి నిర్దిష్ట పాయింట్లు కేటాయించారు. పొందాల్సిన కనీస పాయింట్లు.. మొత్తంగా రావాల్సిన కనీస పాయింట్లు కూడా నిర్దేశించారు. ఇలా మొత్తంగా పొందాల్సిన కనీస పాయింట్లు 30.

ఇంగ్లిష్ నైపుణ్యం

ఇంగ్లిష్ భాష నైపుణ్యాన్ని పరీక్షించేందుకు టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ లేదా అమెరికా ఇమ్మిగ్రేషన్ శాఖ నిర్వహించే ఇతర లాంగ్వేజ్ పరీక్షల స్కోర్లు ఆధారంగా గరిష్టంగా 12 పాయింట్లు కేటాయిస్తారు. 60 శాతంలోపు పాయింట్లు/బ్యాండ్స్ పొందితే రైజ్ యాక్ట్ పరిధిలో ఎలాంటి పాయింట్లు లభించవు. 60 నుంచి 80 శాతం మధ్యలో స్కోర్ పొందితే 6; 80 నుంచి 90 శాతం మధ్యలో 10 పాయింట్లు; 90 శాతం కంటే ఎక్కువ స్కోర్ సొంతం చేసుకుంటే 11 పాయింట్లు, నూటికి నూరు శాతం స్కోర్ సాధిస్తే 12 పాయింట్లు లభిస్తాయి.

వేతనం ఆధారంగా..

అన్నిటికంటే ముఖ్యమైనది వేతన ఆధారితంగా కేటాయించిన పాయింట్లు. ఇప్పుడు ఒక విభాగంలో అమెరికాలో ఇస్తున్న సగటు వేతనానికి అదనంగా ఎంత ఎక్కువ వేతనం ఇస్తే అంత ఎక్కువగా పాయింట్లు కేటాయిస్తారు. ప్రస్తుత సగటు వేతనానికి 300 శాతం ఎక్కువ ఇస్తే 13; 150 శాతం ఎక్కువ ఇస్తే 5 పాయింట్లు కేటాయిస్తారు.

కనీసం 30

విభాగాలు.. కేటాయించిన పాయింట్లపరంగా.. దరఖాస్తుదారులు కనీసం 30 పాయింట్లు సొంతం చేసుకుంటేనే దరఖాస్తుకు అనుమతి లభిస్తుంది. ఈ విధానం మనకు కలిసొచ్చేదిగా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

అకడమిక్ అర్హతలకు పాయింట్లు	
యూఎస్‌లో పీహెచ్‌డీకి	13
ఇతర దేశాల్లో పీహెచ్‌డీకి	10
స్టెమ్ విభాగంలో అమెరికాలో పీజీకి	8
ఇతర దేశాల్లో పీజీకి	7
అమెరికాలో బ్యాచిలర్ డిగ్రీకి	6
ఇతర దేశాల్లో పూర్తి చేస్తే	5
అమెరికాలో హై స్కూల్ డిప్లొమాకు	1
విదేశాల్లో హై స్కూల్ డిప్లొమాకు	1

వయసులవారీగా..	
18–21 ఏళ్లవారికి	6
22–25 ఏళ్లవారికి	8
26–30 ఏళ్లవారికి	10
31–35 ఏళ్లవారికి	8
36–40 ఏళ్లవారికి	6
41–45 ఏళ్లవారికి	4
46–50 ఏళ్లవారికి	2
50 ఏళ్ల పైబడినవారికి పాయింట్లు ఉండవు.	

సానుకూల అంశాలివే..

- **వయసు:** 22 నుంచి 25 ఏళ్ల మధ్యలో వారికి ఎనిమిది పాయింట్లు; 26 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండే వారికి పది పాయింట్లు కేటాయించడం.
- భారతీయ అభ్యర్థులు పీజీ పూర్తి చేశాకే హెచ్–1బికి దరఖాస్తుకు ఉపక్రమిస్తారు. అప్పటికి వారి వయసు 23 నుంచి 25 ఏళ్ల మధ్య ఉంటుంది.
- **విద్యార్హతలు:** స్టెమ్ విభాగంలో అమెరికాలో పీజీ చేసిన వారికి ఎనిమిది, ఇతర దేశాల్లో పీజీ చేసిన వారికి ఏడు పాయింట్లు కేటాయించడం మరో సానుకూలాంశం. చాలామంది విద్యార్థులు అమెరికాలోనే పీజీ చేసి అక్కడే ఉద్యోగం కోసం యత్నించి హెచ్–1బికి దరఖాస్తు చేసుకుంటారు. కాబట్టి ఈ విభాగంలో ఎనిమిది పాయింట్లు దక్కడం ఖాయం.
- **ఇంగ్లిష్ నైపుణ్యం:** మన విద్యార్థులు టోఫెల్, ఐఈఎల్‌టీఎస్‌లో మంచి పాయింట్లు, బ్యాండ్స్ పొందే విధంగా శిక్షణ తీసుకొని సత్ఫలితాలు సాధిస్తున్నారు. దీంతో లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీకి కేటాయించే పాయింట్ల విషయంలోనూ మన వాళ్లు ముందంజలో నిలిచే అవకాశాలున్నాయి.

దరఖాస్తు ప్రక్రియ.. ఇలా

రైజ్ యాక్ట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో ముందుగా అమెరికా ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తు, అర్హతల ఆధారంగా ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌లోని స్క్రీనింగ్ కమిటీ పాయింట్లు కేటాయిస్తుంది.

ఇద్దరు అభ్యర్థులకు ఒకే పాయింట్లు వస్తే

కేటాయింపు ప్రక్రియ సమయంలో ఇద్దరు అభ్యర్థులకు ఒకే సంఖ్యలో పాయింట్లు లభించి టై అయితే.. వారినుంచి ఒకరిని ఎంపిక చేసేందుకు అనుసరించాల్సిన విధానాన్ని కూడా రైజ్ యాక్ట్‌లో పొందుపర్చారు.

- ఇద్దరు అభ్యర్థుల్లో ఎక్కువ విద్యార్హత ఉన్న వ్యక్తికి ప్రాధాన్యం ఇస్తారు.
- సమాన ఒకే విద్యార్హతలుంటే ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ పాయింట్లను పరిగణనలోకి తీసుకుంటారు.
- ఈ విషయంలోనూ ఒకే విధమైన పాయింట్లు పొందితే వయసును పరిగణనలోకి తీసుకుని 25 ఏళ్ల వయసుకు దగ్గరగా ఉన్న అభ్యర్థిని ఎంపిక చేస్తారు.

ఏడాది వరకు అవకాశం


ఒకసారి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థికి వెంటనే వీసా మంజూరు కాకున్నా.. ఆ దరఖాస్తు ఏడాది పాటు (పన్నెండు నెలలు) గుర్తింపులో ఉంటుంది. నిర్దేశిత పన్నెండు నెలల వ్యవధిలో ఎలాంటి అవకాశం రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

కనీస వేతన నిబంధనే ఇబ్బందికరం

పాయింట్లపరంగా మన దేశస్థులు ముందంజలో నిలిచే అవకాశం ఉన్నా.. పాయింట్ల కేటగిరీల్లో వేతనాలకు కేటాయించిన పాయింట్లు నిబంధన మన అభ్యర్థులకు ఇబ్బందిగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రైజ్ యాక్ట్ ప్రకారం– కనీసం 1.3 లక్షల డాలర్లకు సమానమైన వేతనాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం అమెరికాలోని పలు సంస్థల్లో పని చేస్తున్న భారత యువత పొందుతున్న వేతనం సగటున 80 నుంచి 90 వేల డాలర్ల మధ్య ఉంటోంది. ఇలాంటి పరిస్థితిలో ఒక్కసారిగా కనీస వేతనాన్ని 1.3 లక్షల డాలర్లకు పెంచడం కంపెనీలకు కొంత ఇబ్బంది అనే వాదన వినిపిస్తోంది.

అయిదేళ్ల వరకు ప్రభుత్వ సదుపాయాలకు స్వస్తి

ఇప్పటివరకు అమెరికాలో అడుగుపెట్టినప్పటి నుంచే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు (విద్య, సామాజిక భద్రత తదితర) లభించేవి. రైజ్ యాక్ట్ ప్రకారం– మొదటి అయిదేళ్లు విదేశీ అభ్యర్థులకు ఎలాంటి సంక్షేమ పథకాలు వర్తించవు. దీంతో వృద్ధులైన తల్లిదండ్రులను డిపెండెంట్ వీసాతో తీసుకెళ్లేవారు ఆర్థికంగా కొంత భారం మోయాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. అయిదేళ్ల తర్వాత అభ్యర్థి పౌరసత్వాన్ని పొడిగిస్తే.. అన్ని పథకాలకు అర్హులవుతారు.





నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాలుకు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,800 (కనిష్ఠం)	రూ.5,150 (గరిష్ఠం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.2,000 (కనిష్ఠం)	రూ.4,800 (గరిష్ఠం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.4,000 (కనిష్ఠం)	రూ.8,140 (గరిష్ఠం)
ఉల్లి (కర్నూలు)	-----------	
చక్కెర (చెన్నై)	రూ.4,080	
బియ్యం (కరీంనగర్)	రూ.3,600 (హెచ్ఎంటీ)	
కందిపప్పు (చెన్నై)	రూ.7,500	
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)	
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	రూ.6,781	







అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ ఐపీవో 6 రెట్లు సబ్‌స్క్రైబ్

న్యూఢిల్లీ: ఆక్వాకల్చర్ ప్రొడక్టులను విక్రయించే అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఆరు రెట్లకుపైగా సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఐపీవోలో భాగంగా సంస్థ 62,10,000 షేర్లను విక్రయానికి పెట్టగా 3,78,71,280 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఈ లెక్కన చూస్తే ఇష్యూ 6.1 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయింది. హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్ విభాగంలో 7.82 రెట్లు సబ్‌స్క్రయిబ్ కాగా, రిటైల్ విభాగంలో మాత్రం ఏకంగా 8.46 రెట్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఆగస్టు 22న ప్రారంభమైన ఈ ఐపీవో 24న ముగిసింది. ఐపీవో ప్రైస్ బాండ్ రూ.171–175గా ఉంది. షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో లిస్ట్ అవుతాయి.

హెర్బల్ ఔషధ తయారీలోకి ఐఐఎల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యాక్సిన్ల తయారీ సంస్థ ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) హెర్బల్ ఔషధాల తయారీలోకి ప్రవేశించింది. ఈ విభాగంలో జంతువుల కోసం జస్‌ప్రే పేరుతో తొలి ఉత్పాదనను విడుదల చేసింది. పుండ్లు మానేందుకు ఈ ఔషధాన్ని వాడతారు. జస్‌ప్రే తయారీలో వాడిన హరిద్ర అనే పదార్థం పుండ్లు త్వరగా తగ్గిపోయేందుకు దోహదం చేస్తుందని ఐఐఎల్ ఎండీ కె.ఆనంద్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

సిగ్నా టీటీకే హెల్త్ నుంచి ప్రోహెల్త్ ప్లాన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సిగ్నా టీటీకే హెల్త్ ఇన్సూరెన్స్ విపణిలోకి ప్రోహెల్త్ ప్లాన్‌ను విడుదల చేసింది. దేశంలోనే తొలిసారిగా పాలసీదారుడికి సమగ్ర ఆరోగ్య సంరక్షణ ప్యాకేజీతో పాటూ రెండేళ్ల పాటు ప్రీమియం మినహాయింపు ప్రయోజనాలను అందిస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. రీఇష్యూరెన్స్ బెనిఫిట్స్ కింద ఎంపిక చేసిన అనారోగ్య సమస్యలు, శాశ్వత వైకల్యంతో ఉన్న పాలసీదారులకు రెండేళ్ల పాటు ప్రీమియం మినహాయింపు ఉంటుంది. అలాగే ఇన్‌ఫ్లేషన్ షీల్డ్ కింద ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి హోమ్ కేర్, డోనర్ కవర్, 1–5 లక్షల వరకు టాప్ అప్ ఎంపిక, ఆయుష్ కవరేజీ వంటి ప్రయోజనాలను అందుకోవచ్చని ప్రకటనలో వివరించింది. అమెరికాకు చెందిన సిగ్నా కార్పొరేషన్, మన దేశానికి చెందిన టీటీకే గ్రూప్ జాయింట్ వెంచరే సిగ్నా టీటీకే హెల్త్ ఇన్సూరెన్స్.



మూడోరోజూ లాభాల్లోనే...

ఫార్మా షేర్ల జోరు... ● స్వల్పంగా పెరిగిన సెన్సెక్స్, నిఫ్టీ ● సుప్రీం వివరణతో లిక్కర్ షేర్ల రయ్

ముంబై: అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు వెలువడినప్పటికీ... దేశీ స్టాక్ సూచీలు మాత్రం లాభాల హ్యాట్రిక్‌ను నమోదుచేశాయి. ప్రధానంగా దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడోరోజూ లాభాల్లో ముగిశాయి. గురువారం ట్రేడింగ్‌లో సూచీలు ఆద్యంతం పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. చివరకు సెన్సెక్స్ 28 పాయింట్ల పెరుగుదలతో 31,596 పాయింట్ల వద్ద, నిఫ్టీ 4 పాయింట్లు లాభపడి 9,857 వద్ద ముగిశాయి. గడిచిన రెండు రోజుల్లో సెన్సెక్స్ 309 పాయింట్లు పెరిగిన సంగతి తెలిసిందే. ప్రాథమిక సమాచారం ప్రకారం దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) నికరంగా రూ.1,044 కోట్ల మేర కొనుగోళ్లు జరపగా... విదేశీ మదుపరులు(ఎఫ్‌పీఐ) రూ.696 కోట్ల నికర అమ్మకాలు జరిపారు.

అమెరికాలో పరిణామాలపై దృష్టి...

మెక్సికో సరిహద్దు వెంబడి గోడను నిర్మించేందుకు తగిన నిధులను కేటాయించేందుకు అవసరమైతే ప్రభుత్వ కార్యకలాపాల నిలిపివేతకు (షట్‌డౌన్) కూడా వెనుకాడబోనని అమెరికా అధ్యక్షుడు చేసిన హెచ్చరికతో ముందురోజు వాల్‌స్ట్రీట్ నష్టాల్లో ముగిసింది. దీని ప్రభావంతో ఆసియాలో కూడా ప్రధాన సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి. మరోపక్క, ప్రపంచంలోని కీలక సెంట్రల్ బ్యాంకర్ల సదస్సు గురువారం అమెరికాలోని జాక్సన్‌హోల్‌లో ప్రారంభం కానున్న నేపథ్యంలో విధానపరంగా ఎలాంటి ప్రకటనలు ఉండొచ్చన్న దానిపై ఇన్వెస్టర్లు ప్రధానంగా దృష్టి సారించినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ ఆనంద్ జేమ్స్ పేర్కొన్నారు. ఇన్వెస్టర్ల అప్రమత్త ధోరణి కారణంగానే మన మార్కెట్లు కూడా పరిమిత శ్రేణిలో(రేంజ్ బౌండ్)లో కదలాడాయని చెప్పారు. ఇక వినాయక చవితి సందర్భంగా శుక్రవారం మార్కెట్లకు సెలవు కావడంతో ట్రేడింగ్ వరుసగా మూడు రోజులు ట్రేడింగ్‌కు విరామం రావడంకూడా ఇన్వెస్టర్ల అప్రమత్త ధోరణికి ఒక కారణమని ఆయన తెలిపారు.

> వినాయకచవితి సందర్భంగా నేడు (శుక్రవారం) స్టాక్ మార్కెట్లతోపాటు బులియన్,
> **నేడు మార్కెట్లకు సెలవు...**
> ఫారెక్స్, ఇతర కమోడిటీ మార్కెట్లన్నింటికీ సెలవు ప్రకటించారు.

ఫార్మా రయ్...

ఇటీవల కాలంలో భారీగా పడిన ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లకు దిగువస్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో దూసుకెళ్లాయి. ఈ రంగం సూచీ 2.53 శాతం ఎగసింది. సెన్సెక్స్ జాబితా ఉన్నవాటిలో లుపిన్ అత్యధికంగా 3.87 శాతం లాభపడగా, సన్ ఫార్మా 3.1 శాతం, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ 2.88 శాతం, సిప్లా 2.47 శాతం చొప్పున ఎగబాకాయి. జైడస్ క్యాడిలాకు చెందిన యాంటీ హైపర్‌టెన్షన్ ఔషధానికి అమెరికా ఎఫ్‌డీఏ అనుమతి లభించిన వార్తలతో క్యాడిలా హెల్త్‌కేర్ షేరు 7 శాతం రివ్వుమంది. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీ, క్యాపిటల్ గూడ్స్ సూచీలు కూడా లాభాల్లో నిలిచాయి. నందన్ నీలేకని ఇన్ఫీ చైర్మన్‌గా రీఎంట్రీ ఇవ్వనున్నారన్న వార్తలతో ఇన్ఫోసిస్ 2 శాతం ఎగసి రూ.913 వద్ద స్థిరపడింది. ఇంకా లాభపడిన షేర్లలో టాటామోటార్స్, టాటా స్టీల్, ఎస్‌బీఐ, ఎల్ అండ్‌టీ, పవర్‌గ్రిడ్ ఉన్నాయి. ఇక ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాల ప్రక్రియ వేగవంతం కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ముందుజోరు ర్యాలీ జరిపిన బ్యాంకింగ్ షేర్లలో గురువారం మళ్లీ నిస్తేజం ఆవహించింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లు స్వల్పంగా పెరగ్గా.. ప్రైవేటు బ్యాంకుల్లో చాలావరకూ మిశ్రమంగా ముగిశాయి.

లిక్కర్ షేర్లకు 'సుప్రీం' కిక్...

జాతీయ రహదారుల పక్కన లిక్కర్ షాపులపై విధించిన నిషేధం నగరాలు, మునిసిపాలిటీల పరిధిలోని వాటికి వర్తించబోదని సుప్రీంకోర్టు స్పష్టత ఇవ్వడంతో లిక్కర్ కంపెనీల షేర్లకు జోష్ లభించింది. యునైటెడ్ స్పిరిట్స్, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్, గ్లోబస్ స్పిరిట్స్, జీఎం బ్రూవరీస్ తదితర షేర్లు 12 శాతం వరకూ దూసుకెళ్లాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,007
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	24,543
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	10,13,215
ఎఫ్ఐఐ	-697
డీఐఐ	1,044

రెండు మూడేళ్లలో 8 శాతం వృద్ధి!

- పుష్కలంగా అవకాశాలున్నాయ్: నీతి ఆయోగ్
- మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక విడుదల
- సామాజిక రంగాల్లో సంస్కరణలపై సూచనలు
- ఆర్థిక, న్యాయ, నియంత్రణ వ్యవస్థల్లో కూడా...

న్యూఢిల్లీ: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు వచ్చే రెండు మూడేళ్లలో 8 శాతానికి పైగా నమోదవడానికి పుష్కలంగా అవకాశాలున్నట్లు నీతి ఆయోగ్ పేర్కొంది. అలాగే ఆర్థిక సంస్కరణల ఫలాలు దేశంలోనిమొత్తం 125 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనాలు సమకూర్చేలా ఉండాలని కూడా సూచించింది. ఆర్థిక, న్యాయ, నియంత్రణ వ్యవస్థలతోపాటు సామాజిక రంగాల్లో చేపట్టాల్సిన సంస్కరణలకు సంబంధించి 'మూడేళ్ల సమగ్ర ప్రణాళిక– 2017–18 నుంచి 2019–20'ని గురువారం ఆవిష్కరించింది. నల్లధనం, అవినీతి నిరోధం, పన్ను పరిధి పెంపు, సివిల్ సర్వీసులు, ఎన్నికల ప్రక్రియలో సంస్కరణ వంటి కీలక అంశాలపై సూచనలు కూడా ఇందులో ఉన్నాయి. భారత్ 2016–17 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 7.1 శాతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక (ఏప్రిల్–జూన్) జీడీపీ ఫలితాలు ఆగస్టు 31వ తేదీన వెలువడనున్న నేపథ్యంలో నీతి ఆయోగ్ తాజా ప్రణాళిక విడుదలైంది. . 211 పేజీల ప్రణాళికలోని కొన్ని ముఖ్యాంశాలు

- వచ్చే రెండు మూడేళ్లలో 8 శాతం వృద్ధికి చక్కటి అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనితో వచ్చే దశాబ్ద కాలంలో పేదరిక నిర్మూలన భారీగా జరిగే వీలుంది.
- కేంద్ర ప్రభుత్వ వ్యయాల విషయంలో భవిష్యత్ ప్రాధాన్యతపై దృష్టి ఉండాలి. అధిక ప్రాధాన్యతా రంగాలకు అదనపు కేటాయింపులు జరగాలి. ఇది వృద్ధి ప్రోత్సాహానికి దారితీస్తుంది.
- 2019–20 నాటికి అధిక నిధులను విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, రక్షణ, రైల్వేలు, రోడ్లు అభివృద్ధికి కేటాయించాలి.
- ఆయా అంశాల్లో పెట్టుబడులు దేశంలో పట్టణీకరణకు దారితీస్తుంది. దీనితో చౌక గృహాలు, మౌలిక రంగం, ప్రభుత్వ రవాణా వ్యవస్థ అభివృద్ధిసహా స్వచ్ఛ భారత్‌కు ప్రోత్సాహానికి దారితీస్తుంది.
- ఇక న్యాయ వ్యవస్థలో సంస్కరణల విషయానికి వస్తే– వివాదాల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు ఉండాలి. ఇందుకు వీలుగా మానవ వనరుల లభ్యత, పనితీరు, నైపుణ్యత పెరగాలి.
- సామాజిక రంగం విషయంలో విద్య, వైద్య రంగాలు మెరుగుపడాలి. మానవ వనరుల నైపుణ్యతలో పురోగతి ఉండాలి. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, తెగలు, మహిళల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి.
- రెగ్యులేటరీ వ్యవస్థ పటిష్టతకు తగిన చర్యలు.
- దేశంలోని కుటుంబాలన్నింటికీ నిరంతర విద్యుత్ సరఫరా, ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం, డీజిల్, పెట్రోల్ ధరల విధానంలో సంస్కరణలు, 100 స్మార్ట్ సిటీల్లో సిటీ గ్యాస్ సరఫరాకు ప్రాధాన్యత వంటి కీలక అంశాలు నీతి ఆయోగ్ సిఫారసుల్లో చోటుచేసుకున్నాయి.



ప్రణాళిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్థికమంత్రి జైట్లీతో (ఎడమ నుంచి) నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్ పనగడియా.

రుణాలతో వృద్ధి ప్రమాదమే!

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య



ముంబై: రెండంకెల భారీ వృద్ధి రేటును సాధించాలని పలు వర్గాల నుంచి అందుతున్న సూచనలు, వ్యక్తమవుతున్న అభిలాషలపై రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య తీవ్ర హెచ్చరికలు చేశారు. రుణాలను ఆధారం చేసుకుని 'రెండంకెల వృద్ధి'ని సాధిస్తే... అది పటిష్టంగా నిలబడే అవకాశం ఉండదని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదమూ ఉంటుందని హెచ్చరించారు. ఆసియా సొసైటీ ఇక్కడ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఆర్థిక వ్యవస్థ తగిన బాటలో పయనించేట్లు వ్యవస్థాపరమైన పటిష్టత ప్రస్తుతం ఆవశ్యకమని చెప్పారు. ఇది దీర్ఘకాల పటిష్ట, సుస్థిర వృద్ధికి దారితీస్తుందని తెలియజేశారు. ''ఒక్కోసారి కొన్ని అసెట్స్‌లోకి రుణ ఆధారిత నిధులు భారీగా రావడం వల్ల 9 నుంచి 10% వృద్ధి రేటు సాధన సాధ్యమవుతుందన్నది నా అభిప్రాయం. అయితే అలాంటి వృద్ధి రేటు దీర్ఘకాలంపాటు నిలబడదు' అని వివరించారు.

హీరా గ్రూప్‌కు రెండు అవార్డులు



హైదరాబాద్: బంగారు ఆభరణాల నుంచి సూపర్ మార్కెట్ల చైన్ దాకా పలు రంగాల్లో విస్తరించిన 'హీరా' గ్రూప్ వ్యవస్థాపకురాలు, సీఈవో నౌహిరా షేక్ తాజాగా 'బిజినెస్ లీడర్‌షిప్ ఐకాన్ అవార్డు–2017'ను సొంతం చేసుకున్నారు. ఇటీవల దుబాయ్‌లో ఇండియన్ బిజినెస్ అండ్ ప్రొఫెషనల్ కౌన్సిల్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. అలాగే వారం కిందట నౌహిరాకు 'ఉమెన్ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ద ఇయర్–2017' అవార్డు కూడా అందజేశారు. ఇంటర్నేషనల్ ఇండియా బిజినెస్ అవార్డు కమిటీ యూఏఈలో నిర్వహించిన ఇండియా–యూఏఈ బిజినెస్ సమిట్‌లో ఆమె ఈ అవార్డును తీసుకున్నారు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	29,060	▼	90
బంగారం (99.5, 10గ్రా)	28,910	▼	90
వెండి (కిలో)	38,710	▼	325
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	27,640	▼	60
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	29,650	▲	70
బంగారం (22 క్యారెట్లు)	27,720	▲	60
వెండి(కిలో)	39,355	▲	90
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	29,850		0
బంగారం (22 క్యారెట్లు)	27,680		0
వెండి(కిలో)	40,100	▲	100
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	29,920	▲	270
బంగారం (22 క్యారెట్లు)	27,530	▲	330
వెండి(కిలో)	39,500	▲	400
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	30,100		0
బంగారం (22 క్యారెట్లు)	27,900		0
వెండి(కిలో)	40,000		0
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	29,960	▼	100
బంగారం (22 క్యారెట్లు)	27,740	▼	90
వెండి(కిలో)	39,950	▼	250

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	47.14 (రాత్రి 11.30కు)	$48.41 (బుధవారం ముగింపు)
బ్రెంట్	51.66 (రాత్రి 11.30కు)	$52.57 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 25-8-2017

విశాఖ	362–00
చిత్తూరు	390–00
వరంగల్	357–00
ముంబై	400–00
చెన్నై	397–00
విజయవాడ	359–00
గోదావరి	359–00
నమక్కల్	387–00
24–8–2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	382–00
ఢిల్లీ	360–00
కోల్‌కతా	394–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1781.5	1801.9
ADANI PORT	380.05	385
AMBUJA CEME	275.4	276.65
ASIAN PAINT	1135.6	1141.3
AXIS BANK L	506.85	502.65
BAJAJ AUTO	2728.55	2754.65

A B C D

BAJAJ AUTO	2728.55	2754.65
3M INDIA LI	14725.65	14361.1
63 MOONS TE	61.15	62.05
8K MILES SO	509.1	497.05
AARTI DRUGS	516.2	517.25
AARTI INDUS	841.75	854.65
ABAN OFFSHO	175.65	173.75
ABBOTT INDI	4306.6	4298.4
BEARDSELL L	52.95	53
BEML LIMITE	1791	1804.05
BERGER PAIN	240.55	237.2
BF INVESTME	158.2	159.1
BF UTILITIE	325.2	325.6
BGR ENERGY	134.8	137.2
BHAGERIA IN	262.95	261.8
BHANSALI EN	88.1	86.85
BHARAT BIJL	1217.15	1169.95
BHARAT FIN	880.45	888.2
BHARAT FORG	1147.95	1165.95
DISH TV IND	79.55	80.3
DOLLAR INDU	2271.25	2227.5
DOLPHIN OFF	86.75	85.25
DONEAR IND.	56.8	57.35
DR. LAL PAT	807.6	808.8
DWARIKESH S	62.1	62.5
DYNAMATIC T	2135.3	2149.25
DYNEMIC PRO	118.5	117.25

E F G H

GUJARAT GAS	788.15	793.45
GUJARAT MIN	139.95	138.7
GUJARAT PIP	129.9	132.1
GUJARAT STA	193.1	197.5
GULF OIL LU	799.45	801.7
GULSHAN POL	81.35	81
HARITA SEAT	705.35	699.55
HARRISON MA	74.5	75.3
HATSUN AGRO	639.9	635.9
HEALTHCARE	271.95	270.8
HEG LTD	523.4	484

I J K L

JINDAL DRIL	160.95	160
JINDAL PHOT	67.8	64.45
JINDAL POLY	371.45	362.75
JINDAL SAW	91.6	90.75
JINDAL STAI	94.35	89.95
JINDAL STAI	181.4	183.8
JINDAL STEE	135.15	133.1
JINDAL WORL	850.1	887.15
JK CEMENT L	1013.45	1011.7
JK LAKSHMI	411.7	416.85
JK PAPER LI	99.25	97.05

M N O P

MANG.CHEM.F	65.55	62.1
MANGALAM CE	371.7	366.5
MANGALAM DR	140.75	139.9
MANPASAND B	825.3	830.85
MARATHON NX	276.05	280.05
MASTEK LTD	293.85	282.4
MAWANA SUGA	90.4	85.6
MAX FINANCI	601.25	606.2
MAX INDIA L	141.95	138.9
MAX VENTURE	85.75	86.45
MAYUR UNIQU	353.25	358.2
PERSISTENT	616.65	619.1
PETRON ENGG	130.95	129
PFIZER LTD	1813.2	1808.35
PG ELECTROP	319.8	320.75
PHILIPS CAR	630.4	620.1
PHOENIX LAM	205.45	207.75
PI INDUSTRI	728.7	734.8
PIONEER DIS	201.95	196.1
PLASTIBLEND	258.25	256.4
PNB GILTS L	53.3	53.2
PNB HOUSING	1552.65	1536.35

R S T U

SELAN EXPLO	196.05	186.6
SEQUENT SCI	118.5	116.1
SESHASAYEE	680.9	655.65
SHAKTI PUMP	498.6	494.4
SHALIM PAIN	210.75	211.5
SHANKARA BL	1154.95	1179.6
SHANTHI GEA	132.65	132.95
SHARDA CROP	457.9	435.65
SHARDA MOTO	2607.55	2663.65
SHEELA FOAM	1280.35	1249.95
SHEMAROO EN	335.5	336.95
THE INDIA C	177.3	178.15
THE INDIAN	110.9	111.65
THE MANDHAN	153.7	142.65
THE P K TEA	140.15	142.15
THE PHOENIX	515.75	547.7
THE RAMCO C	667.4	666.2
THE RUBY MI	315.15	307.95
THE STATE T	154.4	154.9
THE TINPLAT	142.8	143.15
THEMIS MEDI	455.95	464.9
THERMAX LTD	878.45	866.85

V W X Z

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

బీఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు





ఉండ్రాళ్లు



కావలసినవి
బియ్యపురవ్వ- కప్పు; నీళ్లు - రెండు కప్పులు; శనగపప్పు - పావు కప్పు(నానబెట్టాలి); జీలకర్ర - టీ స్పూన్; నెయ్యి - మూడు టీ స్పూన్లు; ఉప్పు-కొద్దిగ; పచ్చికొబ్బరి - 3 టేబుల్ స్పూన్లు

తయారి: ముందుగా మందపాటి పాత్రలో నెయ్యి వేసి కాగాక జీలకర్ర, శనగపప్పు వేసి కొద్దిగా వేయించాలి. అందులో నీరు పోసి, ఉప్పు వేసి, మరుగుతుండగా, బియ్యపు రవ్వ వేసి కలపాలి. సన్నని సెగ మీద ఉడికించాలి. చల్లారాక చెయ్యి తడిచేసుకుంటూ ఉండలు కట్టాలి. వీటిని ఆవిరి మీద ఉడికించి, దించి, తీసుకోవాలి.

బెల్లం తాలికలు



కావలసినవి:
బియ్యప్పిండి - గ్లాసు; గోధుమ పిండి - అర గ్లాసు; బెల్లం - 2 గ్లాసులు; ఎండు కొబ్బరి ముక్క లు - కొద్దిగా; నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు; జీడిపప్పు, బాదం పలుకులు - తగినన్ని; ఏలకుల పొడి - చిటికెడు

తయారి: అర గ్లాసు నీళ్లు పోసి, కొద్దిగా బెల్లం వేసి కరిగించాలి. దీంట్లో గోధుమపిండి వేసి చపాతీపిండిలా కలపాలి. కొద్ది కొద్దిగా పిండి తీసుకుంటూ సన్నగా తాల్చాలి. గిన్నెలో ఒకటిన్నర గ్లాసుల నీళ్లపోసి మరుగుతుండగా బెల్లం కరిగించి, తాలికలను ఉడికించాలి. దీంట్లో బియ్యప్పిండి పోస్తూ, ఉండలు లేకుండా కలపాలి. మిశ్రమం బాగా ఉడికాక, ఏలకుల పొడి వేయించిన బాదం జీడి పప్పు పలుకులు, కొబ్బరి ముక్కలు కలపాలి.

శివసుతుని దివ్య చమత్కారం

భూ కైలాస్



శివుడు భక్త సులభుడు. రావణుడు భక్త ధురంధరుడు. శివుడికి భక్తుడు కావాలి. రావణుడికి శివుడు కావాలి. ఈ రెండూ విచక్షణ కోల్పోతే మానవులకూ దేవతలకూ ఉపద్రవం వచ్చి పడుతుంది. దానిని నిలువరించే శక్తి కావాలి. ఆ శక్తే విఘ్నేశ్వరుడు. చివరి నిమిషంలో ఆయన చూపిన చమత్కారమే 'భూ కైలాస్' కథ.

● ❖ ●

రావణుడు విశిష్ట శివభక్తుడు. రావణుడి తల్లి కైకసి నిత్య హరనామస్మరణలో తరియించే భక్తాగ్రేసరురాలు. ఆమె ప్రతినిత్యం సముద్రపు ఒడ్డున సైకత లింగం ప్రతిష్ఠించి దానికి పూజలు చేసి ఆ ప్రసాదాన్ని తన పుత్రుడు రావణుడికి ఇస్తుంటుంది. ఆ ప్రసాద బలమే రావణుడి మహాబలం. ముల్లోకాలను గడగడలాడించగల ప్రచండబలం. అప్పటికే రావణుడు భూలోకాన్ని జయించాడు. అంతటితో తృప్తి తీరక అమరపురిపై దండెత్త దలిచాడు. అదే గనక జరిగితే దేవేంద్రుని పీఠం కదిలిపోతుంది. నారాయణుని ఉనికికి సవాలు ఎదురవుతుంది. నారదుడు ఇది గ్రహించి దేవేంద్రుణ్ణి రావణుడిపై ఉసిగొలుపుతాడు. కైకసి ఆరాధించే సైకత లింగపూజను భగ్నం చేసి ఆ ప్రసాద బలం రావణుడికి అందకుండా చేయమంటాడు. దేవేంద్రుడు అలలలో దూరి సైకత లింగాన్ని కబళిస్తాడు. పూజను నీటిపాలు చేస్తాడు. కైకసి దీనిని దుశ్శకునంగా భావిస్తుంది. శివుడికి అపచారం జరిగిందని తల్లడిల్లుతుంది. తల్లి వేదనను గ్రహించిన రావణుడు నిత్యం తయారు చేసుకునే సైకత లింగమేలా... ఆ పరమేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకుని ఏకంగా అతని ఆత్మలింగమే తీసుకొని వస్తానని శపథం చేస్తాడు.

ఏదో చేయబోతే ఏదో అయినట్టు అదే గనక జరిగితే భూలోకమే కైలాసం అవుతుంది. దేవగణాలన్నీ ఆత్మలింగం ఉన్న చోటుకే తరలివచ్చి దేవపురి దివాలా తీస్తుంది. అందుకే దేవేంద్రుడు రావణుని ఘోర తపస్సును భగ్నం చేయబూనుకుంటాడు. త్రాచులను వదులుతాడు. కొండ చిలువలను చుట్టబెడతాడు. అప్పటికీ చలించకపోతే ఆఖరు అస్త్రంగా దేవ వేశ్యలను దించుతాడు. అయినప్పటికీ రావణుడు బెసకడు. లొంగడు. సంకల్పం నుంచి చెదరడు.

ఆ తపస్సుకు మెచ్చి శంకరుడు పార్వతీ సమేతంగా ప్రత్యక్షమవుతాడు. మరు నిమిషంలో ఆ ఆదిదేవుడు భక్తుని కోరిక మేరకు ఆత్మలింగం సమర్పించేవాడే. కాని అంతలోనే విష్ణువు విష్ణుమాయను చూపుతాడు. రావణుడిలో మాయను ప్రవేశపెట్టి ఆత్మలింగానికి బదులు ఏకంగా పార్వతినే తన పత్నిగా చేయమని అడిగేలా చేస్తాడు.

జగన్మాతను ఆశించిన ఆ కోరిక నాశన హేతువు.

అయినప్పటికీ వచనబద్ధుడైన శివుడు ఇచ్చిన మాట కాదనలేక పార్వతిని రావణుడికి అప్పజెప్పుతాడు. శివ వియోగంతో తల్లడిల్లిన పార్వతి దీనికంతటికీ కారణం విష్ణుమాయ అని గ్రహించి 'ఓ నారాయణుడా... నా వియోగబాధ నీకు అర్థమవ్వాలంటే భూలోకాన మానవ జన్మ ఎత్తి సతీ వియోగంతో ఇంతకింత బాధ అనుభవించు' అని శపిస్తుంది.

అది విని నారదుడు ఆనందబాష్పాలు రాలుస్తాడు.

ఎందుకంటే రావణుడి అంతం రాముడి చేతిలో ఉంది. రాముడి జన్మకు ఈ శాపమే కారణమవుతోంది.

ఈ శాపం ఇచ్చాక పార్వతి రావణుణ్ణి మాయ చేసి తిరిగి శివుని సన్నిధికి చేరుకుంటుంది. మరోవైపు రావణుడు పాతాళ లోకాధిపతి అయిన మయాసుర కుమార్తె మండోదరిని చూసి ఆమే మాయారూపంలో ఉన్న పార్వతి అనుకుని ఆమెను కాంక్షిస్తాడు. వివాహం చేసుకుని లంకకు తీసుకుని వస్తాడు.

సాక్షాత్తూ పార్వతీదేవిని వివాహం చేసుకుని వచ్చిన రావణుణ్ణి చూసి రావణుని తల్లి కైకసి హతాశురాలవుతుంది. శివద్రోహి, మాతృద్రోహి అంటూ రావణుణ్ణి దూషిస్తుంది. అప్పటికిగాని రావణుడిలోని విష్ణుమాయ వదిలిపోదు. ఆత్మలింగానికి బదులు





పార్వతీదేవిని వాంఛించడం, మండోదరిని పార్వతి దేవే అనుకొని వివాహం చేసుకోవడం ఇవన్నీ గుర్తుకు వచ్చిన రావణుడు పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు. మండోదరిని భార్యగా స్వీకరించి ఈసారి నిజంగా ఆత్మలింగం సాధించుకొని రావడానికి బయలుదేరుతాడు.

● ❖ ●

ఘోర తపస్సు జరుగుతుంది. రావణుడు తన తలను ఖండించుకుని శివుడికి అర్పణం చేస్తాడు.

శివుడు మరి నిలువలేక ప్రత్యక్షమై వక్షస్థలం నుంచి దివ్య తేజస్సుతో ప్రజ్వరిల్లుతున్న ఆత్మలింగాన్ని పెకలించి రావణుని చేతిలో పెడతాడు. 'లంకకు చేరుకునే వరకు ఈ లింగాన్ని నేలకు దించకు. ఎక్కడ దించితే అక్కడే అది స్థిరపడిపోతుంది. దానిని కదల్చడం స్వయంగా నా వల్ల కూడా కాదు' అని చెప్తాడు.

రావణుడు ఆత్మలింగం తీసుకుని బయలుదేరుతాడు.

అదే జరిగి ఆత్మలింగం లంకకు చేరితే రావణుడు మరింత శక్తిమంతుడవుతాడు. మరింత పెట్రేగుతాడు. అందుకనే నారదుడు విఘ్నేశ్వరుణ్ణి శరణుజొచ్చుతాడు.

'విఘ్నేశ్వరా. నీకు ప్రథమ పూజ చేయకుండా అవిఘ్నంగా రావణుడు ఆత్మలింగాన్ని పట్టుకు పోతున్నాడు' అని నివేదిస్తాడు. విఘ్నేశ్వరునికి కోపం వస్తుంది. 'రావణుడు అంత పని చేస్తాడా' అని బ్రాహ్మణ బాలుని రూపంలో రావణుడి దారిలో కాపు కాస్తాడు. ఇదే అదనుగా విష్ణుమూర్తి తన చక్రాన్ని సూర్యుడికి అడ్డం పెట్టి సంధ్యా సమయాన్ని సృష్టిస్తాడు. అది గమనించిన రావణుడు సంధ్య వార్చడానికి వెళ్లి వస్తానని దారిలో కనిపించిన విఘ్నేశ్వరుని చేతిలో ఆత్మలింగాన్ని పెడతాడు. తాను వచ్చే వరకు దానిని నేలకు దించవద్దని సూచిస్తాడు.

కాని మాయా రూపంలో ఉన్న విఘ్నేశ్వరుడు 'నేను ముమ్మార్లు నిన్ను పేరు పెట్టి పిలుస్తాను. వచ్చావా సరేసరి. లేదంటే లింగాన్ని కింద పెట్టేస్తాను' అంటాడు. రావణుడు సంధ్య వారుస్తుండగా గబగబా ముమ్మార్లు రావణుని పేరు పిలిచి లింగాన్ని నేలకు దించేస్తాడు.

ఇంకేముంది. ఆత్మలింగం తక్షణమే అదే స్థలిలో ప్రతిష్ఠితమైపోతుంది.

రావణుడు ఎంతో విలపిస్తాడు. విఘ్నేశ్వరుణ్ణి దుర్భాషలాడతాడు. తల మీద మొట్టుతాడు. లింగాన్ని ఊడ పెరకడానికి ప్రయత్నించి విఫలమవుతాడు. తుదకు ఆత్మలింగాన్ని అక్కడే వదిలిపెట్టి లంకకు పయనమవుతాడు. అలా అసురుని బారిన పడాల్సిన ఆత్మలింగం విఘ్నేశ్వరుని పుణ్యమా అని భూలోకాన ప్రతిష్ఠితమై మానవుల పూజలను అందుకునే దివ్యలింగంగా నేటికీ అలరారుతోంది.

అలా ఆత్మలింగం ప్రతిష్ఠితమైన పుణ్యక్షేత్రమే కర్నాటకలో ఉన్న గోకర్ణం. అక్కడ పూజలందుకుంటున్న మహాబలేశ్వర లింగమే నాటి ఆత్మలింగం.

● ❖ ●

'గోకర్ణం' క్షేత్ర కథ ఆధారంగా ఏ.వి.ఎం ప్రొడక్షన్స్‌వారు 1958లో తీసిన చిత్రమే 'భూకైలాస్'. ఎన్టీఆర్ రావణాసురుడిగా, జమున మండోదరిగా, అక్కినేని నారదుడిగా నటించిన ఈ సినిమా ఆబాలగోపాలాన్ని అలరించి హిట్‌గా నిలిచింది. తమిళనాడులో రావణుడికి ఉన్న ఆదరణ దృష్ట్యా ఇదే సినిమా అక్కడ 'భక్త రావణ'గా అనువాదమై విడుదలైంది. నిజానికి ఈ సినిమా రావణుని అమాయక, అచంచల భక్తికి ఒక మచ్చుతునక. శివుని మీద అతడికున్న భక్తి, అతడి వీరత్వం, నిజాయితీ దేవతల పథక రచన, పన్నాగం ఈ సినిమాలో కనిపిస్తాయి. అందరూ కలిసి రావణుని దారి మళ్లించి అతడికి దక్కవలసిన ఆత్మలింగాన్ని దక్కకుండా చేస్తారు. అయినప్పటికీ రావణుడు అఖండ శివభక్తునిగా పురాణాల్లో నమోదయ్యాడు. అతని వంటి శివభక్తుడు మరొకడు లేదు. ఎన్టీఆర్ రావణుని పాత్రను పాలధార వంటి స్వచ్ఛతతో పోషించి ఆకట్టుకుంటే అక్కినేని నారద పాత్రకు ఉండాల్సిన వంచనా శిల్పాన్ని ప్రదర్శించి మెప్పిస్తారు. సముద్రాల మాటలూ పాటలూ అందించిన ఈ సినిమాకు ఆర్. సుదర్శనం సంగీతం అందించారు. 'దేవ దేవ ధవళాచల మందిర'... , 'నీలకంధరా దేవా'..., 'రాముని అవతారం రవికుల సోముని అవతారం'... పాటలు రంజింప చేస్తాయి. రావణుని తపస్సును భగ్నం చేయడానికి వచ్చిన దేవ కన్యగా సుప్రసిద్ధ డాన్సింగ్ స్టార్ హెలన్ కనిపించి 'సుందరాంగ అందుకోరా' పాటలో అలరిస్తుంది. ఆ పాట కూడా హిట్టే.

పురాణాల్లో అసురులే గొప్ప దైవభక్తులు. వారి వరాల్లో దోషం వుండొచ్చుగాని వారి భక్తిలో లేదు. 'భూకైలాస్' కూడా అటువంటి ఉదంతానికి ఒక ఉదాహరణ.

- కె



తొలి పూజ గణపతికే

ఉత్తర కర్నాటక జిల్లాలో అరేబియా సముద్రం ఒడ్డున 'గోకర్ణం' క్షేత్రం ఉంది. ఇక్కడే ఆత్మలింగ క్షేత్రంగా చెప్పుకునే మహాబలేశ్వర ఆలయం ఉంది. పూర్తిగా భూమిలోకి ఉన్నట్టుగా ఉండే ఈ లింగం నిత్యం నిజ రూపంలో దర్శనం ఇవ్వకపోయినా పన్నెండేళ్లకొకసారి ఇచ్చే నిజ దర్శనంలో దీని పైకొస చేతులతో లాగినట్టుగా ఉండటం చూడవచ్చు. రావణుడి చేతి గుర్తులు ఈ లింగంపై ఉంటాయంటారు. అలాగే ఈ క్షేత్రంలో మహాగణపతి ఆలయం ఉంది. ఆ మూల విరాట్టు శిరస్సు మీద చిన్న సొట్ట ఉంటుంది. ఇది ఆనాడు రావణుడు చేతితో మొట్టడం వల్ల పడిన సొట్టగా అభివర్ణిస్తారు. ఈ క్షేత్రంలో ఆత్మలింగాన్ని దర్శించుకోవాలంటే ముందుగా మహా గణపతిని పూజించాలి. ఆనాడు తనకు తొలి పూజ జరగకపోవడం వల్ల కోప్పడిన వినాయకుడు అందుకు ప్రతిఫలంగా ఈనాడు ఇక్కడ తొలిపూజలు అందుకుంటున్నాడన్న మాట.

